www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శుక్రవారం
15-11-2024

సంపుటి : 01 । సంచిక : 193 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






## కారుణ్య నియామకం హక్కు కాదు

### అలాంటి నిబంధన ఏదీ లేదు.. సుప్రీం కోర్టు స్పష్టీకరణ

**ఢిల్లీ:** కారుణ్య నియామకం ద్వారా ప్రభుత్వ ఉద్యోగం పొందడం హక్కు కాదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే ఆయన కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలనే నిబంధన ఏదీ లేదని తెలిపింది. **మిగతా2లో...**



## లైఫ్ సైన్సెస్ కంపెనీల ఏర్పాటుకు కొత్త పాలసీ

- రాష్ట్రం ముందంజలో ఉండాలని ప్రభుత్వం చొరవ
- మంత్రి శ్రీధర్‌బాబు

**విశ్వంభర, హైదరాబాద్:** లైఫ్ సైన్సెస్ కంపెనీల ఏర్పాటుకు సంబం ధించి రాష్ట్ర ప్రభుత్వం త్వరలో కొత్త పాలసీని తీసుకురాబోతుందని ఐటీ, పరిశ్రమల **మిగతా2లో...**

## అధికారం కోసం సమాజాన్ని విభజించే ప్రయత్నం

ఎన్నికల్లో విజయం కోసం దాన్నే నమ్మిన కాంగ్రెస్

రిజర్వేషన్లకు ఆ పార్టీ వ్యతిరేకం

నేటివరకూ ఆ పార్టీలో మార్పు లేదు

ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ



2

**ప్రధాని మోదీకి మరో అత్యున్నత పురస్కారం** 2



## నాణ్యమైన భోజనం పెట్టకుంటే జైలుకే



### విద్యార్థుల కలలను నిజం చేయడమే మా లక్ష్యం

విద్య పురోగతిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది

రూ.5వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తాం

బాలల దినోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకుంటే జైలుకు పంపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను హెచ్చరించారు. అధికారులు జిల్లాల్లో రెండు రోజుల పాటు పాఠశాలలను పర్యవేక్షించాలని, విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యంతో మంచి అన్నం పెట్టాలన్నారు. దొడ్డు బియ్యం, కుళ్లిన కూరగాయలతో భోజనం పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. విద్యార్థుల కలలను నిజం చేయడమే తమ లక్ష్యమని అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ''రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి బాలల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. జవహర్‌లాల్ నెహ్రూ భారత తొలి ప్రధానే కాదు.. దేశాన్ని ప్రపంచం ముందు గొప్పగా చూపించిన నేత. నవీన భారత రూపశిల్పి నెహ్రూ. రూ.5వేల కోట్లతో రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు **మిగతా2లో...**

### ఎమ్మెల్యేగా పోటీ చేసే అభ్యర్థుల వయోపరిమితి తగ్గించాలి

21 ఏళ్ల వారు ఆ పదవికి అర్హులు కావాలి

అండర్ -18 మాక్ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి



2

### కుట్ర అంటూ తప్పుడు ప్రచారం

- కొడంగల్‌లో ఫార్మా విలేజ్ ద్వారా అమృతం వస్తుందా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2

### ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా రఘురామ ఏకగ్రీవ ఎన్నిక

ప్రకటించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అభినందించిన సీఎం చంద్రబాబు



2



2

### ఎన్నికల అధికారిపై దాడి చేసిన ఎంపీ అభ్యర్థి

- హింసాత్మక ఘటనలకు దారితీసిన అరెస్టు
- పోలీసులపైకి రాళ్లు రువ్విన మద్దతుదారులు
- 80 వాహనాలకు నిప్పుపెట్టిన ఆందోళనకారులు
- రాజస్థాన్‌లో టెన్షన్ టెన్షన్!



### రాష్ట్రంలో పండిన ప్రతి గింజను కొంటాం

- పూర్తి పారదర్శకంగా కొనుగోళ్ల ప్రక్రియ
- కొనుగోలు కేంద్రం వద్దే రైతులను రసీదులు ఇవ్వాలి: మంత్రి జూపల్లి

2

## ప్రభుత్వ వైఫల్యమేంటో చెప్పండి



దేశానికే తెలంగాణ రోల్ మోడల్ కాబోతోంది

అధికారం కోల్పోయినప్పుడల్లా బీఆర్ఎస్ నేతలు ప్రజలను రెచ్చగొడుతున్నారు

డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

**విశ్వంభర, హైదరాబాద్:** అధికారం కోల్పోయినప్పుడల్లా బీఆర్ ఎస్ నేతలు ప్రజలను రెచ్చగొడుతున్నారని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. ప్రభుత్వ వైఫల్యం ఏంటో కేటీఆర్ చెప్పాలని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ''నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడమే ప్రభుత్వ వైఫల్యమా? రైతు రుణమాఫీ చేయడం వైఫల్యమా? ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెట్టడం ప్రభుత్వ వైఫల్యమా? ఫార్మా క్లస్టర్స్ విస్తరణను వ్యతిరేకించడం బుద్ధి తక్కువ పని. కక్ష పూరిత రాజకీయాలకు మేం వ్యతిరేకం. ప్రతిపక్షంగా బీఆర్ ఎస్ తన పాత్ర పోషించిందా? ఉన్న ప్రభుత్వాన్ని కూల్చడంపైనే ఆ పార్టీ దృష్టి పెట్టింది. కులగణన చేస్తామని మాట ఇచ్చాం. దాని ప్రకారం చేసి చూపిస్తున్నాం. ఇది విప్లవాత్మక నిర్ణయం.. రాష్ట్రాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. దేశానికి తెలంగాణ రోల్ మోడల్ కాబోతుంది. అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకునే ప్రశ్నలు తయారు చేశాం'' అని భట్టి విక్రమార్క అన్నారు.


మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

## గత ఐదేళ్లలో పైసా పెట్టుబడి రాలేదు

- 227 ఎంవోయూలు జరిగాయి
- కరెంటు చార్జీల పెంపుతో పరిశ్రమలకు దెబ్బ
- ప్రోత్సాహకాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు
- బడ్జెటు సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు



**విశ్వంభర , అమరావతి:** గడచిన ఐదేళ్లలో 227 ఎంవోయూలు జరిగినా రాష్ట్రానికి పైసా పెట్టుబడి రాలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. గత ఐదేళ్లలో పన్నులు, కరెంటు ఛార్జీలు పెంచటం వల్ల పరిశ్రమలు మనుగడ సాధించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని గుర్తు చేశారు. ''1995 కంటే ముందు లైసెన్స్ రాజ్ కారణంగా పెట్టుబడులు రాలేదు. **మిగతా2లో...**



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 90 | రిటైల్ ₹ 112 |
| స్కిన్ ₹ 162 | స్కిన్ లెస్ ₹ 185 |

### నన్ను అక్రమంగా కేసులో ఇరికించారు

- పోలీసులు చెప్పేవి నిజం కాదు
- హైకోర్టులో నరేందర్‌రెడ్డి క్వాష్ పిటిషన్



2

# లైఫ్ సైన్సెస్ కంపెనీల ఏర్పాటుకు కొత్త పాలసీ




(మొదటి పేజీ తరువాయి)
శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, మెడ్‌టెక్ రంగాల్లో ప్రపంచ స్థాయిలో రాష్ట్రం మరింత ముందంజలో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చొరవ తీసుకుంటోందని ఆయన వెల్లడించారు. ఏడాది పాలనలో లైఫ్ సైన్సెస్‌లో సాధించిన అభివృద్ధికి సంబంధించిన వివరాలను మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ''పది నెలల వ్యవధిలో రూ.35 వేల కోట్ల పెట్టుబడులు, 51 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించాం. 141 దేశీయ, బహుళ జాతి కంపెనీలు ఔషధ, టీకాలు, లైఫ్ సైన్సెస్, పరిశోధన రంగాల్లో నిర్మాణాలు మొదలు పెట్టడం, పూర్తి చేసుకుని ఉత్పాదన మొదలు పెట్టే దశల్లో ఉన్నాయి. ఇవన్నీ పూర్తయితే 51,086 మందికి ఉద్యోగాలు దొరుకుతాయి. మరో లక్షన్నర మంది పరోక్షంగా ఉపాధి పొందుతారు. దేశంలో ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో కొత్త కంపెనీలకు హైదరాబాద్ కేంద్ర బిందువుగా ఉంది. రాష్ట్రంలో ఒకే చోట కాకుండా పలు ప్రాంతాల్లో ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఈ పరిశ్రమల్లో ఆధునిక కాలుష్య నియంత్రణ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా అనుమతులు ఇచ్చినప్పుడే నిబంధనలు విధిస్తున్నాం. ఆసియాలోనే మూడో అతిపెద్దదైన జపాన్‌కు చెందిన టకెడా లైఫ్ సైన్సెస్ సంస్థ స్థానిక బయోలాజికల్-ఇ తో కలిసి ఏటా 5 కోట్ల డెంగీ వ్యాక్సిన్లు ఉత్పత్తి చేస్తోంది. ఫార్మా క్లస్టర్లకు సంబంధించి ప్రజల డిమాండ్లు నెరవేర్చాకే భూసేకరణ చేపడతాం'' అని శ్రీధర్ బాబు తెలిపారు.

## కుట్ర అంటూ తప్పుడు ప్రచారం

**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డికి తానంటే చాలా ప్రేమ ఉన్నట్టు ఉందని.. అందుకే తనను టార్గెట్ చేస్తున్నారని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం మీడియా ప్రతినిధులతో పలు అంశాలపై ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. లగచర్ల భూ సేకరణలో తీవ్రంగా భంగపడిన ప్రభుత్వం కుట్ర అంటూ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆక్షేపించారు. ఘటన జరిగినప్పుడు అక్కడ లేని బీఆర్ ఎస్ కార్యకర్తలను కూడా తీసుకెళ్లి అమానుషంగా కొట్టారని ఆరోపించారు. సురేశ్ అనే వ్యక్తి బీఆర్ ఎస్ కార్యకర్తే.. ఆయనకు భూమి ఉందని తెలిపారు. లగచర్ల ఘటనలో పూర్తిగా ఇంటెలిజెన్స్, పోలీసుల వైఫల్యం ఉందని వ్యాఖ్యానించారు. రైతులపై దాడికి పోలీసులు కూంబింగ్ ఆపరేషన్‌కు వెళ్లినట్టు వెళ్లారని మండిపడ్డారు. ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ అని రేవంత్ రెడ్డి మాటలు చెబుతున్నారు.. కానీ అవి సాధ్యం కాదన్నారు. కొడంగల్‌లో ఫార్మా విలేజ్ ద్వారా అమృతం వస్తుందా? అని ప్రశ్నించిన ఆయన.. ప్రజలు కూడా ఇదే విషయాన్ని అడుగుతున్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రికి తన సొంత నియోజకవర్గంపై కూడా పట్టులేదన్నారు. తాము సీఎం నియోజకవర్గంలోనే కలెక్టర్‌పై దాడి చేసేంత బలమైన వ్యక్తులమా? అని నిలదీశారు. ప్రాజెక్టులు, పెట్టుబడులు తేవాలంటే ఎంతో కష్టపడాలని... ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు హరీశ్‌రావు ఎంత కష్టపడ్డారో గుర్తు లేదా అని కేటీఆర్ అన్నారు. వీళ్లకు ప్రభుత్వాన్ని నడపటం చేతకావటం లేదని వ్యాఖ్యానించారు.

## ఎన్నికల అధికారిపై దాడి చేసిన ఎంపీ అభ్యర్థి

**జైపూర్:** రాజస్థాన్ టోంక్ జిల్లాలోని సమరావత్ గ్రామంలో ఎన్నికల విధుల్లో ఉన్న అధికారిని స్వతంత్ర అభ్యర్థి నరేశ్ మీనా చెంప దెబ్బ కొట్టిన వ్యవహారం హింసాత్మక ఘటనలకు దారి తీసింది. అందరూ చూస్తుండగానే నరేశ్ మీనా, ఎస్‌డీఎం అమిత్ చౌధరి చెంపపై కొట్టారు. పోలీసులు నరేశ్ మీనాను అరెస్టు చేసేందుకు యత్నించగా ఆయన మద్దతుదారులు అడ్డుపడి రాళ్లు రువ్వారు. దాదాపు 80 వాహనాలకు నిప్పు పెట్టారు. అందులో పలు పోలీసు వాహనాలు, 60 ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయి. ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. నరేశ్ మీనాపై ఆస్తుల ధ్వంసం, ఎన్నికల విధులకు అడ్డుపడటం సహా 4 కేసులు నమోదు చేశారు. ఎన్నికల అధికారిపై దాడిని నిరసిస్తూ రాజస్థాన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారులు నిరసన వ్యక్తం చేశారు. సమరావత్ గ్రామంలో ఉన్న నరేశ్ మీనాను అదుపులోకి తీసుకునేందుకు గురువారం వందల సంఖ్యలో పోలీసులు వెళ్లారు. లొంగిపోవాలని పోలీసులు సూచించినా ఆయన వినలేదు. దీంతో బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. నరేశ్ మీనాను పోలీసులు తీసుకెళ్లడాన్ని నిరసిస్తూ ఆయన మద్దతుదారులు రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. ఈ క్రమంలోనే కొందరు మద్దతుదారులు సమీపంలోని ఓ రహదారిపై టైర్లను అడ్డుపెట్టి నిప్పు పెట్టారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న పోలీసులు వాటిని తొలగించారు. బుధవారం నాటి రాళ్ల దాడి ఘటనకు సంబంధించి 60 మందిని అదుపులోకి తీసుకున్నారు. రాళ్ల దాడిలో గ్రామస్థులు మాత్రమే కాకుండా బయటి నుంచి వచ్చిన వ్యక్తులు పాల్గొన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కాంగ్రెస్ రెబల్ నేత అయిన నరేశ్ మీనా బుధవారం పోలింగ్ విధులు నిర్వహిస్తున్న అమిత్ చౌధరి కాలర్ లాగి చెంప దెబ్బ కొట్టారు. సమరావత్ గ్రామాన్నిదేవలీలో కాకుండా ఉనియారా తహసీల్ లో కలపాలని ఆ గ్రామస్థులు డిమాండ్ చేస్తూ ఉప ఎన్నికను బహిష్కరించారు. వారికి నరేశ్ మీనా మద్దతు ప్రకటించారు. ఈ క్రమంలోనే ఓటు హక్కు వినియోగించుకోవాలని సమరావత్ గ్రామస్థులకు అమిత్ చౌధరి సూచించారు. పలువురితో అమిత్ చాధరి ఓటు వేయించారని ఆగ్రహం చెందిన నరేశ్ మీనా అందరూ చూస్తుండగానే ఆయన కాలర్ పట్టుకుని చెంపై కొట్టారు.

## నన్ను అక్రమంగా కేసులో ఇరికించారు

**విశ్వంభర, హైదరాబాద్:** తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ లగచర్ల ఘటనలో ఏ1 నిందితుడిగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ప్రభుత్వాధికారులపై దాడి కేసులో చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న నరేందర్ రెడ్డిని గురువారం న్యాయవాదులు కలిశారు. వారి ద్వారా కోర్టుకు నరేందరెడ్డి అఫిడవిట్ పంపించారు.
''బుధవారం ఉదయం కేబీఆర్ పార్క్ వద్ద మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో నన్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బలవంతంగా కారులో ఎక్కించి వికారాబాద్ డీటీసీకి తీసుకెళ్లారు. ఆ సమయంలో పోలీసులు నా స్టేట్‌మెంట్ తీసుకోలేదు. కోర్టులో హాజరుపరిచే 10 నిమిషాల ముందు కొన్ని పేపర్లపై నా సంతకాలు తీసుకున్నారు. నన్ను అక్రమంగా ఈ కేసులో ఇరికించారు. అరెస్టుకి ముందు నాకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. కేటీఆర్ సహా ఇతర ముఖ్యనేతల ఆదేశాలతో దాడులు చేయించినట్లు పోలీసులు కట్టుకథ చెప్పారు. నేను పోలీసులకు ఎలాంటి వాగ్మూలం ఇవ్వలేదు. రిమాండ్ రిపోర్టులో పోలీసులు చెప్పినవన్నీ నిజం కాదు. నా స్టేట్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకొని విచారణ చేయాలి'' అని కోర్టుకు పంపించిన అఫిడవిట్‌లో నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. మరో వైపు నరేందర్‌రెడ్డిని 7 రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు వికారాబాద్ జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం విచారణ జరగనుంది.

# నాణ్యమైన భోజనం పెట్టకుంటే జైలుకే

(మొదటి పేజీ తరువాయి)



నిర్మిస్తాం. ఇటీవలే హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం. రాష్ట్రంలో గత పదేళ్లలో 5వేల పాఠశాలలు మూతపడ్డాయి. బడ్జెట్‌లో 7 శాతానికి పైగా నిధులు విద్యాశాఖకు కేటాయించాం. ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలని పదోన్నతులు ఇచ్చాం, బదిలీలు చేశాం. 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేశాం. టీచర్ పోస్టుల భర్తీ ద్వారా విద్యపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని నిరూపించాం'' అని సీఎం తెలిపారు.

**ప్రభుత్వ బడుల ప్రతిష్ట పెంచే బాధ్యత టీచర్లదే**

''ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. వర్సిటీలకు ఉపకులపతులను నియమించాం. విద్యా వ్యవస్థను బాగు చేసేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ టీచర్లకు ఉన్న అర్హత ప్రైవేటు ఉపాధ్యాయులకు లేదు. అయినా పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించడానికి ఇష్టపడట్లేదు. ప్రభుత్వ బడుల ప్రతిష్ట పెంచే బాధ్యత టీచర్లదే. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో విద్యార్థులను కలిసి సమస్యలు తెలుసుకోవాలి. నవంబర్ 14 నుంచి డిసెంబర్ 7 వరకు విజయోత్సవాలు నిర్వహిస్తున్నాం. అనుకున్న విధంగా బాలల దినోత్సవం రోజున ఉత్సవాలు ప్రారంభించాం. గత సీఎంను ఏనాడైనా మీరు (విద్యార్థులను ఉద్దేశించి) చూశారా? మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులను ఏనాడైనా చూశారా? ఈ రోజు మీ రేవంత్ అన్న మీతో చేయి కలిపాడా.. లేదా? దేశానికి ఆదర్శంగా ఉంటామని.. ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాబోమని విద్యార్థులు ప్రమాణం చేయాలి'' అని సీఎం కోరారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేగా పోటీ చేసే అభ్యర్థుల వయోపరిమితి తగ్గించాలి

**విశ్వంభర, హైదరాబాద్:** ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థుల వయోపరిమితి తగ్గించాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఎస్‌సీఈఆర్‌టీలో విద్యార్థులు నిర్వహించిన అండర్-18 మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ''ఎన్నికల్లో శాసనసభకు పోటీ చేయాలంటే 25 ఏళ్లు నిండాలనే నిబంధన ఉంది. ఓటు హక్కు పొందేందుకు వయోపరిమితి 21 సంవత్సరాల నుంచి 18 ఏళ్లకు తగ్గించారు. కానీ, ఎన్నికల్లో శాసనసభకు పోటీ చేయడానికి 25 ఏళ్ల వయసు ఉండాలనే నిబంధనను మాత్రం సవరించలేదు. ఈ నిబంధనను కూడా సవరించుకుని .. 21 ఏళ్లు నిండిన వారు శాసనసభకు పోటీ చేసే అవకాశం కల్పిస్తూ చట్ట సవరణ చేయాలి. తద్వారా యువత చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించేందుకు అవకాశం ఉంటుంది. 21 ఏళ్లు నిండిన వారు ఐఏఎస్, ఐపీఎస్‌లుగా పనిచేస్తున్నప్పుడు... 21 ఏళ్లు నిండిన వారు శాసనసభ్యులుగా కూడా రాణిస్తారని బలంగా నమ్ముతున్నా. మాక్ అసెంబ్లీ తీర్మానాల్లో ఈ అంశాన్ని కూడా చేర్చి రాష్ట్రపతి, ప్రధానమంత్రికి పంపించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తున్నా'' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా రఘురామ ఏకగ్రీవ ఎన్నిక

**విశ్వంభర, అమరావతి:** ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఎన్నికయ్యారు. ఈ మేరకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ఈ పదవికి ఒక్క నామినేషనే దాఖలు కావడంతో రఘురామ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. రఘురామ 2019 ఎన్నికల్లో నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి వైకాపా తరపున గెలిచారు. తర్వాత కొద్ది రోజుల్లోనే వైకాపా ప్రభుత్వంపై తిరుగుబాటు జెండా ఎగరేశారు. అప్పటి సీఎం జగన్‌కు సింహస్వప్నంగా తయారయ్యారు. రచ్చబండ పేరుతో ఎప్పటికప్పుడు.. అధికార పార్టీ నేతల అవినీతి, అక్రమాలను ఎండగట్టారు. దీంతో ఆగ్రహించిన వైకాపా ప్రభుత్వం ఆయనపై రాజద్రోహం కేసు నమోదు చేసి, కస్టడీలో చిత్రహింసలు పెట్టింది. జగన్ వ్యవహారాలపై మాట్లాడటం మొదలుపెట్టినప్పటి నుంచి ఆయన్ను వైకాపా పెద్దలు రాష్ట్రంలోకి అడుగుపెట్టనీయకుండా వెంటాడారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ.. పోలీసులను ఆయనపైకి ఉసిగొల్పారు. ఆ సమయంలో ఆయన అధిక సమయం దిల్లీకే పరిమితమయ్యారు. 2024 ఎన్నికలకు ముందు వైకాపాకు రాజీనామా చేసి టీడీపీలో చేరిన రఘురామ.. ఉండి నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. రఘురామకృష్ణరాజు తనను గతంలో చిత్రహింసలకు గురి చేసిన పోలీసులపై గుంటూరులో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌తో పాటు పోలీసు ఉన్నతాధికారులు నిందితులుగా ఉన్నారు. మరోవైపు జగన్ అక్రమాస్తుల కేసుపై విచారణ వేగవంతం చేయాలని, తెలంగాణ హైకోర్టు నుంచి మార్చాలని సుప్రీంకోర్టులో రఘురామ న్యాయపోరాటం చేస్తున్నారు.

**'ఆర్‌ఆర్‌ఆర్'లా సంచలనాలు సృష్టించాలి: చంద్రబాబు**

'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలో నాటు నాటు పాట ఎంత పాపులర్ అయ్యిందో.. రఘురామకృష్ణరాజు రచ్చబండ ప్రోగ్రాం రాజకీయాల్లో అంతే పాపులర్ అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణరాజు బాధ్యతలు చేపట్టిన తర్వాత అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా రఘురామకు సీఎం చంద్రబాబు మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. తెలుగుబిడ్డగా పంచెకట్టులో వచ్చిన రఘురామ.. స్పీకర్ స్థానానికి నిండుతనం తీసుకొచ్చారని చంద్రబాబు కొనియాడారు. కొత్త బాధ్యతలో రఘురామను చూస్తుంటే సంతోషం కలుగుతోందన్నారు.

**పోరాట యోధుడు రఘురామ..**

''ఒకే రోజులో ఫిర్యాదు, ఎఫ్ఐఆర్, అరెస్టు మూడూ జరిగాయి. శుక్రవారం అరెస్టు చేస్తే కోర్టు ఉండదు కాబట్టి జైల్లో పెట్టొచ్చని కుట్ర చేశారు. పోలీసు కస్టడీలో ఉన్న రఘురామపై దాడి చేయడం దారుణం. లాఠీలు, రబ్బర్ బెల్టులతో అరికాళ్లపై కొట్టారు. కొట్టినట్టు కోర్టులో చెబితే కస్టడీకి వచ్చినప్పుడు చంపేస్తామని బెదిరించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు పంపి వైద్య పరీక్షలు చేయాలని కోర్టు చెప్పింది. ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లకుండా నివేదికను తారుమారు చేసేందుకు యత్నించారు. వైద్యపరీక్షల నివేదిక కోర్టులో సమర్పించేందుకు ఆలస్యం చేశారు. రఘురామను తీసుకురావాలని కోర్టు చెబితే తీసుకెళ్లకుండా మొరాయించారు. చివరికి హైదరాబాద్ మిలిటరీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేశారు.

ఆ నాటి సీఎం.. రఘురామకృష్ణరాజును పోలీసులతో కొట్టించి, ఆ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చూసి పైశాచిక ఆనందం పొందారు. రఘురామ ఎంపీగా పనిచేసిన ఐదేళ్లలో నియోజకవర్గానికి రానియ్యకపోతే.. రచ్చబండ కార్యక్రమం ద్వారా ప్రజలకు దగ్గరయ్యారు. పోరాట యోధుడిగా గెలిచిన రఘురామను అభినందిస్తున్నా. ఆ నాడు మిమ్మల్ని రాష్ట్రానికి రానీయని వాళ్లు.. నేడు మీ ముందు సభలోకి రాలేని, కూర్చోలేని పరిస్థితి వచ్చింది. ఇది.. దేవుడు రాసిన స్క్రిప్టు'' అని చంద్రబాబు అన్నారు.

**వాళ్లే ఈరోజు సభలో అడుగు పెట్టలేకపోయారు: డిప్యూటీ సీఎం పవన్**

''నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో మిమ్మల్ని అడుగు పెట్టనివ్వమని ఛాలెంజ్ చేసిన వాళ్లే ఈ రోజు మీ ముందు సభలో అడుగు పెట్టలేకపోయారు. కర్మ అంత బలంగా ఉంటుంది'' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. డిప్యూటీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన రఘురామకృష్ణరాజుకు పవన్ అభినందనలు తెలిపారు. ఆయన పోరాట పటిమను కొనియాడారు.

''ఉండి నియోజకవర్గం నుంచి 56వేల పైచిలుకు ఓట్లతో గెలిచి మీరు అసెంబ్లీకి వచ్చారు. గత ప్రభుత్వం రాజకీయాలను నేరమయం చేసింది. నేరస్థులు అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో మొన్నటి వరకూ చూశాం. గత ప్రభుత్వంలో అందరూ ఏదో రకంగా ఇబ్బందులు పడ్డారు. రాజకీయాల్లో నేరస్థులకు స్థానం ఉండకూడదు. దురదృష్టవశాత్తూ 2019లో నేరస్థులు అధికారంలోకి వచ్చారు'' అని పవన్ అన్నారు.

**డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన రఘురామ**

శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైన రఘురామకృష్ణరాజు ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టారు. దీంతో ఆయన డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రఘురామను చంద్రబాబు, పవన్, అయ్యన్నపాత్రుడు అభినందించారు. అనంతరం టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు స్పీకర్ స్థానం వద్దకు వెళ్లి ఆయనకు అభినందనలు తెలిపారు.

# రాష్ట్రంలో పండిన ప్రతి గింజను కొంటాం

**విశ్వంభర, నిజామాబాద్ :**
రాష్ట్రంలో పండిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పారదర్శకంగా, లోప రహితంగా జరిపేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. డిచ్ పల్లి మండలంలోపని మెంట్రాజ్ పల్లి, ఆర్మూర్ మండలం పెర్కిట్ లో మెప్మా ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కొనుగోలు ప్రక్రియ, తాలు, తరుగు, తేమ వంటి అంశాలపై రైతులతో మాట్లాడారు. రసీదుల పుస్తకాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్దే రసీదులను రైతులకు అందజేయాలని, దానికి అనుగుణంగా చెల్లింపులు జరపాలని వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, డైరెక్టర్లను మంత్రి ఆదేశించారు. రైతులకు చేసే చెల్లింపులన్నీ అత్యంత పారదర్శకంగా ఉండాలని, తరుగు, తేమ శాతం, రవాణా, కూలీ ఖర్చులలో జవాబుదారీతనం ఉండాలని, రైస్ మిల్‌కు వెళ్లిన తర్వాత తాలు, తరుగు, తేమ వంటి అంశాల పేరుతో కోత విధించవద్దని దిశానిర్దేశం చేశారు.

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని, వచ్చిన ధాన్యాన్ని కొనేందుకు ఒక క్రమ పద్ధతిని అనుసరించడంతోపాటు ప్రతి అడుగులో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా, వారు దళారుల బారిన పడి ఇబ్బందులు పడవద్దనే ఉద్దేశంతో సీయం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టిపెట్టిందని తెలిపారు. రైతు పండించిన ప్రతి గింజా కొనే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసిందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరుగు, తేమ శాతం పేరుతో కోతలు పెట్టి రైతులను దోపిడీ చేసిందని తెలిపారు. అలాంటి లోటుపాట్లు పునరావృతం కాకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ప్రతిపక్ష నాయకులు రాజకీయ లబ్ది కోసం రాద్ధాంతం చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వెల్లడించారు. సన్నాలకు బోనస్ ఇస్తున్నామని స్పష్టం చేశారు.

అనంతరం మెంట్రాజ్ పల్లి రైతు వేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. అన్నదాతలతో ముచ్చటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా తయారైందని, కొత్తగా తెస్తున్న అప్పుల్లో ఎక్కువగా గత ప్రభుత్వం తెచ్చిన రుణాలకు వడ్డీలు చెల్లించడానికి ఖర్చు అవుతుందని అన్నారు. అయినా అయినా అన్నింటిని అధిగమించి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా ముందుకు సాగుతున్నామని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని చెప్పారు. సన్నాలకురూ. 500 బోనస్ ఇస్తామని, అర్హులైన వారందరికీ రుణమాఫీ కింద రెండు లక్షలు ఇస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. భూపతిరెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్ నాయక్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ వినయ్ రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంఛార్జి సునీల్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గత ఐదేళ్లలో పైసా పెట్టుబడి రాలేదు

(మొదటి పేజీ తరువాయి)
ఆ తర్వాత ఆర్థిక సంస్కరణల కారణంగా ఏపీలోనూ ఐటీని ప్రోత్సహించగలిగాం. ప్రతి నలుగురు ఐటీ నిపుణుల్లో ఒకరు తెలుగువారే ఉన్నారంటే అప్పటి విధానపరమైన నిర్ణయమే కారణం. 2047 నాటికి భారత్ నంబర్ వన్ దేశంగా తయారైతే ఏపీ కూడా దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా ఉండాలనే ఈ పాలసీలు తీసుకొచ్చాం. యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే మా ప్రాధాన్యత. ఈజ్ ఆఫ్ డూయింగ్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా విధానం మార్చుకున్నాం. ఉత్పత్తి వ్యయం తగ్గించటం, బ్రాండ్.. ఇలా అన్ని అంశాల్లోనూ దృష్టి పెట్టాం.

**ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామిక వేత్త..**

ప్రతి కుటుంబంలోనూ ఒక పారిశ్రామికవేత్త అనే నినాదాన్ని సాధ్యం చేసి చూపుతాం. పెట్టుబడి ప్రాజెక్టులు అనుకున్న సమయానికే మొదలయ్యేలా ఓ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశాం. రియల్ టైమ్‌లోనే అనుమతుల జారీ, సెల్ఫ్ సర్టిఫికేషన్ అంశాన్ని కూడా తీసుకురావాలని భావిస్తున్నాం. సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలన్నది మా లక్ష్యం. ఉత్పత్తిలో ఏపీని గ్లోబల్ డెస్టినేషన్‌గా మార్చాలన్నది మా విధానం. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీని.. అన్ని రాష్ట్రాల విధానాల్ని అధ్యయనం చేసి రూపొందించాం. ఏ విధానమైనా 2024-29 వరకూ అమల్లో ఉండేలా చర్యలు తీసుకుంటాం. 175 నియోజకవర్గాల్లో ప్రతీ చోటా పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాం. పోర్టు ఆధారిత పరిశ్రమలు తీసుకువచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతాం'' అని సీఎం తెలిపారు.

# ప్రధాని మోదీకి మరో అత్యున్నత పురస్కారం

- అత్యున్నత జాతీయ అవార్డును ప్రదానం చేయనున్న డొమినికా
- కొవిడ్ సమయంలో భారత్ సహకారానికి గుర్తింపు
- దీంతో ఇరు దేశాల సంబంధాలు బలోపేతం

**దిల్లీ:** భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరో అరుదైన గౌరవం లభించింది. ప్రధాని మోదీకి కామన్వెల్త్ ఆఫ్ డొమినికా తమ దేశ అత్యున్నత జాతీయ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు ఆ దేశ ప్రభుత్వం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. కొవిడ్ సమయంలో డొమినికాకు భారత్ అందించిన సహకారాన్ని గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపింది. ఇరు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి మోదీ విశేష కృషి చేశారని కొనియాడింది. వచ్చేవారం గయానాలో జరిగే ఇండియా-కరికోమ్ సదస్సులో ఆ అవార్డును ప్రదానం చేయనున్నట్లు వెల్లడించింది. నవంబరు 19 నుంచి 21 మధ్య ఈ సదస్సు జరగనుంది. ''2021 ఫిబ్రవరిన ప్రధాని మోదీ డొమినికాకు 70వేల కొవిడ్ వ్యాక్సిన్ డోసులను పంపించారు. ఆ అపురూప కానుక వల్ల మేం మా పొరుగు దేశాలకు అండగా నిలవగలిగాం. అంతేకాదు.. ప్రధాని మోదీ నేతృత్వంలో ఆరోగ్యం, విద్య, ఐటీ రంగంలో భారత్ మాకు మద్దతు అందిస్తోంది. భారత్ మాకు గొప్ప భాగస్వామి. అందుకే ఆ దేశ ప్రధానిని మా అత్యున్నత పురస్కారంతో సత్కరించాలని నిర్ణయించాం'' అని డొమినికా ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

## అధికారం కోసం సమాజాన్ని విభజించే ప్రయత్నం


**ముంబయి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న తరుణంలో ప్రధాన పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. తాజాగా రాష్ట్రంలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో అధికార కూటమి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్షం కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారం కోసం కాంగ్రెస్ సమాజాన్ని విభజించే ప్రయత్నం చేస్తోందని ప్రధాని ఆరోపించారు. ''అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు హస్తం పార్టీ విభజనను నమ్ముతోంది. కానీ, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని అనుకోవడం లేదు. మొదటి నుంచి కూడా రిజర్వేషన్లకు ఆ పార్టీ వ్యతిరేకం. గతంలో రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ తీరుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. వాటిని ఒక్కసారి పరిశీలిస్తే ఆ పార్టీ అసలు ఆలోచన ఏంటో అవగతం అవుతుంది. నాటి నుంచి నేటి వరకు వారిలో ఎలాంటి మార్పు రాలేదు'' అని ఆరోపించారు.

**ఆర్టికల్ 370 పునరుద్ధరణకు ప్రయత్నం..**

''జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని పునరుద్ధరించేందుకు కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు పథకం రచిస్తున్నాయి. ఆ ప్రాంతానికి ప్రత్యేక రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. పాకిస్థాన్ భాష మాట్లాడే కాంగ్రెస్.. దాని మిత్రపక్షాలకు మహారాష్ట్ర ప్రజలు మద్దతు ఇస్తారా ..?ఎప్పటికీ భారత్‌లో కశ్మీర్ భాగమే. మన రాజ్యాంగమే అక్కడ కూడా అమలు అవుతోంది'' అని మోదీ అన్నారు. మహారాష్ట్రలోని మహాయుతి ప్రభుత్వం.. ఔరంగాబాద్ పేరును ఛత్రపతి శంభాజీనగర్‌గా మార్చిందన్నారు. దీంతో బాల్ ఠాక్రే కోరికను మహాయుతి సర్కారు నెరవేర్చిందని వ్యాఖ్యానించారు.

## కారుణ్య నియామకం హక్కు కాదు

(మొదటి పేజీ తరువాయి)
1997లో మరణించిన ఓ పోలీసు కానిస్టేబుల్ కుమారుడు దాఖలు చేసుకున్న పిటిషన్‌ను కొట్టేస్తూ ఈ మేరకు పేర్కొంది. అమల్లో ఉన్న విధానానికి, చట్టానికి వ్యతిరేకంగా, ఓ వ్యక్తి లేదా సమూహానికి అనుకూలంగా వ్యవహరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించలేమంటూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది. సాధారణంగా జరిగే కారుణ్య నియామకం ప్రభుత్వోద్యోగి మరణంతో అతడి కుటుంబం తక్షణ ఆర్థిక ఇబ్బందులకు గురికారాదనే ఉద్దేశంతో జరిగేదే తప్ప సుదీర్ఘ కాలం తర్వాతా పొందే హక్కు కాదని తీర్పు వెలువరించింది. హరియాణాకు చెందిన పిటిషనర్ టింకూ తండ్రి జై ప్రకాశ్ 1997లో విధుల్లో ఉండగా మరణించారు. ఆ సమయానికి టింకూ వయసు ఏడేళ్లు. ఆమె తల్లి నిరక్షరాస్యురాలు. దీంతో ఆమె కారుణ్య నియామకానికి దరఖాస్తు చేసుకోలేదు. అయితే తన కుమారుడి పేరును మైనర్ల జాబితాలో చేర్చాలని అభ్యర్థించారు. తద్వారా మేజర్ అయిన తరవాత అతనికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం వస్తుందని ఆశించారు. ఈ క్రమంలో భవిష్యత్తులో ఉద్యోగావకాశం కల్పించేందుకు వీలుగా 1998లో టింకూ పేరును అప్పటి హరియాణా డీజీపీ నమోదు చేయించారు. తండ్రి మరణించిన 11 ఏళ్లకు 2008లో మేజరైన టింకూ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఉద్యోగి మరణించిన మూడేళ్లలోపు కారుణ్యనియామకానికి దరఖాస్తు చేసుకోవాలంటూ 1999లో తీసుకొచ్చిన నిబంధనను అనుసరించి అధికారులు టింకూ అభ్యర్థనను తోసిపుచ్చారు. దీన్ని సవాలు చేసినా టింకుకు కింది కోర్టులు సహా పంజాబ్-హరియాణా హైకోర్టులోనూ వ్యతిరేకంగానే తీర్పులు వచ్చాయి. తాజాగా సుప్రీం కోర్టు కూడా పూర్వ తీర్పులనే సమర్థించింది. అయితే అతని కుటుంబానికి ఊరట కలిగిస్తూ ఏకమొత్తంలో పరిహారం కోరుతూ సంబంధిత అధికార విభాగానికి విజ్ఞప్తి చేసుకోవడానికి టింకూ తల్లికి అవకాశమిచ్చింది. అలాగే ఆమె అభ్యర్థనపై ఆరు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఆపై జరిగే ఆలస్యానికి వడ్డీ కూడా చెల్లించాల్సి వస్తుందని సంబంధిత విభాగానికి సూచించింది.



## సీసీ కెమెరాలతో నేరాలను అరికట్టండి

### ఎస్ఐ బీ నరేష్


**విశ్వంభర, తెలకపల్లి :** నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో నేరాల నివారణకు సత్వర సమాచార సేకరణకు సీసీటీవీ కెమెరాలు ఉపయోగపడతాయని స్థానిక ఎస్ఐ బీ నరేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు విషయంపై గ్రామ పెద్దలకు, ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలు నిరోధించడంలో ఉపయోగపడతాయని కోరడంతో గ్రామంలోని దాతలు 16 వేల రూపాయలు సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు కోసం వితరణ చేసినట్లు ఎస్ఐ చెప్పారు. ఈ సందర్భంగా వితరణ చేసిన దాతలకు ఎస్ఐ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ తోపాటు హెడ్ కానిస్టేబుల్ నారాయణ, గ్రామ దాతలు, పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**విశ్వంభర, తెలకపల్లి :** పేదలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా లబ్ధిదారులకు లక్ష రూపాయలు అందజేయడం జరుగుతుందని ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి అన్నారు. గురువారం తెలకపల్లి మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యలయంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళ్యాణలక్ష్మి దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ చెక్కులను అందజేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిరుపేదలకు అందిస్తూ.. ఆసరాగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల ఇంచార్జ్ బండ పర్వతాలు, వారణాసి శ్రీను, నరేందర్ గౌడ్, బాల గౌడ్, యాదయ్య, యువ నాయకులు జిలాని, ఎల్లస్వామి, లక్ష్మయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



మట్టపల్లిలో జర్నలిస్ట్ దివ్వెల వీరభద్ర రావు సోదరుడు వెంకటేశ్వర్లు వివాహానికి వీ3 న్యూస్ ఛానల్, విశ్వంభర దిన పత్రిక ఛైర్మన్ డా.కాచం సత్యనారాయణ, సుష్మ దంపతులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

- విశ్వంభర, మట్టపల్లి













# గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలు



(జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా)

ఎక్కువగా పుస్తకాలుండే చోటుని 'గ్రంథాలయం' (లైబ్రరీ) అంటారు. గ్రంథి అనగా ముడి. పూర్వము తాటి ఆకుల మీద రాసి వాటిని ఒక తాటి తో గుచ్చి ముడివేసేవారు. అందుకు వాటిని గ్రంథాలు అన్నారు. వాటినే ఇప్పుడు మనం పుస్తకాలు అంటున్నాము. తరతరాల విజ్ఞాన సంపదలను అందించేవి గ్రంథాలు. అటువంటి గ్రంథాలు గల భవనాన్ని గ్రంథాలయం అంటారు. వీటినే 'విజ్ఞానాలయాలు, పఠన మందిరములు" ఆంగ్లంలో 'లైబ్రరీ' అని కూడా అంటారు. 'లైబ్రరీ' అనేమాట 'లైబర్ అనే లాటిన్ పదం నుంచి పుట్టింది. ఆ పదానికి అర్థం 'పుస్తకం'.ఎక్కువ సంఖ్యలో పుస్తకాలు ఒక చోట భద్రపరచటానికి, అందరూ చదువుకోటానికి వీలయ్యే ప్రదేశాన్ని లైబ్రరీ' అంటారు. ఈ 'లైబ్రరీ'లు అస్సీరియా, బాబిలోనియాలలో క్రీస్తు పూర్వం 200 సంవత్సరం నాటికే ఉండేవని తెలుస్తోం ది. 'మెసపాటేమియా'లో మట్టిని పలకలు గా చేసి వాటిపై 'ఎక్యూనియన్' అనబడే ఒక గట్టి కర్రలాంటి దానితో రాసేవారు. వారు రాసిన లిపిని 'క్యూనిఫారం' అనేవారు. ఈ మట్టి పలకలలో మంచి వాటిని, ఉపయోగం ఉన్న వాటిని జాగర్తగా భద్రపరచేవారు. ఇలాంటి వాటిని వేలాదిగా ఒక భవనంలో గాని, దేవాలయాలలో గాని ఉంచేవారు. అలాంటప్పుడు వాటిని సబ్జెక్టులవారీగా విభజించేవారు. ప్రాచీన ఈజిప్టులో కూడా ఇలాంటి లైబ్రరీలు దేవాలయాలలో ఉండేవి. అవి మతాచార్యుల ఆధీనంలో ఉండేవి వాటిని 'పాపిరస్' అనబడే ఒక రకపు పల్చని పొరపై రాసేవారు. రాసాక వాటిని ఒక చుట్టగా చుట్టి భద్రపరచేవారు అని పరిశీలకులు చెబుతున్నారు.

- 'చిరిగిన చొక్కా ఐనా తొడుక్కో కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో',
- 'మంచి పుస్తకం మంచి మిత్రునితో సమానం',
- 'పుస్తకాన్ని మించిన మంచి మిత్రుడు లేడు ',
- 'సత్ కాలక్షేపానికి మంచి పుస్తకం ఎంచుకో'
- ఈ మాటలు పుస్తకాల ప్రాధాన్యతను తెలియచేస్తున్నాయి

మన భారత దేశంలో ప్రాచీన కాలంలో రాగి రేకుల పైననూ, తాటి ఆకుల పైననూ (తాళపత్ర గ్రంథాలు) రాసి భద్రపరచే వారు. ప్రాచీన లైబ్రరీలలో అతి పెద్దది ఈజిప్టులోని 'అలెగ్జాండ్రియా'లో ఉన్నది. అది క్రీస్తు పూర్వం 300 సంవత్సరాలనాటిది. ఈ లైబ్రరీలో 7 లక్షల 'పాపిరస్' చుట్టలుండగా వాటిని 120 తరగతులుగా విభజించారు. ఈ లైబ్రరీలలో అందరూ చదువుకునేందుకు వీలుండేది కాదు. అందరూ చదువుకునే వీలుండే ఐచ్చిక లైబ్రరీలను స్థాపించాలనే కోరిక మొదటిసారిగా రోమన్లకు వచ్చింది. జూలియస్ సీజర్ మొదటి సారిగా రోమ్ నగరంలో పబ్లిక్ లైబ్రరీలు స్థాపించి డబ్బున్న వాళ్ళ దగ్గర నుంచి పుస్తకాలను సేకరించి సొంత లైబ్రరీలు ప్రారంభించారు. రోమ్ నగరంలో 28 లైబ్రరీలుండేవని చరిత్రకారులు చెబుతున్నారు.

తర్వాతి కాలంలో క్రిస్టియన్ మతం ప్రచారంలోనికి వచ్చిన తర్వాత దాదాపు అన్ని చర్చిలలో చిన్న చిన్న మత సంబంధ లైబ్రరీలు స్థాపించారు. ఫ్రాన్స్ లోని పారిస్ విశ్వవిద్యాలయంలోనూ, జర్మనీలోని హెడ్బర్గ్ విశ్వ విద్యాలయంలోను లైబ్రరీలు ప్రారంభించగా భారతదేశంలో నలంద విశ్వ విద్యాలయంలో పెద్ద లైబ్రరీ ప్రారంభించారు.

ఈనాడు ప్రపంచంలో అతి పెద్ద లైబ్రరీ వాషింగ్టన్ లో కాపిటొక కొండ వద్ద వున్నది. జేమ్స్ యాడిసన్ స్మారక భవనంలో గల 'లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ 'లో 1986 నాటికే 9 కోట్ల విభాగాలతో 2 కోట్ల పుస్తకాలు, మరికొన్ని రాత ప్రతులు, పురాతన గ్రంథాలు, ఫోటోగ్రఫీలతో ఈ 'లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్' పెద్ద లైబ్రరీగా ఖ్యాతి గడించింది. ఈ భవనంలోని అరలు వరుసగా పేరిస్తే 532 మైళ్ళ పొడవు వస్తుందని చారిత్రక పరిశోధకులు చెబుతున్నారు. ప్రపంచంలో మరో పెద్ద లైబ్రరీగా చెప్పుకోదగినది న్యూయార్క్ పబ్లిక్ లైబ్రరీ. 1895 లో 5,22,276 చదరపు అడుగుల వైశ్యాలంతో న్యూయార్క్ నగరంలో ఐదవ ఎవెన్యూలో న్యూయార్క్ లైబ్రరీ ప్రారంభమైంది. ఇందులోని వరసలు 88 మైళ్ళు పొడవు ఉందట. దీనికి 80 బ్రాంచి లైబ్రరీలున్నాయి. ఈ లైబ్రరీలో కోటి 20 లక్షల వాల్యూమ్ లు, కోటిన్నర రాత ప్రతులు, మూడున్నర లక్షల మ్యాపులు ఉన్నాయని పరిశోధకులు చెప్పారు.ఇంక మూడో స్థానం మాస్కోలోని 'లెనిన్' లైబ్రరీ, ఇందులో దాదాపు 2 కోట్ల పుస్తకాలున్నాయని శాస్త్రవేత్తల అభిప్రాయం. ఇంతటి ప్రాముఖ్యతను కలిగి ఉన్న గ్రంథాలయాలు, వాటి ఆవశ్యకతను తెలుసుకుని మన తెలుగు రాష్ట్రాలలో గ్రంథాలయాల స్థాపనకు అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, నాళం కృష్ణారావు, మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి వంటి ఎందరో మరెందరో కృషిచేసి, అహోరాత్రులూ శ్రమించి, గ్రంథాలయ ఉద్యమం నిర్వహించి ఎన్నో గ్రంథాలయాలు స్థాపించారు. ప్రసిద్ధి చెందిన గ్రంథాలయాలలో కొన్ని అమెరికాలో 'కాంగ్రెస్ లైబ్రరీ' రోమ్ నగరంలో వాటికన్ లైబ్రరీ', బ్రిటీష్ లైబ్రరీ', మన దేశంలో చెన్నయ్ లో 'కన్నెమరా' గ్రంథాలయం, తంజావూరులోని 'సరస్వతీ మహాలు', వేటపాలెంలోని 'సారస్వత నికేతనం' హైదరాబాద్ లో గల 'శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం', కడపలో సి.పి. బ్రౌన్ స్మారక గ్రంథాలయం', రాజమహేంద్రవరంలో ' గౌతమీ గ్రంథాలయం' ప్రసిద్ధ గ్రంథాలయాలు. గ్రంథాలయాల్లో చాలా రకాలున్నాయి. ప్రభుత్వ గ్రంథాలయాలు, స్వచ్ఛంద సంస్థల గ్రంథాలయాలు, పాఠశాలల గ్రంథాలయాలు. ఇలా రకరకాలుగా ఉన్నాయి.

**గ్రంథాయాల వల్ల చాలా ఉపయోగాలున్నాయి.**

1) గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదవడం వల్ల మనిషి విజ్ఞానవంతుడు కాగలడు

2) మహా మేధావులు తరతరాలుగా సంపాదించిన అనుభవాలు, ఆలోచనలు గ్రంథాలలో భద్రపరచబడతాయి. కాబట్టి మనం వాటిని చదువుకోవచ్చు.



ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.

3) దేశాభ్యుదయానికి సమాజ వికాసానికి గ్రంథాలయాలు దోహద పడతాయి. 4) గ్రంథ పఠనమనే మంచి అలవాటు అలవడుతుంది.

5) వ్యక్తిత్వ వికాసానికి, దేశభక్తికి, ఉద్యోగ ప్రాప్తికి, కాలక్షేపానికి, మానసిక వినోదానికి అన్ని రకాలుగా ఈ గ్రంథాలయాలు ఉపయోగ పడతాయి.

6) నిరుద్యోగులకు, రిటైరైన ఉద్యోగులకు ఈ గ్రథాలయాలు మంచి మిత్రులు. అందుకనే ఒక ఆధునిక కవి ఇలా అన్నాడు. 'గ్రంథాలయాలు-విజ్ఞానాలయాలు-ఆధునిక దేవాలయాలు' అని.

ఈ గ్రంథాలయాల నిర్వహణ అనేది కత్తిమీద సాములాంటిది. అన్ని వర్గాల ప్రజల అవసరార్థం అన్ని పత్రికలుండాలి. ఈ ఆధునిక కాలంలో సాంకేతిక పరంగా అభివృద్ధి చెందిన మన ముంగిట్లోకి మన అందరి వినియోగంలోనికి వచ్చిన టెక్నాలజీ ద్వారా సాంకేతిక ఫలితాలను కూడా లైబ్రరీలలో పాఠకులకు అందుబాటులో వుంచాలి. పలు దేశ విదేశాల, పలు రంగాల పుస్తకాలు పత్రికలను తెప్పించి పాఠకులు చదువుకుని భద్రపరిచేలా మంచి ఏర్పాటు ఉండాలి. ఏఒక్క వర్గానికి చెందిన పుస్తకాలకు ప్రాధాన్యత కాకుండా స్త్రీ, పురుష, ధనిక, పేద, చిన్నా, పెద్దా, తేడా లేకుండా అందరికీ పనికి వచ్చే పత్రికలతో ఈ గ్రంథాలయాలు కళ కళలాడుతుండాలి. గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలు కాబట్టి అన్ని రకాల గ్రంథాలు న్యాయం, వైద్యం, రాజకీయం, కళలు, సాహిత్యం, పురాణాలు, చారిత్రకాలు, శాస్త్రాలు, పరిశోధనలు, దేశభక్తి, నవలలు, నాటికలతో పాటు దిన, వార, పక్ష, మాస, త్రైమాసిక, సాంవత్సరిక పత్రికలతోపాటు అనేక రకాలైన గ్రంథాలుండాలి.

ఇన్ని ఉపయోగాలుండి ఇంతటి ప్రాముఖ్యతను కలిగిన గ్రంథాలయాల నిర్వహణ చాలా కష్టంగా ఉంటోంది. నేడు సిబ్బంది కొరత, నిధుల లేమి, ప్రజల చైతన్యవంతమైన భాగస్వామ్య వ్యవస్థ కొరతగా ఉండటం, అధికారుల అజమాయిషీ లోపించడం వంటి వాటి వల్ల గ్రంథాలయాల నిర్వహణ బాగోలేదని పాఠకులు అభిప్రాయపడుతున్నారు. కాబట్టి ప్రతీ ఒక్కరూ ఈ గ్రంథాలయం నాది, నీది, మనది, అందరిది అనే భావంతో ముందుకు వచ్చి గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్వహించాలి. స్వచ్ఛంద సంస్థలు, అధికారులు ఇంకా ఉత్సాహవంతు లైన కొందరుయువకులు కలిసి ముందుకొచ్చి నిర్వహణా బాధ్యత తీసుకోవాలి. అప్పుడే గ్రంథాలయాలను చాలా కాలం కాపాడుకోగలం, వ్యక్తిత్వ వికాసానికి , పెరుగుదలకు ఎంతో దోహదం చేస్తున్న గ్రంథాలయాలను కాపాడుకోవటం మనందరి భాధ్యత. గ్రంథాలయాలు విజ్ఞానాలయాలు, పఠన మందిరాలు ఆధునిక దేవాలయాలు విజ్ఞాన సాగరాలు మనిషి వికాసానికి తోడ్పడే సారథులు, అజ్ఞానాన్ని తరిమికొట్టే గ్రంథాలు ఉన్నత శిఖరాలనందించే సోపానాలు, వ్యక్తిత్వ వికాసాన్నిచ్చే పుస్తకాలు దేశాభివృద్ధిలో ప్రధాన పాత్రలు, ప్రపంచమనే మహా సాగరంలో దిక్సూచీల్లాంటి పుస్తకాలే మనిషికి మర్గదర్శకాలు, ఎందరో జీవితానుభవాలు, దివ్యసందేశాలు మనకు పాఠాలు.

అన్ని కలగలిపితేనే గ్రంథాలయాలు విజ్ఞానాలయాలు అటువంటి గ్రథాలయాలను కాపాడటం-ప్రోత్సహించటం అందరి బాధ్యత. నవంబరు 14 వ తేదీ భారత దేశ తొలి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ పుట్టిన రోజు సందర్భంగా ప్రతీ సంవత్సరం ఈ నవంబరు 14 వ తేదీ నుంచి వారం రోజుల పాటు జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల,పట్టణ, గ్రామ స్థాయిలలో జాతీయ గ్రంథాలయాలు నిర్వహిస్తుంటారు. విధి విధానాలు చెబుతుంటారు. కానీ ఆర్థిక వనరులు అంతంతమాత్రంగానే విడుదల చేస్తుంటారు. స్థానిక దాతల సహకారంతో తప్పనిసరిగా చేయాలంటారు. ఇదే సమయంలో కొన్ని అనవసర రాజకీయ వైరుధ్యాలకు తెర తీసే అవకాశాలు లేకపోలేదు. ఈ గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణకు స్థానిక పాఠకులతో ఒక కమిటీ ఏర్పరచి వారి ఆధ్వర్యంలో వారోత్సవాలు చేయాలంటారు. అందుకని కొన్నిచోట్ల తీర్చలేని సమస్యలకు నిలయాలవుతున్నాయి గ్రంథాలయాలు. అందువలన అధికారుల, నాయకుల ఒత్తిడి లేకుండా స్వచ్ఛంధంగా పని చేసే వారితో నిర్వహణ ఏర్పాట్లకు కార్యాచరణకు పూనుకోవాలి. ప్రభుత్వం ఆ విధంగా ఏర్పాటు చేయాలి. రెండు మూడు గ్రంధాలయాలకు కలిపి ఒకే గ్రంథపాలకుడు వుంటారు. కొన్ని చోట్ల గ్రామస్థుల పాఠకుల సహకారంతో గ్రంథాలయాలు పని చేస్తుంటాయి. ఆధునిక సాంకేతిక విజ్ఞానం అందుబాటులోకి వచ్చిన కొన్ని చోట్ల ఇంజనీరింగ్, వైద్యం, వ్యవసాయం, డిప్లొమా, తదితర పోటీ పరీక్షల పుస్తకాలు ఇంటర్ నెట్ సౌకర్యాలతో పోటీదారులకు కావల్సిన సమాచారాన్ని అందిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వాలు ఈ గ్రంథాలయాల నిర్వహణ గురించి ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించాలి. కార్యాచరణ ప్రణాళికను తయారుచేసి ఆర్థికంగా నిధులను విడుదల చేయాలి. మన వారసత్వ సంస్కృతి సాంప్రదాయాలు చారిత్రక ఆధ్యాత్మిక కళా వారసత్వాలు పలు అంశాలన్నిటినీ భావి తరాలకు అందించేది ఈ గ్రంథాలయాలే కదా!...



-అక్షర కిరీటి తెన్నేటి మాస్టారు
పశ్చిమ గోదావరి జిల్లా
సెల్: 8247433432

# ఆదర్శ గురువుకు ప్రతీక గురునానక్!



సిక్కు మత స్థాపకుడైన గురునానక్ మానవులను ధర్మమార్గంలో స్థిరపరచడానికి, ఆదర్శవంతమైన గురువుకు ఒక ప్రతీకను లోకానికి చూపించడానికి ఈ భువిపైన ఉద్భవించిన మహానుభావుడు. నేడు ఆయన జయంతి. గురునానక్ జయంతి సిక్కులు జరుపుకునే అత్యంత ముఖ్యమైన పండుగలలో ఒకటి. ఈ పండుగను ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి రోజున జరుపుకుంటారు. దీనిని "గురుపర్వ" లేదా "ప్రకాష్ పర్వ" అని కూడా అంటారు.గురు నానక్ జయంతి సిక్కులకు చాలా ప్రత్యేకమైనది. ఈ పండుగను అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ఈ రోజున అన్ని గురుద్వారాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు.నేడు గురునానక్ 555వ జయంతి సందర్భంగా విశ్వంభర ప్రత్యేక కథనం ....

**సిక్కు గురువులలో మొదటి వారు...**

గురునానక్ సిక్కు గురువులలో మొదటివారు. 1469 ఏప్రిల్ 15న తల్వాండీ గ్రామంలో (ప్రస్తుతం పాకిస్తాన్‌లోని నాన్కానా సాహెబ్) ఒక హిందూ కుటుంబంలో జన్మించారు. అతని తండ్రి తల్వాండి గ్రామంలో అకౌంటెంట్. నానక్‌కి ఒక అక్క ఉంది, ఆమె 1475లో జై రామ్‌ని వివాహం చేసుకుంది. నానక్ మొదట్లో తన సోదరి , బావమరిదితో ఉండడం ప్రారంభించాడు. 16 సంవత్సరాల వయస్సులో, అతను దౌలత్ ఖాన్ లోడి కింద పని చేయడం ప్రారంభించాడు. 24 సెప్టెంబర్ 1487న, అతను మాతా సులక్కనిని వివాహం చేసుకున్నాడు. హిందూ, ఇస్లాం మత గ్రంథాలను ఆయన సంపూర్ణంగా చదివారు. ఇరు మతాలకూ భిన్నమైన సిక్కు మతాన్ని స్థాపించారు. సిక్కు ధర్మం ఏకేశ్వరోపాసక మతం. వారు దేవుడు ఒకరేనని నమ్ముతారు. నానక్ కుల వ్యవస్థను పూర్తిగా వ్యతిరేకించారు. సిక్కు గురువుల పరంపరలో అయిదోవాడైన గురు అర్జున్... మునుపటి గురువులకు దైవం అనుగ్రహించిన సూక్తులనూ, బోధనలను సంకలనం చేసి... పవిత్ర గ్రంథమైన 'గురు గ్రంథ సాహిబ్'ను రూపొందించారు.నానక్‌ను చిన్న వయసులోనే హిందూ ధర్మంలోని తాత్వికత ఆకర్షించింది. జీవిత రహస్యాలను అన్వేషించడానికి ఇల్లు వదిలి వెళ్ళారు. ఆ కాలంలో... దేశంలో ప్రముఖ తాత్వికులు, బోధకులు అయిన కబీర్‌దాస్, రవి దాస్‌లను కలుసుకున్నారు. గురునానక్ ఆదిగురువు దత్తాత్రేయుడి అంశతో జన్మించినవారు. మహమ్మద్ ప్రవక్త అసంపూర్ణంగా వదిలివెళ్ళిన కార్యాన్ని... తిరిగి కొనసాగించడానికి ప్రయత్నించారు.విశ్వాసం, సామాజిక న్యాయం కోసం కృషి, నిజాయితీ ప్రవర్తన , అందరికీ శ్రేయస్సు సిక్కు మతం సూత్రాలు. సిక్కు సమాజం నేడు గురునానక్‌ను తమ సంఘం అత్యున్నత శక్తిగా ఆరాధిస్తుంది. గురునానక్ 974 కీర్తనలు అందించారు.

**సన్మార్గాన్ని బోధించారు..**

ప్రవక్తలకు ఉండవలసిన ప్రత్యేక లక్షణాలలో ఒకటి... ఆధ్యాత్మిక విద్యను ప్రబోధించడం. గురునానక్ లాంటి ఎందరో గురువులు తమ ప్రవచనాలతో ప్రజలను ప్రభావితం చేశారు. సన్మార్గాన్ని బోధించారు. ఎవరినీ విమర్శించడం, సవాల్ కావడం మంచి పద్ధతి కాదని చెప్పారు. ఆనాడు హిందువులు, ముస్లింలు కలహించుకోవడం చూసి... నానక్ ఆవేదన చెందారు. ''రామ్, రహీమ్... ఇద్దరూ ఒక్కటే. ఆ ఇద్దరి మధ్య బేధాన్ని మీరు ఎలా చూస్తున్నారు?'' అని ప్రశ్నించారు. ''భగవంతుడు ఒక్కడే. అతని పేరు సత్యం. సృజనాత్మకత అతని వ్యక్తిత్వం. అమరత్వం అతని రూపం. అతను భయం లేనివాడు. శత్రుత్వం లేనివాడు. పుట్టుక లేనివాడు, స్వయంప్రకాశుడు. భగవంతుడు సర్వత్రా ఉన్నాడు. మనందరికీ ఆయనే తండ్రి. కాబట్టి అందరితో ప్రేమపూర్వకంగా మెలగాలి. సత్యం, అహింసలతో కూడిన మార్గంలో నడవాలి. లోభ గుణాన్ని విడిచిపెట్టాలి. కష్టపడి పని చెయ్యాలి. న్యాయమైన మార్గంలోనే ధనాన్ని ఆర్జించాలి. ఎవరి హక్కునూ హరించకూడదు. నీతిగా, నిజాయితీగా సంపాదించాలి. ఆపన్నులను ఆదుకోవాలి. ధనం జేబుకే పరిమితం కావాలి, అది హృదయాన్ని ప్రభావితం చేయకూడదు. అలా జరిగితే సమస్యలు చుట్టుముడతాయి'' అని ఆయన బోధించారు. స్త్రీలు, పురుషులు సమానులనీ, మహిళలను గౌరవించాలనీ, బాహ్యప్రపంచాన్ని గెలవడానికి ముందు మనలో అంతర్గతంగా ఉన్న దుర్గుణాలను తొలగించుకోవాలనీ సూచించారు.

**ఐకమత్యం, సమానత్వంతో జీవించాలి...**

అహంకారం మనుషులకు అతి పెద్ద శత్రువనీ, అహంకారానికి లోనుకాకూడదనీ, వినయంతో, సేవాభావంతో మెలగాలనీ, ప్రేమ, ఐకమత్యం, సమానత్వం, సోదరభావం, ఆధ్యాత్మిక చింతనతో జీవించాలనీ హితవు చెప్పారు. ఒక రోజు నానక్ తన శిష్యులతో మాట్లాడుతూ... తన చేతిని ఒక ఒక బండరాయి మీద ఉంచారు. ఆ రాతి నుంచి నీరు రావడం మొదలైంది. అక్కడి గురుద్వారాను 'పంజా సాహెబ్' అంటారు. 'పంజా' అంటే చేతి అయిదు వేళ్ళు. 'పంజాబ్' అంటే అయిదు జలాలు, అయిదు నదులు. 'పంజాబ్' రాష్ట్రానికి ఆ పేరు వాటివల్లే వచ్చింది.''భగవంతుణ్ణి ఎలా సందర్శించగలం? అడవికి వెళ్ళి తపస్సు చేయవలసిందేనా? అసలు దేవుడి రూపం ఎలా ఉంటుంది?'' అని ఒకసారి గురు నానక్‌ను ఆయన శిష్యులు ప్రశ్నించారు.

అప్పుడు ''నానక్ అమాయకులారా! భగవంతుణ్ణి కనుక్కోడానికి మీరు అడవికి వెళ్ళి ఎందుకు వెతుకుతారు? ఆయన సర్వాంతర్యామి. అన్ని చోట్లా ఉన్నాడు. అణువణువులో ఉన్నాడు. అందరిలో ఎల్లప్పుడూ ఉంటాడు. అతను మీతో, మీ శరీరం లోపలే ఉన్నాడు. పువ్వుకు సువాసన ఎలా ఉంటుందో, అద్దానికి ప్రతిబింబం ఎలా ఉంటుందో... అదే విధంగా భగవంతుడు సూక్ష్మ రూపంలో అన్ని చోట్లా... ఒకేలా ఉంటాడు. కాబట్టి మీ శరీరం లోపల... ఆత్మలో ఆ దేవుణ్ణి వెతకండి. ఆయన మన శరీరం లోపలా, బయటా ఉన్నాడని తెలుసుకోండి. మనలోని ఆత్మను గుర్తించకుండా, ఆ పరమాత్మను ఎన్నటికీ తెలుసుకోలేం'' అని సమాధానం ఇచ్చారు.

**కార్తీక పౌర్ణమి రోజునే గురునానక్ జయంతి జరుపుకుంటారు. ఎందుకంటే..?**

గురునానక్ దేవ్ జీ 1469వ సంవత్సరంలో కార్తీక పౌర్ణమి రోజున జన్మించారని.. అప్పటి నుంచి నేటి వరకు ఆయన జయంతిని ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి రోజున ఎంతో ఘనంగా జరుపుకుంటున్నారు.గురునానక్ జయంతి మూడు రోజుల పండుగను ఆనందంగా జరుపుకుంటారు. గురుద్వారాలలో అఖండ మార్గం నిర్వహిస్తారు. "అఖండ మార్గం" గురునానక్ జయంతికి రెండు రోజుల ముందు నిర్వహించబడుతుంది.అఖండ్ మార్గం అనేది సిక్కు సమాజం ఆధ్యాత్మిక పుస్తకాన్ని 48 గంటలపాటు నిరంతరం చదివే ఒక అభ్యాసం. దీనిలో గురు గ్రంథ్ సాహిబ్ ను 48 గంటలపాటు నిరంతరం పఠిస్తారు. ఈ పఠనం గురునానక్ జయంతి రోజున ముగుస్తుంది. గురునానక్ జయంతి రోజున ఉదయం "నగర కీర్తన" నిర్వహిస్తారు.నగర కీర్తనలో సిక్కులు షాబాద్ కీర్తనను పాడతారు. గురుగ్రంథ సాహిబ్‌ను ఊరేగింపులో తీసుకువెళతారు. ఈ రోజున గురుద్వారాలలో కీర్తనలు , ఉపన్యాసాలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఇక్కడ గురునానక్ దేవ్ జీ బోధనలను వినిపిస్తారు. ఇలా సిక్కులు తమ గురువు చెప్పిన సందేశాలను గుర్తు చేసుకుంటారు. వాటి నుంచి ప్రేరణ పొందుతారు. ఈ రోజున గురుద్వారాలలో ప్రత్యేక లంగర్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో అన్ని మతాలు, కులాల ప్రజలు ఒకచోట కూర్చొని భోజనం చేస్తారు.లంగర్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం సమానత్వం, సోదరభావం సందేశాన్ని అందించడం. ఈ సందర్భంగా కొన్ని చోట్ల దీపాలు వెలిగించి గురుద్వారాలను అలంకరిస్తారు. ఈ రోజున ప్రజలు పేదలకు ఆహారాన్ని అందిస్తారు. బట్టలు దానం చేయడం, సామాజిక సేవకు సంబంధించిన పనులు చేయడం వంటి సేవ, దానధర్మాలను కూడా చేస్తారు.

**పంజాబ్ రాష్ట్రంలో...**

ఈ విలువైన పండుగ సందర్భంగా, ప్రజలు పంజ్ ప్యారస్ నేతృత్వంలో ఊరేగింపును నిర్వహిస్తారు.పంజాబ్ రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ ఊరేగింపులో సిక్కు జెండాను మోసుకెళ్లనున్నారు. పండుగ రోజున, ప్రజలు ఉదయాన్నే అస-ది-వర్ పాడతారు. గురుద్వారాలలో అర్చకులచే పద్యాలు పఠించనున్నారు. లంగర్ మధ్యాహ్నం తయారుచేస్తారు. స్నేహితులు, కుటుంబాలు , బంధువులు కలిసి ఈ ప్రత్యేక కమ్యూనిటీ లంచ్ తీసుకుంటారు. ఈ ప్రత్యేక సందర్భంలో భక్తులు పవిత్ర గీతాలు ఆలపిస్తారు.

**గురునానక్ జయంతి ప్రాముఖ్యత**

గురునానక్ జయంతి ప్రాముఖ్యత ఏమిటంటే.. సిక్కుమతం మొదటి గురువుగా పరిగణించబడే గురునానక్ దేవ్ జీ జీవితం, బోధనలను గుర్తుంచుకోవడం. గురునానక్ దేవ్ జీ ఎల్లప్పుడూ సమానత్వం, ప్రేమ, సేవ, నిజాయితీ సూత్రాలను ఉద్ఘాటించారు. ఈ రోజున ప్రజలు కుల, మతాలకు అతీతంగా అందరి పట్ల సోదరభావం, సహన స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించాడు. గురునానక్ దేవ్ జీ భగవంతుని నామాన్ని జపించండి, నిజాయితీగా పని చేయండి.. పేదవారికి పంచి అనంతరం తినండి అని చెప్పాడు. ఈ పండుగ నిస్వార్థ సేవా స్ఫూర్తిని, మానవత్వం గురించి ఆయన చెప్పిన విషయాలు జీవితంలో అనుసరించడానికి, అమలు చేయడానికి ఒక పవిత్ర సందర్భం.

**నంకనా సాహిబ్‌లో పండుగ వేడుక..**

గురునానక్ జన్మస్థలమైన నంకనా సాహిబ్‌లో పండుగ వేడుకలు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. మేనేజింగ్ కమిటీ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు దీవెనలు పొందేందుకు హాజరవుతారు. లంగర్ భక్తులకు వాలంటీర్ల ద్వారా వడ్డిస్తారు. ఈ మహత్తర కార్యక్రమానికి హాజరైన ప్రజలకు కరః ప్రసాదం కూడా పంపిణీ చేస్తారు. ఆధ్యాత్మిక సంగీతం , కీర్తనలు ఒక ఆశీర్వాద వాతావరణాన్ని ఉంచుతాయి. పండుగ ఆహారాన్ని అందించిన తర్వాత, ఒక సాధారణ ప్రార్థన సెషన్ నిర్వహిస్తారు.

**గురునానక్ జయంతి - గ్లోబల్ సెలబ్రేషన్..**

గతంలో చెప్పినట్లుగా, గురునానక్ జయంతిని యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా , కెనడా వంటి ఇతర దేశాలలో జరుపుకుంటారు. సంఘం సభ్యులు గురునానక్ గొప్ప బోధనలకు ప్రత్యేక ప్రార్థనలు , నివాళులర్పించడానికి సమీపంలోని గురుద్వారాలను సందర్శిస్తారు.

# ఘనంగా జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు



విశ్వంభర, వంగూరు : వంగూరు మండలం జెడ్పిహెచ్ ఎస్ పాఠశాలలో బాలల దినోత్సవ, జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినారు. నెహ్రూ చిత్ర పాటానికి పూలమాలు వేసి, విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు లలిత ఆధ్వర్యంలో విద్యార్థులకు, పాటల పోటీలు, వ్యాసరచన, చిత్రాలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయులు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హెచ్ పిటి రమేష్ , జీవశాస్త్ర ఉపాధ్యాయులు లింగమయ్య, టీపీటీ , ఉపాధ్యాయులు అనిత , విద్యార్థులు పాల్గొన్నారు.

### నెహ్రూ సేవలు మరువలేనివి

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ వీరేశంవిశ్వంభర, కేశంపేట బీ భారత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ దేశం కోసం చేసిన సేవలు ఎంతో విలువైనవి, ఆయన నడిచిన మార్గంలో నేటి యువత ఆచరించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ వీరేశం అన్నారు. గురువారం భారత మాజీ ప్రధాని నెహ్రూ 135వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలకంగా వ్యవహరించి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారతదేశ మొదటి ప్రధానమంత్రిగా పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరుణాకర్ రెడ్డి, పర్వతాలు, రాములు, అనసూయమ్మ రాజేందర్‌రెడ్డి, రాములు, రమేష్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



విశ్వంభర, షాద్ నగర్ బీ చిన్నపిల్లలంటే ఎనలేని ప్రేమ కలిగిన నాయకుడు, జవహర్ లాల్ నెహ్రూ పేరు మీద బాలల దినోత్సవం జరుపుకోవడం అత్యంత సంతోషకరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భంగా షాద్ నగర్ పట్టణంలోని 24 వ వార్డు లక్ష్మీనరసింహ కాలనీలో నెహ్రూ విగ్రహం వద్ద జయంతి వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి, టెంకాయ సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బాల బాలికలు కూడా పాల్గొన్నారు. జయంతి సందర్భంగా బాల బాలికలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నోటు పుస్తకాలు పెన్సిల్లు, పెన్నులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకల్ల చెన్నయ్య, అగ్గునూరి విశ్వం, దంగు శ్రీనివాస్, ఇంజమూరి గోపాల్, టాప్సన్ వెంకటేష్, ఆర్ఎన్ రాజు, అగునూరి బస్వం, మదన్మోహన్ రెడ్డి, నడి కూడా యాదగిరి యాదవ్, దాబా వెంకటరెడ్డి, మూల చంద్రశేఖర్, సుంకు కేదార్నాథ్, కరదాసు సురేందర్, రాకేష్, మల్లికార్జున్, జీవన్ తోపాటుపట్టణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

విశ్వంభర, సంగారెడ్డి : భారతదేశ తొలి ప్రధానిగా, రాజనీతిజ్ఞుడుగా దేశ అభివృద్ధికి పునాదివేసిన దేశం మరువని దార్శనికుడు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. పండిత్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని గురువారం చిట్కుల్ లోని నీలం మధు క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల కబంధ హస్తాల నుంచి విముక్తి కలిగిన భారత దేశ తొలి ప్రధానిగా దేశాన్ని అన్ని రంగాల్లో మహోజ్వల ప్రగతి సాధించేలా పాలన కొనసాగించారన్నారు. పంచవర్ష ప్రణాళికలను రూపొందించి ఆధునిక భారతం అభివృద్ధిలో దూసుకుపోయే విధంగా కృషి చేశారని కొనియాడారు.



విశ్వంభర, ఆమనగల్లు, : దేశ మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తెల్లమల్ల జగన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి జగన్ మాట్లాడుతూ.. మొదటి ప్రధానమంత్రిగా జవహర్ లాల్ నెహ్రూ భారతదేశాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, నేటి యువత ఆయన చరిత్రను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అబ్దుల్ ఖాదర్, పులికంటి మైసయ్య, వస్పూల శ్రీశైలం, ఏంగలి ప్రసాద్, జంతుక యాదయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అండేకర్ రాజశేఖర్, పట్టణ అధ్యక్షుడు వస్పూల శ్రీకాంత్, సురేష్ నాయక్, అబ్దుల్ కరీమ్, దేవరశెట్టి మహేష్, పూసలి సత్యం, పరమేష్, కిషన్ నాయక్, నర్సింహా, శ్రీశైలం, ఫిరోజ్, శివ తదితరులు ఉన్నారు.



### చాచా నెహ్రూ పుట్టిన రోజున త్రివర్ణ పతాకావిష్కరణ

విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని పి.ఏ.సి.ఎస్ రామన్నపేటలో, మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పుట్టిన రోజు బాలల దినోత్సవ సందర్భంగా త్రివర్ణ పతాకావిష్కరణ కార్యక్రమం పిఏసిఎస్ అధ్యక్షుడు నంద్యాల బిక్షం రెడ్డి చేతుల మీదుగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య కార్యనిర్వహణాధికారి గూడూరి జంగారెడ్డి, డైరెక్టర్లు కల్లూరి సైదమ్మ, పిట్ట విజయ్ కుమార్ రెడ్డి, కొమ్ము అంజమ్మ, మంగల్ పెళ్లి కొండల్ రెడ్డి, సహకార సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





కొత్తూరు మున్సిపాలిటీ కేంద్రంలో కల్యాణ లక్ష్మి , షాదీముబారక్ చెక్కులును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంపిణి చేసారు. విశ్వంభర, కొత్తూరు :-

## కలెక్టర్‌కు మొక్కను అందజేసిన వీరబ్రహ్మాచారి



విశ్వంభర, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా నూతన అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ను కె.వీరబ్రహ్మాచారి మర్యాద పూర్వకంగా కలిసి పోల మొక్కను అందజేశారు. గతంలో ఆయన జయశంకర్ భూపాలపల్లి, మెదక్, సూర్యాపేట, రెవెన్యూ డివిజనల్ అధికారిగా, నల్లగొండ జడ్పీ సీఈవోగా పనిచేశారు.

## బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే



విశ్వంభర, కొత్తూరు : మున్సిపాలిటీ లో 18 కోట్ల అంచనా వ్యయంతో ఎహెచ్ ఆర్ డి సి ఎల్ నిధులతో మంజూరైన కొత్తూరు వై జంక్షన్ చౌరస్తా నుంచి వినాయక స్టీల్స్ వరకు (1.5 కి మీటర్ల ) బిటి రోడ్డు పనులను అలాగే కొత్తూరు రైల్వే క్రాసింగ్ నుండి కుమ్మరి గూడ జంక్షన్ వరకు 32 కోట్ల వ్యయం తో నిర్మించే(2.60 కి మీటర్ల) బిటి రోడ్డు పనులకు షాద్ నాగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ గౌడ్, లావణ్య, హేమ దేవేందర్,శివశంకర్ గౌడ్, హరినాథ్ రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర సమయంలో రక్తదానం చేసిన కాంగ్రెస్ లీడర్




విశ్వంభర, రాజన్న సిరిసిల్ల: చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన జక్కుల రాములుకు అత్యవసర సమయంలో రక్తం అవసరం ఉందని సమాచారం కాంగ్రెస్ లీడర్ మీరాల శ్రీనివాస్ యాదవ్ తెలియడంతో వెంటనే స్పందించి రక్తదానం చేసారు. రక్తదానం చేసిన మీరాల శ్రీనివాస్ యాదవ్ కు జక్కుల రాములు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీంచిన ఎంపీ డా.కడియం కావ్య



విశ్వంభర, వరంగల్: నగర సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవతో త్వరలోనే నగర రూపురేఖలు మారనున్నాయని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. గురువారం పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులతో కలిసి బ్రిడ్జి నిర్మాణం కోసం వచ్చిన మెటీరియల్ ను పరిశీలించారు. అనంతరం అధికారులతో కలిసి బ్రిడ్జి స్లాబ్ నమూనా, రైల్వేట్రాక్ పై నిర్మించే పనులను మ్యాపింగ్ ద్వారా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డా.కడియం కావ్య మీడియతో మాట్లాడుతూ....ఎన్నో ఏళ్ల కళగా ఉన్న కాజిపేట బ్రిడ్జి పనులు వేగంగా జరుగుతున్నాయని, మార్చి నెలలో బ్రిడ్జి అందుబాటులో వస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కృషితో నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ 3 పరీక్ష నిర్వహణపై కలెక్టర్ సమీక్ష



విశ్వంభర, భూపాలపల్లి : గ్రూప్ 3 పరీక్ష నిర్వహణలో రూటు అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు విధులు అత్యంత కీలకమని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో పరీక్ష నిర్వహణకు విధులు కేటాయించిన డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, రూటు అధికారులు, ఐడెంటిఫికేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధులు కేటాయించిన సిబ్బంది ఉదయం 7 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లాలో 17 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, 3707 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరువుతున్నట్లు తెలిపారు. 17 మంది పరిశీలకులు, 34 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, ఒక బయోమెట్రిక్ సూపర్ వైజర్ ను నియమించినట్లు తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో జరుగనున్న ఈ పరీక్ష 17వ ఉదయం, మధ్యాహ్నం ఉంటుందని, ఉదయం 8.30 గంటల నుండి, మధ్యాహ్నం 2 గంటల నుండి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. ఉదయం 9.30, మధ్యాహ్నం 2.30 గంటల సమయం తదుపరి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరని, గేట్లు మూసేస్తారని తెలిపారు.అలాగే 18వ తేదీ పరీక్షకు 8.30 నుండి పరీక్షా కేంద్రాలకు అనుమతి ఉంటుందని, 9.30 తదుపరి గేట్లు మూసేయ్యాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరీక్ష జిల్లా నోడల్ అధికారి విజయలక్ష్మి, పోలీస్ నోడల్ అధికారి కిషన్, కో ఆర్డినేటర్ వెంకన్న, ఆర్టిఓ సంధాని, విద్యుత్తు శాఖ ఎస్ ఈ మల్హార్, ఆర్డీఓ మంగిలాల్, కలెక్టరేట్ ఏఓ ఖాజా మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డలను ఆశపెట్టి మోసం చేసిండు

**- ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి అమలు చేయని రేవంత్ సర్కార్**

**- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



విశ్వంభర, భూపాలపల్లి : అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాల అమలును విస్మరించిందని, ముఖ్యంగా ఆడబిడ్డలకు ఆశచూపి మోసం చేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలను వంచించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును ఎండగడుతూ ఈ నెల 14 నుంచి డిసెంబర్ 09వరకు చేపట్టిన కాంగ్రెస్ ప్రజా వంచన దినాలు నిరసన కార్యక్రమాల్లో బాగంగా గురువారం మంథని పట్టణంలోని గాంధీచౌక్‌లో జాతిపిత గాంధీకి వినతిపత్రం అందజేసి నిరసన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలతో పాటు మరో 420 హామీలను ప్రజల ముందు పెట్టి నయవంచన చేశారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పథకాలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పాలకులు 11నెలలు గడుస్తున్న ఆరు గ్యారెంటీల్లో కేవలం ఒక్క ఉచిత ప్రయాణం మినహా ఏవీ అమలు చేయడం లేదన్నారు. ఇందులో ముఖ్యంగా ఆడబిడ్డలకు నెలకు రూ.2500లు ఇస్తామని, ఇందిరాగాంధీ, మహాత్మాగాంధీ ఫోటోలు పెట్టుకుని మ్యానిఫెస్టో చూపించి దగా చేశారన్నారు. అయితే మంథని ఎమ్మెల్యే మ్యానిఫెస్టో చైర్మన్‌గా ఉండటంతో చదువుకున్న వ్యక్తి మనకు న్యాయం చేస్తాడని నమ్మి ఓట్లు వేస్తే నియోజకవర్గంలో ఏ ఒక్క పథకం అమలుపై శ్రద్ధ చూపలేదన్నారు.

### విద్యుత్ ప్రమాదాల నివారణ, పొదుపు పై సదస్సు



విశ్వంభర, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆర్తి గార్డెన్స్ లో టిఎస్ఎన్పిడిఎల్ విద్యుత్ పంపిణీ సంస్థ మహబూబాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రమాదాల నివారణ, పొదుపు పై సదస్సు కార్యక్రమంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్యా మురళి నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం నిరుపేదల కోసం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రతి పెద్ద కుటుంబానికి అందిస్తుంది. అంతే కాకుండా విద్యుత్ నీ ప్రజలు తమ అవసరాలకు అనుగుణంగా వినియోగించాలి విద్యుత్ నీ అనవసరంగా వాడకండి విద్యుత్ నీ పొదుపు చేయండి. ప్రతి ఇంటి లో విద్యుత్ కాంతి వికసిల్లాలని గృహ జ్యోతి ద్వారా ఉచిత విద్యుత్ అందిస్తున్నాం అని తెలిపారు. అంతే కాకుండా విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడు చాలా జాగ్రత్త గా వ్యవరించాలి.

## ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



విశ్వంభర, భూపాలపల్లి : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కేంద్ర గ్రంథాలయం జయశంకర్ భూపాలపల్లిలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతీ చిత్రపటానికి, భారత ప్రథమ ప్రధానమంత్రి నెహ్రూ చిత్రపటానికి, గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్. ఆర్. రంగనాథన్ చిత్రపటానికి పూలమాలవేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధపడే యువతి యువకులు జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్య సాధనకు క అవసరమై విజ్ఞానము గ్రంథాలయాలలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి శ్రీలత, జిల్లా పరీక్షల విభాగపు అసిస్టెంట్ కార్యదర్శి శనిగిరపు భద్రయ్య, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, గ్రంథాలయ సిబ్బంది చంద్రమౌళి, శారద, రవీందర్, రాకేష్, మంజుల, వివిధ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు కల్పన , సర్వోత్తమ్ రెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



విశ్వంభర, భూపాలపల్లి : ధాన్యం కొనుగోలులో కేంద్రాల ఇన్‌ఛార్జులు పారదర్శకత, బాధ్యత పాటించాలని భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. గురువారం అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ మల్హర్ మండలం, కొండంపేట , కాటారం మండలం, శంకరంపల్లి గ్రామాలల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జ్‌లకు, రైతులకు విక్రయాల్లో పాటించాల్సి జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. రైతులు ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎదుర్కొనే సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. కొలతలు, నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

## వ్యక్తిగత వివరాల సేకరణ తగదు

### సిపిఐ నియోజకవర్గ ఇంచార్జి పులిజాల పరశురాములు



విశ్వంభర, వంగూరు : కులగణన సర్వే పేరుతో వ్యక్తి గత వివరాల సేకరణ చేయడం తగదని సిపిఐ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ ఇంచార్జి పులిజాల పరశురాములు తెలిపారు. దేశ జనాభా లెక్కల్లో కులగణన చేయాలనే చర్చ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి సర్వే నిర్వహిస్తుందని అన్నారు. ఈ సర్వే పత్రంలో కులంతో పాటు ఆస్తులు రాజకీయ వ్యవసాయ భూములకు సంబంధించిన వ్యక్తిగత వివరాలతో కూడిన ప్రశ్నలు ఉన్నాయని గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలు ఇవ్వడానికి ప్రజల్లో పలు అనుమానాలు వ్యతిరేకత వ్యక్తం అవుతున్నాయని చెప్పారు. ఈ అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని పార్టీల సూచనలు సలహాలు తీసుకోవాలని తెలిపారు.

### 20న ఉచిత కంటి వైద్య శిబిరం




విశ్వంభర, ఆమనగల్లు : ఈనెల 20న ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, పి ఆర్ ఓ పాషా తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు ప్రజలను కోరారు. ఈ శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు, లేదా ఓటర్ గుర్తింపు కార్డు లేదా రేషన్ కార్డు తీసుకుని రావాలని క్లబ్ పిఆర్ఓ పాషా కోరారు.

# బాలల దినోత్సవం..భలే ఉత్సాహం









**బాల్యం ఎంత మధురమైనది? చిన్ననాటి సంగతులు గుర్తుకొస్తే ఎంత ఆనందంగా ఉంటుంది? బుడిబుడి నడకలు మొదలు బడిలో ఆట పాటల వరకు ఫొటోలను చూసుకుని మురిసిపోని వారెవరు? జెండా వందనం అంటే ఒక అనుభూతి. బాలల దినోత్సవం అంటే సంబురం. బతుకమ్మ పండుగకు ఓ వేడుక. హోలీ వచ్చిందంటే ఒక ఉత్సాహం. ఆటల పోటీలు, పతంగుల ఎగురవేతలు, ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్లు, క్లాస్‌రూం అలంకరణ, వివిధ రకాల వస్తువుల తయారీ, డ్యాన్సులు, ఏకపాత్రలు...ఇలా ఎన్నో ఎన్నెన్నో మధుర స్మృతుల కలబోత బాల్యం. ఇలాంటి అనేకానేక సృజనాత్మక కార్యకలాపాలతో తమ విద్యార్థులకు అందమైన జ్ఞాపకాలు మిగిల్చేందుకు పలు పాఠశాలలు కృషి చేస్తున్నాయి. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన వేడుకల దృశ్యాలివి.**

విశ్వంభర, భూపాలపల్లి : భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతదేశ మొట్టమొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలతో పాటు పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మడక మధు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు కనుక నెహ్రు స్ఫూర్తితో మీరంతా ఉన్నత స్థానాలలో ఎదగడానికి కష్టపడి చదువుకోవాలన్నారు. ఈ సమావేశంలో పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాశ, వీరేశం, సమ్మయ్య , నీలా రాణి, వసుదప్రియ, పూర్ణిమ, దీపిక, రజిత, ఆంజనేయులు పాల్గొన్నారు.

## స్కూల్ విద్యార్థిని విద్యార్థులతో మహేందర్ రెడ్డి..

విశ్వంభర, షాద్ నగర్ : కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు, బాజాపా నాయకుడు, సీనియర్ న్యాయవాది చెంది మహేందర్ రెడ్డి గురువారం చాచా నెహ్రూ జయంతి సందర్భంగా జరుపుకునే బాలల దినోత్సవం పురస్కరించుకొని అంబేద్కర్ కాలనీ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడ ఉన్న స్కూల్ విద్యార్థిని విద్యార్థులతో చాలాసేపు ముచ్చటించి, చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ప్రేమతో బిస్కెట్ల పంపిణీ చేసారు. స్కూల్ విద్యార్థిని విద్యార్థులతో సరదాగా గడుపుతూ, వారిని కుశల ప్రశ్నలు వేసి తన స్కూలు జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మహిళా న్యాయవాది సబియా సుల్తాన, షహనాజ్, టంగుటూరి శ్వేత, కోటి జయమ్మ, యాస్మిన్, నడికూడ మేఘనతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వంభర, షాద్ నగర్ : రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలంలోని విఠ్యల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆవుల రవి మాట్లాడుతూ పిల్లలంటే జవహర్ లాల్ నెహ్రూ కు అమితమైన ప్రేమని పుట్టినరోజునే బాల దినోత్సవం జరుపుకోవాలని ఆకాంక్షించారు. పిల్లలు దేవుని ప్రతిరూపాలుగా భావించి తన జన్మదినాన్ని పిల్లల దినోత్సవంగా జరుపుకోవాలని విట్యాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆవుల రవి తెలిపారు.

విశ్వంభర, పరిగి : విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను, కళలను వెలికి తీయడానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని పరిగి మండల విద్యాధికారి ఎం, గోపాల్ తెలియజేశారు. గురువారం పరిగి మండల పరిధిలోని మిట్ట కోడూరు ప్రాథమిక పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు ఎండి ఉస్మాన్ అలీ అధ్యక్షతన నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమానికి మండల విద్యాధికారి గోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఒకరోజు కోసం, విద్యాధికారిగా చాకలి శివకుమార్ , ప్రధానోపాధ్యాయులుగా మహేష్,18 విద్యార్థులు ఉపాధ్యాయులుగా చక్కని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఎం. గోపాల్ విద్యార్థులను అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య , నర్సింలు, రాజు, కవితా, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశ్వంభర, హైదరాబాద్ : యాకుత్పురా నియోజకవర్గం ఉప్పుగూడ శ్రీ సాయి గ్రామర్ హై స్కూల్ లో భారత తొలి ప్రధాని నెహ్రూ జయంతి సందర్భంగా ఆయనకు పిల్లలతో ఉన్న మంచి అనుబంధం కారణంగా ఆయన పుట్టిన రోజునే బాలల దినోత్సవం జరుపుకుంటారు. పాఠశాలలో చిన్నారులు నెహ్రు వేషధారణలతో అలరించడం , వివిధ రకాలు అయిన కార్యక్రమాలు చేయడం జరుగుతుందని మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ రెడ్డి వివరించారు.

విశ్వంభర, రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, ఇంద్రపాలనగరం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన వడ్లకొండ మల్లేష్ బ్రదర్స్ తన వంతుగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు అన్నప్రసాదం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి పిల్లలతో పాటు భోజనం చేసిన రామన్నపేట సి.ఐ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు తోటకూరి శేఖర్, జిల్లా నాయకులు పూస బాలకిషన్, గ్రామ నాయకులు, యువకులు, పాఠశాల బృందం తదితరులు పాల్గొన్నారు.

విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, పల్లివాడలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం రోజు చాచా నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ నెలా నిర్వహించే పేరెంట్స్-టీచర్ మీటింగ్ కూడా ఈ సందర్భంగా నిర్వహించినందున హాజరైన పేరెంట్స్ తమ పిల్లల అభివృద్ధిని, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి అబ్బురపడ్డారు. చిన్నారులు ఆహ్లాదకర వాతావరణంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలలో పాల్గొని చాచా నెహ్రూలుగా, సోది చెప్పే మాతగా, "సేవ్ ట్రీస్ - సేవ్ నేచర్" అంటూ సమాజ చైతన్య మైమ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులతో పాటు ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధారాణి, ఉపాధ్యాయులు, నిర్మళా దేవి, పాల్వంచ హరికిషన్, ఘాసీరాం, రఘురాం రెడ్డి, జయశ్రీ, కృష్ణయ్య, భూపాల్, ప్రమీల, మధుసూదన్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వంభర, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం, కల్వల ఆదర్శ పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ . నవీన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోజు విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలను బోధించారు. ఉపాధ్యాయ వృత్తి అనేది ఎంత ఉత్తమమైనదో పిల్లలకు తెలిసిందని అన్నారు . ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గా మమత , డీఈవోగా కార్తీక్ ,ఉపాధ్యాయులుగా అమీర్ విజేత మనీషా, పి ఈటి గా వెన్నెల శ్రావణి, యశ్వంత్, గణేష్, వ్యవహరించారు. పిల్లలందరూ ఉపాధ్యాయులుగా వ్యవహరించినప్పుడు ఉపాధ్యాయులు అనేవారు ఎంత ఒత్తిడికి లోనవుతారు. ఉపాధ్యాయ వృత్తి అనేది ఎంత గొప్పదో వారికి తెలిసిందని ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమయ్య, దుర్గాప్రసాద్, చంద్రమోహన్ ,సురేందర్, నరసయ్య, శ్రీదేవి, జయరానీ, వేద ప్రకాష్ , వీరబాబు, ప్రసాద్, పాల్గొన్నారు.





హైదరాబాద్ కొత్తపేటలోని కిండర్ క్లే ప్రీ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు

విశ్వంభర, కడ్తాల్ : కడ్తాల్ మండలంలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాలలో 220 మంది బాలికలకు స్టీల్ అన్నం ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దశరథ్ నాయక్ మాట్లాడుతూ తన కుమారుడి పేరిట నాలుగు సంవత్సరాల క్రితం నెలకొల్పిన రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ పాఠశాలల్లో ఏవైనా సమస్యలు ఉంటే ట్రస్టును సంప్రదించాలని మండలంలోని నిరుపేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, డైరెక్టర్ సేవ్య నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, నాయకులు మంగళపల్లి నరసింహ, లక్ష్మణాచారి, పాండు రామచంద్రయ్య వెంకటేష్, శ్రీకాంత్, శ్రీను, రాజు, జగన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వంభర, నర్సంపేట: నేటి బాలలే రేపటి బావిభారత పౌరులు అని అన్న నెహ్రు మాటలను విద్యార్థులకు మండల పరిషత్తు అభివృద్ధి అధికారిణి శ్రీవాణి గుర్తుకు చేశారు. మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాలలో ప్రపంచ బాలల దినోత్సవన్ని పురస్కరించుకుని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ చిల్డ్రన్స్ ఆర్గనైజేషన్ ఛైర్మన్ మహ్మద్ మైనుద్దీన్ ఆదేశాల మేరకు నర్సంపేట డివిజన్ ప్రధాన కార్యదర్శి నర్మెట యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాల స్పెషలా ఫీసర్ మెట్టుపల్లి జ్యోతి అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల పరిషత్తు అభివృద్ధి అధికారిణి శ్రీవాణి మాట్లాడుతూ బాలల అభివృద్ధికి లభించే నాణ్యమైన ఆహారం, ఆరోగ్యం, విద్య, వైద్యం, వినోదం, కుటుంబ జీవనం వంటి వాటి పై ఆధార పడి ఉంటుందన్నారు. భారదేశంలో రాజ్యగ చట్టాల ద్వారా బాలలకు ప్రత్యేక రక్షణలు కల్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్గివుండాలి అన్నారు. కలాం ఫౌండేషన్ ఛైర్మన్ భాషిమియా మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచం లో పిల్లలపై ఒత్తిడి, వేధింపులు దౌర్జన్యాలు, నిర్లక్ష్యం, అక్రమ రవాణా, వెట్టిచాకిరి, లాంటివి ఆందోళన కలిగిస్తూన్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువు తున్న విద్యార్థులకు పాఠశాలల అభివృద్ధికి నావంతు సహకారం అందిస్తానని తెలిపారు. హ్యూమన్ రైట్స్ అండ్ చిల్డ్రన్స్ ఆర్గనైజేషన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నర్మెట యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రతి గ్రామం నుండి యువత ముందుండాలి అన్నారు. భారత దేశం అభివృద్ధి లో దూసుకెళ్తున్నప్పటికీ బాలల హక్కుల రక్షణ లో ఆశించిన స్థాయిలో పురోగతి లేదన్నారు. విద్య అభివృద్ధి కి కీలకమైన విద్య హక్కు చట్టాన్ని తీసుకొచ్చారు అయినప్పటికీ ఎంతో మంది పిల్లలు విద్యకు దూరంగానే ఉన్నారన్నారు. దీంతో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ ,లాంటివి పెరుగు తున్నాయని అన్నారు. కస్తూరిభా గాంధీ పాఠశాల స్పెషలాఫీసర్ మెట్టుపల్లి జ్యోతి మాట్లాడు తూ బాలల దినోత్స వం పురస్కరించుకుని నెహ్రూ నేటి బాలలలే రేపటి భావితరాలకు పునాదులు అని అన్నారని తెలియజేశారు. బాలల యొక్క హక్కులు , చట్టాలపై అవగాహన కల్గి ఉండాలి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో మంది విద్యార్థులు విద్యాంభ్యసి స్తున్నారు, పేదరికాన్ని పక్కన పెట్టి విద్యలో ముందంజలో ఉన్నారు, పేద విద్యార్థుల ప్రభుత్వ పాటశాలల్లో చేర్పించి విద్యార్థుల భవిష్యత్తు కు పునాదుల వేయాలని అన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థు లకు బహుమతులు అందజే శారు. ఈ కార్యక్రమంలో కలాం ఫౌండేషన్ ఉపాధ్యక్షులు అశోక్, ఉపాధ్యాయిలు పల్లవి, రాజ్యలక్ష్మి, యశోద, తేజస్విని రజిని సుజాత, కవిత, పిఈటీలు, నరసింహస్వామి, మంజుల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వంభర, ఆమనగల్లు : ఆమనగల్లు కస్తూర్బా గురుకుల పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా విదార్థినులు స్వయం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కలెక్టర్ గా పూజ, డీఈవోగా శివాని ఎంఈఓ గా, శిరిష, ఎస్ఓ గా హారిక వ్యవహరించడం, విద్యార్థులు ఉపాధ్యాయులుగా బోధించిన తీరు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థిని లకు బహుమతులు అందజేశారు. అదే విధంగా బాలల దినోత్సవం సందర్భంగా అరబిందో హైస్కూల్లో పిల్లలు వివిధ రకాల దేశ నాయకుల వేషాలు వేసి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు.












## మెట్ పల్లి కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు -స్కూల్ విద్యార్థులకు పండ్ల పంపిణీ



విశ్వంభర, మెట్ పల్లి : కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దేశ మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలను పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కోనేరు వద్ద గల మండల ప్రజా పరిషత్ పాఠశాల విద్యార్థుల సమక్షంలో స్కూల్ ఉపాధ్యాయులు కాంగ్రెస్ పార్టీ నాయకులు చాచా నెహ్రూ చిన్న పిల్లల భవిష్యత్తు కోసం ఎల్లవేళలా కృషి చేశారని చిన్నపిల్లల చిరునవ్వు కు చిన్నహంగా గులాబీ ధరించే వారిని విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు జట్టి లింగం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి నర్సింగారావు, జువ్వడి కృష్ణారావు ల ఆదేశానుసారం మండల పరిషత్ పాఠశాల మరమ్మతులకు సహకరిస్తామని అన్నారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్గం గంగాధర్, జెట్టి లక్ష్మణ్, షేక్ మమ్మద్, జాకీర్, రాజగోపాల్, మాసం సత్యనారాయణ, యమ రాజయ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## బాల్యం భగవంతుడు ఇచ్చిన ఓ అమూల్యమైన వరం...

### ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు

విశ్వంభర, చండూరు : అందరూ అనుభవించే బాల్యం... భగవంతుడు ఇచ్చిన అమూల్యమైన వరం అని అన్నారు గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు. స్థానిక గాంధీజీ విద్యాసంస్థల యందు నవంబర్ 14, జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా గురువారంనాడు జరిగిన బాలల దినోత్సవ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభం, శుభం తెలియని ఆ పసి మనసులు పూతోటలో అప్పుడే పరిమళించిన పువ్వులని, అందుకు సూచికగా ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాలలో బాలల దినోత్సవంలు జరుపుకుంటారని, అలాగే మనదేశంలో ప్రతి సంవత్సరం నవంబర్ 14న బాలల దినోత్సవం జరుపుకుంటామన్నారు, నెహ్రూ కు పిల్లలతో ఉన్న బాంధవ్యాన్ని తెలుపుతూ ఈ ఉత్సవం జరుపుకుంటారన్నారు. పిల్లలు నెహ్రూను చాచా నెహ్రు అని ప్రేమగా పిలిచేవారన్నారు. భారత తపాలా శాఖ ప్రతి సంవత్సరం ఈరోజు తపాలా బిళ్ళను విడుదల చేస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి ఎంతో ఉన్నత స్థాయికి చేరాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత ఫలితాలు సాధిస్తారన్నారు. దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు అలరించారు. వారు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్స్ సత్యనారాయణమూర్తి, పులిపాటి రాధిక, కందుల కృష్ణయ్య, విజయ కుమారి, తరుణ్ మాస్టర్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## రైజింగ్ స్టార్ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

విశ్వంభర, భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని రైజింగ్ స్టార్ ప్రైవేటు విద్యాలయంలో బాలల దినోత్సవ వేడుకలు విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జవహర్ లాల్ నెహ్రు చిత్ర పాటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాలలో విద్యార్థులే టీచర్ల మాదిరి స్వయంపాలన చేసి చిన్నారులకు పాఠాలను బోధించారు. అనంతరం విద్యార్థుల ఫ్యాషన్ పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజులా రెడ్డి,ఇతర టీచర్లు పాల్గొన్నారు.



## సన్ షైన్ లో ఘనంగా బాలల దినోత్సవం, ఫుడ్ కార్నివాల్




**విశ్వంభర, చండూర్ :** భారత మొదటి ప్రధాని పండిట్ జావైహార్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా చండూర్ సన్ షైన్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నెహ్రూ చిత్రపటానికి పూలమాలను అలంకరించి ఘనంగా నిర్వహించారు. పౌష్టికాహార లోపం వల్ల చిన్నారులలో ఎదుగుదల తక్కువగా ఉండడం మొదలగు వాటి గురించి తెలియజేస్తూ బాలల దినోత్సవం సందర్భంగా పౌష్టిక ఆహారం గురించి తెలియజేయడం కొరకు పాఠశాలలో విద్యార్థుల చేత చేయించిన వంటల గురించి వివరిస్తూ వాటిని ఏ విధంగా ఎంత మోతాదులో స్వీకరించాలో తెలియజేస్తూ ఫుడ్ కార్నివాల్ ని ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా పాఠశాలలో నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ షోలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. సాంస్కృతి కార్యక్రమాలలో భాగంగా చిన్నారులు నృత్య ప్రదర్శనల ద్వారా విద్యార్థులను అలరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కోడి వెంకన్న మాట్లాడుతూ నెహ్రూ కి పిల్లలు అంటే ఎంతో ఇష్టమని అందుకే వారి జయంతి సందర్భంగా బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఈరోజు నిర్వహించినటువంటి ఫుడ్ కార్నివాల్ ద్వారా పిల్లల్లో పౌష్టిక ఆహారం గురించి తెలియజేయడం చాలా ఆనందాన్ని కలిగించిందని తెలియజేశారు. ఫాన్సీ డ్రెస్ షోలో అలరించిన విద్యార్థులను మరియు నృత్య ప్రదర్శన ద్వారా అలరించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోడి సుష్మ గారు, రవికాంత్, లతీఫ్ పాషా, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కాళేశ్వర ఆలయంలో టెండర్ల నోటిఫికేషన్

విశ్వంభర, భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లా లోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం ఆలయం లో ఫోటోలు, చరిత్ర పుస్తకాలు అమ్ముకొనుటకు హక్కు, భక్తుల ఫోటోలు తీసుకోను హక్కు కోసం నవంబర్ 19-2024 తేదిన ఉదయం 10 గంటల నుండి సీల్డ్ కవర్ బహిరంగ వేలం నిర్వహించబడునని ఆలయ కార్య నిర్వహణ అధికారి మారుతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టెండర్ల లో పాల్గొనేవారు ముందుగా డిపాజిట్ చెల్లించి టెండర్ షెడ్యూలు పొందవలెనని ఆయన తెలిపారు. ఇతర వివరములకు దేవస్థాన కార్య నిర్వహణ అధికారి కార్యాలయంలో కానీ లేదా 9441641455, 9959766587 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

## పారా మెడికల్ కోర్సులలో అడ్మిషన్ల తేదీ పొడిగింపు

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్ లకావత్

విశ్వంభర, మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్ర పారామెడికల్ బోర్డు హైదరాబాద్ వారి ఉత్తర్వుల ప్రకారం డి.యమ్.ఎస్.టి, డి.ఇ.సి.జి పారామెడికల్ కోర్సులకు గాను అడ్మిషన్ పొందడానికి దరఖాస్తులకు 11 నవంబర్ 2024 నుండి 20 నవంబర్ 2024 వరకు పొడిగించడమైనదని, కావున దరఖాస్తులు ప్రభుత్వ వైద్య కళాశాల మహబూబాబాద్ యందు 20 నవంబర్ 2024 వరకు స్వీకరించబడునని, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు అన్ని సర్టిఫికెట్స్ యొక్క జిరాక్స్ కాపీలు స్వీయ ధ్రువీకరణతో జతపర్చగలరని మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ నేడు ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. అప్లికేషన్ లో తప్పుడు సమాచారం, సంబంధిత సర్టిఫికెట్లు సమర్పించని యెడల అట్టి దరఖాస్తు తిరస్కరించబడుతుందని, దరఖాస్తు ఫారం మరియు సూచనలు, పూర్తి వివరాలకై www.tspmb.telangana.gov.in వెబ్సైట్ లో చూడగలరని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



విశ్వంభర, భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లా ఘనపూర్ మండలంలోని చెల్పూర్ గ్రామంలో 156 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుందని చెప్పారు. ఈ ఆసుపత్రిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాబోవు రోజుల్లో ఈ ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



విశ్వంభర, తలకొండపల్లి: తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన సింగల్ విండో మాజీ డైరెక్టర్ తిరుమణి కృష్ణయ్య గౌడ్ తల్లి తిరుమణి రాంచంద్రమ్మ బుధవారం రాత్రి మరణించింది. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకురి ప్రభాకర్ రెడ్డి, సింగల్ విండో ఛైర్మన్ గట్ల కేశవరెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగల్ విండో ఛైర్మన్ ఏ అంజయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ మల్లికేడి అంబాజీ,యాదయ్య, పి రమేష్ యాదవ్, బి నర్సింలు, ఎం.ఏ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల కదలికలపై పటిష్ట నిఘా ఉండాలి



విశ్వంభర, భూపాలపల్లి: మావోయిస్టుల కదలికలపై పటిష్ట నిఘా ఉండాలని, గంజాయిని పూర్తిస్థాయిలో అరికట్టాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ కిరణ్ ఖరే అన్నారు. గురువారం ఎస్పీ మహాదేవపూర్ పోలీసు స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లోని రికార్డులను పరిశీలించి, కేసుల స్థితి గతులు అడిగి తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, నమోదయ్యే కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల పనితీరు, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాలు, నివారణ చర్యల గురించి అడిగి తెలుసుకుని, పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ మహాదేవ్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధి మహారాష్ట్ర సరిహద్దును కలిగి ఉన్నందున మావోయిస్టుల కదలికపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజల భద్రతకై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాధితులు ఫిర్యాదు చేయగానే విచారణ జరిపి, న్యాయం చేయాలన్నారు.పోలీసులు క్రమశిక్షణగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని అన్నారు. ఆ తర్వాత అధికారులతో కలిసి పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ జి. రామ్ మోహన్ రెడ్డి, సీ ఐ రామచంద్రరావు, మహాదేవపూర్ ఎస్ ఐ పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ వెంచర్ కోసం ప్రభుత్వ భూమి

### అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూమి పనులను అడ్డుకున్న గ్రామస్తులు



విశ్వంభర, సంగారెడ్డి : జిన్నారం మండల కేంద్రంలో 1002 సర్వేనెంబర్ ప్రభుత్వ భూముల నుంచి వంద ఫీట్ల రహదారిని ఉట్ల రెవెన్యూ పరిధిలోని వంద ఎకరాలలో ఏర్పాటు చేయనున్న ప్రైవేట్ వెంచర్ కోసం రహదారి నిర్మాణం చేస్తున్నారు. ప్రభుత్వ భూమి నుంచి ప్రైవేటు వ్యక్తుల కోసం రహదారిని ఎలా నిర్మిస్తారని జిన్నారం గ్రామస్తులు గురువారం జరుగుతున్న పనులను నిలిపివేయాలని సదరు కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ పక్క ప్రణాళికతో జిన్నారం మండల కేంద్రంలోని ఒక వెయ్యి రెండు సర్వేనెంబర్ లో ప్రభుత్వ భూమి నుంచి ప్రవేట్ వెంచర్ కోసం 100 ఫీట్ల రహదారి నిర్మాణం చేస్తున్నారని దీనికి స్థానిక ఎమ్మెల్యే మద్దతు తెలపడం దురదృష్టకరమన్నారు. 10 సంవత్సరాల కాలంలో పేదవాళ్లకు గజం భూమి కూడా ఇవ్వని స్థానిక ఎమ్మెల్యే ప్రైవేటు వెంచర్ల కోసం భారీ ఎత్తున రహదారిని నిర్మాణం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వపరంగా అనుమతి లేని ఈ రహదారిని నిలిపివేయలాని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో రహదారిని నిర్మించే పరిస్థితి లేదని అడ్డుకోకుంటే పూర్తిస్థాయిలో టెంట్ వేసుకొని నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ ను కలిసిఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో నుంచి వేస్తున్న 100 ఫీట్ల రహదారి అడ్డుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## సామాజిక బాధ్యతను చాటిచెప్పిన ఎంబీఏ విద్యార్థులు

కేర్ ఎన్ లవ్ అనాథాశ్రమ చిన్నారులతో ఉత్సాహభరితంగా 'జాయ్ ఆఫ్ గివింగ్'





విశ్వంభర, సంగారెడ్డి : వ్యాపార మేళకువలే కాదు, సామాజిక బాధ్యత కూడా తమ మీద ఉందన్న స్ఫూర్తిని చాటేలా గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్ ఎంబీఏ విద్యార్థులు గురువారం జాయ్ ఆఫ్ గివింగ్ కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని, గాజులరామారంలోని కేర్ ఎన్ లవ్ అనాథాశ్రమానికి చెందిన 44 మంది చిన్నారులు, ఇద్దరు సిబ్బందిని గీతంకు ఆహ్వానించి, రోజంతా వారితో ఆడి పాడుతూ, తమలోని సామాజిక స్పృహ, కరుణలను హృదయపూర్వకంగా ప్రదర్శించారు.అనాథ శరణాలయం వార్డెన్ స్వర్ణలత ఆధ్వర్యంలో చిన్నారులు చిరునవ్వులు చిందించేలా ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పలు వినోదాత్మక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. చిన్నారులందరికీ ఎంబీఏ విద్యార్థులు అందమైన బహుమతులను అందించి, తమలో మూర్తీభవించిన దాతృత్వం, దయ స్ఫూర్తిని చాటిచెప్పారు. సామాజిక శ్రేయస్సుకు దోహదపడేలా, ఇందులో పాల్గొన్న వారందరిలో ఆశ, సానుకూల భావాన్ని కలిగించారు.ఈ కార్యక్రమ ప్రారంభోత్సవంలో గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, బీ-స్కూల్ ఇన్ ఛార్జి డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తా అలాగే ఈ కార్యక్రమంలో బీ-స్కూల్ అధ్యాపకులు డాక్టర్ నాగప్రియ, డాక్టర్ శ్రీకాంత్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. విజయవంతంగా ముగిసిన పరిశోధనా మెథడాలజీ కోర్సు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సౌజన్యంతో, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్ లో ఈనెల 4 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన పది రోజుల రీసెర్చ్ మెథడాలజీ కోర్సు (ఆర్ఎంసీ)ని విజయవంతంగా ముగించినట్టు కోర్సు సహ-డైరెక్టర్ డాక్టర్ మనోజ్ కుమార్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఆధునిక విద్యావసరాలకు సరిపోయే పరిశోధనా నైపుణ్యాలతో స్కాలర్లను సన్నద్ధం చేయడం లక్ష్యంగా దీనిని నిర్వహించామన్నారు. ఈ కోర్సును ఐపీఈ పూర్వ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.కె.మిశ్రా ప్రారంభించగా, దేశంలోని పలు విద్యా సంస్థలకు చెందిన విశిష్ట అధ్యాపకులు ప్రొఫెసర్ మహమ్మద్ అబ్దుల్ అజీమ్, ప్రొఫెసర్ రూపేష్ కుమార్, ప్రొఫెసర్ రవికాంత్, ప్రొఫెసర్ నిత్య సుందర్ నందా, ప్రొఫెసర్ జ్యోతిశ్రీ, ప్రొఫెసర్ ఇ.రాజేష్, ప్రొఫెసర్ శివోహం సింగ్, ప్రొఫెసర్ వినోద్ కుమార్, ప్రొఫెసర్ ఎం.పీ.గణేష్, ప్రొఫెసర్ మురుగన్ పట్టుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

### మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త



విశ్వంభర, ఎల్బీనగర్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని బ్యాడ్మింటన్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 11, 13 సింగిల్స్ డబుల్స్ విభాగంలో పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన అన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన అన్నారు. క్రీడల్లో విద్యార్థులు రాణించి సమాజానికి తల్లిదండ్రుల కు మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నవంబర్ 14 ,15,16 తేదీల్లో ఆర్3 ( ఎస్ జోన్) బ్యాడ్మింటన్ అకాడమీ నాగోల్ లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో 380 మెంబెర్స్ పాల్గొన్నారు అని ఆయన అన్నారు. పేద క్రీడాకారులకు ఉప్పల ఫౌండేషన్ ద్వారా వారికి ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుంది అని క్రీడాకారులకు అవసరమైన సామగ్రి కూడా తన ఫౌండేషన్ ద్వారా అనేక మందికి అందజేయనన్నట్లు ఉప్పల శ్రీనివాస్ గుప్త తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ రావు, ప్రభాకర్ బస్కర్, వికాస్ హర్ష యాదవ్, రమేశ్ పిల్లలమర్రి, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి వంశీధర్, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సన్యాసిరావు పాల్గొన్నారు.

# పెద్ద చెరువులో మునిగిన తమ ప్లాట్లను కాపాడాలి



విశ్వంభర, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ పట్టణ పరిధిలో పెద్ద చెరువులో మునిగిపోయిన తమ ప్లాట్లను కాపాడి తమకు న్యాయం చేయాలని గత ఐదు రోజులుగా పెద్ద చెరువు వద్ద పెద్ద ముంపు బాధితులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద చెరువు ముంపు బాధితులు ఐదు రోజులగా ధర్నా చేస్తూ అమీన్పూర్ మున్సిపల్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. 1984 అమీన్పూర్ లో దాదాపు 5,000 మంది కూడబెట్టిన డబ్బులతో ప్లాట్లు కొన్నారు. అయితే అప్పుడు అమీన్పూర్ పెద్ద చెరువు 93 ఎకరాల్లో ఉండేదని క్రమంగా స్థానిక నాయకులు అమీన్పూర్ పెద్ద చెరువు తూములను మూసివేసి నీరు బయటకు వెళ్లకుండా చేసి చెరువు దాదాపు 463 ఎకరాలకు విస్తరింప చేశారని తమ ప్లాట్లు అందులో మునిగిపోయాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు.గతంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,దామోదర రాజనర్సింహ, జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి తదితరులను కలిసి తమకు న్యాయం చేయాలని కోరామని అందుకు వారు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. అందువల్లనే దాదాపు 30 రోజుల పాటు నిరవధిక సమ్మె అమీన్పూర్ చెరువు కట్టపై తమకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని ముంపు బాధితులు పేర్కొన్నారు. పైసా పైసా కూడా పెట్టి మేము కొన్న ప్లాట్లను కాపాడి తమకు న్యాయం జరిగేలా చేయాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు విషయం తీసుకుని వెళ్లాలని, మీడియా ముఖంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో చిరునామా సత్యనారాయణ, బ్రహ్మానందరావు, విజయ్ కుమార్ రెడ్డి, వేణు, సంజయ్ కుమార్, బాబు, సాయిబాబా వెంకటేశ్వర రెడ్డి రంగరాజు, గణేష్, ఆంజనేయరాజు రాజన్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



విశ్వంభర, మెట్ పల్లి: జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం వేంపేట గ్రామంలోని ఎంపీపీ ఎస్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వయం పరిపాలన దినోత్సవం నిర్వమించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. మాజీ ప్రధాని జవహర్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాలులర్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గ్రామ విద్యాభిమాని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ అల్లూరి మహేందర్ రెడ్డి పాల్గొని మాజీ ప్రధాని నెహ్రూ కు చిన్న పిల్లలు అంటే చాలా ఇష్టం అన్ని అందుకే ఈ రోజు బాలల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుంది అని అన్నారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ఏఏపీసీ ఛైర్మన్ శ్రీమతి ఎలాల రమ, ప్రధానోపాధ్యాయులు శ్రీ కోటగిరి నర్సయ్య , ఉపాధ్యాయులు శ్రీనివాస్, కుమారస్వామి, అంగన్ వాడి టీచర్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆర్ఎంపి వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



విశ్వంభర, సంగారెడ్డి : పటాన్ చేరు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్న ఆర్ఎంపి, పిఎంపి వైద్యుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పటాన్ చేరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఆర్ఎంపి, పిఎంపిలు ఎమ్మెల్యే జిఎంఆర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల పటాన్ చేరు నియోజకవర్గ పరిధిలో జిల్లా వైద్యాధికారులు తనిఖీలు చేసి పలు ఆర్.ఎం.పి, పి.ఎం.పి క్లినిక్ లను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్.. ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే పనిచేయాలని వారికి సూచించారు.

## జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి



విశ్వంభర, మహబూబాబాద్: కందికొండ శ్రీ లక్ష్మి నర్సింహాస్వామి వారి జాతర బందోబస్త్ ఏర్పాట్లను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పరిశీలించారు. జాతర సమయంలో దొంగలు, ఆకతాయిలపై నిఘా పెట్టాలి అని అధికారులకు సూచనలు చేసారు. ప్రశాంతమైన వాతావరణంలో జాతర జరుపుకోవాలని ఎస్పీ భక్తులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయా సంఘటనలు జరుగకుండా చూడాలని ఎస్పీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తొర్రుర్ డీఎస్పీ కృష్ణ కిషోర్, మరిపెడ సీఐ రాజ్ కుమార్ గౌడ్,ఎస్.బి ఇన్స్పెక్టర్ చంద్ర మౌళి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ శంకర్ నాయక్,సీరోల్ ఎస్. ఐ నగేష్ ఆర్. ఐ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయిని దగ్ధం చేసిన పోలీసులు



విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా సీజ్ చేయబడిన ఒక కోటి ఇరవై ఎనిమిది లక్షల తొంబై మూడు వేల రూపాయలు విలువైన గంజాయిని పోలీసులు దగ్ధం చేశారు. కాకతీయ మెడిక్లీన్ ఏజెన్సీ, ఊర్సుగుట్ట, హన్మకొండలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ డ్రగ్ డిస్పోసల్ కమిటీ అధికారి ఆదేశాల మేరకు డ్రగ్ డిస్పోసల్ కమిటీ సభ్యులు అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నైయ్య, డీఎస్పీ తిరుపతి రావు సమక్షంలో 515 కేజీల 720 గ్రాముల గంజాయి దహనం చేశారు. మహబూబాబాద్ జిల్లా పోలీసులు జిల్లావ్యాప్తంగా గత కొంతకాలంగా నిర్వహించిన వివిధ దాడుల్లో పట్టుబడిన భారీ మొత్తంలో గురువారం ధ్వంసం చేశారు. కాలిపోయిన గంజాయి విలువ రూ. 1,28,93000 లు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లో నమోదు అయినా 24 కేసులలో మొత్తం 515 కేజీల 730 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి, ఇతర డ్రగ్స్‌ను రవాణా చేసిన వారిపై కఠిన చర్యల తీసుకుంటామని తెలిపారు. గంజాయి దగ్ధం చేయు కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతి రావు, సీఐ డీసీఆర్బీ సత్యనారాయణ, సీఐ టౌన్ దేవేందర్, సీఐ డోర్నకల్ రాజేష్, సీఐ గూడూరు బాబు రావు, సీఐ బయ్యారం రవి పాల్గొన్నారు.

## ఏబీవీపీ మెట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో ధర్నా



విశ్వంభర, బాసర: బాసర త్రిబుల్ ఐటీ లో పీయూసీ ద్వితీయ సంవత్సరం చదువుతూ ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని స్వాతి కుటుంబానికి వెంటనే న్యాయం చేయాలని, అలాగే విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని అడిగిన విద్యార్థులపై దాడి చేసిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ మెట్ పల్లి శాఖ ఆధ్వర్యంలో స్థానికపాత బస్టాండ్ చౌరస్తా లో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి పట్టణ కార్యదర్శి మంగళపల్లి మారుతి మాట్లాడుతూ ఉరి వేసుకున్న విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం చేకూరేలా పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి పరిషత్ నాయకులపై దాడి చేసిన సెక్యూరిటీ, యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల అఖిలభారతి విద్యార్థి పరిషత్ రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు నిర్వహిస్తుందని మీడియా ముఖంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మంగళపల్లి మారుతి, వైస్ ప్రెసిడెంట్ సాల్వల లోకేష్, డిగ్రీ కాలేజెస్ ఇన్చార్జ్ సీనియర్ కార్యకర్త ప్రభు రాజ్ నిక్లేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సనాతన హిందూ ధర్మ పరిరక్షణ సంస్థ మండల కన్వీనర్‌గా మాదవ శేషు



విశ్వంభర, హైదరాబాద్: సనాతన హిందూ ధర్మ పరిరక్షణ సంస్థ ఆలేరు మండలం సాయి గూడెం ప్రాంతానికి చెందిన మంగళగిరి మాధవ శేషు ని సనాతన హిందూ ధర్మ పరిరక్షణ సంస్థ ఆలేరు మండల కన్వీనర్ గా నియమిస్తున్నట్లు సనాతన హిందూ ధర్మ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ మల్లేశం, జే శివ శంకర్, సనాతన హిందూ ధర్మ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమల మనోహరాచార్య సంయుక్తంగా నియమించినట్లు వారు తెలిపారు.

# అధికారులపై దాడిని ఉపేక్షించొద్దు

- నిందితులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలి
- లగచర్ల ఘటనకు నిరసనగా హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ధర్నా
- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి డిమాండ్



విశ్వంభర, హైదరాబాద్ వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో అధికారులపై జరిగిన దాడి ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగుల ఐకాస ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనుక ఎవరున్నా, ఎంతవారైనా ఉపేక్షించొద్దని కోరారు. లగచర్ల ఘటనకు నిరసనగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగుల ఐకాస ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి హాజరయ్యారు. ధర్నాను ఉద్దేశించి వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులపై దాడికి పాల్పడి, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు కుట్రపన్నిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజల కోసం పని చేసే ప్రభుత్వ అధికారులను లక్ష్యంగా చేసుకొని దాడి చేయడంలో కుట్ర కోణం దాగి ఉంటుందని ఆరోపించారు. ఇప్పటికే పోలీసుల విచారణలో వెలుగులోకి వస్తున్న విషయాలు ఉద్యోగ లోకాన్ని భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. రాజకీయాలకు అతీతంగా సేవలు అందించే అధికారులపై దాడులు, హత్యాయత్నం వంటి ఘటనలకు పూనుకోవడం వెనుకాల బలమైన కుట్ర దాగి ఉందనే అనుమానాలకు బలం చేకూరుతుందన్నారు. తీవ్రంగా గాయపడిన ఏ అధికారిని ఎవరు పరామర్శించలేదన్నారు. చివరకు కొందరు అధికారులపై జరిగిన దాడిని సైతం పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. లగచర్ల ఘటనలో దాడికి గురైన ఉద్యోగులపై కాకుండా, దాడికి పాల్పడిన వారిని పరామర్శించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం హైదరాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ నాయకులు కె.రామకృష్ణ , జనరల్ సెక్రటరీ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, ఎస్.రాములు , అధ్యక్షులు తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ , డా.జి.నిర్మల, అధ్యక్షులు తెలంగాణ ఉద్యోగుల అసోసియేషన్, దర్శన్‌గౌడ్, అధ్యక్షులు తెలంగాణ సీపీయస్ యూనియన్ , డా. కత్తి జనార్దన్, దేవికా, శ్రీరాం, హరికిషన్, ఉదర గోపాల్, విజయారావు, సుగంధిని, హేమలత, రాబర్ట్ బ్రూస్, రోహిత్ నాయక్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక మాస పూజలు



విశ్వంభర, పెద్ద శంకరంపేట: కార్తీకమాసం పురస్కరించుకొని పెద్ద శంకరంపేట పట్టణంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం తో పాటు పలు దేవాలయాల్లో మహిళలు గురువారం ఉసిరి, తులసి చెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉసిరి, తులసి చెట్లకు ప్రత్యేకంగా అలంకరణ చేసి వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుని అక్కడే వనభోజనాలు చేశారు. మండల పరిధిలోని కొప్పల్ ఉమా సంగమేశ్వర దేవాలయంలో పలు ఆలయాల్లో కూడా కార్తీకమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సదర్ సమ్మేళన్ సన్నాహక సమావేశం



విశ్వంభర, సూర్యాపేట: సూర్యాపేట జిల్లాలో సదర్ సమ్మేళన్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) పి. రాంబాబు అన్నారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లాలోని యాదవ కుల ప్రముఖులతో నిర్వహించిన సదరన్ సమ్మేళన్ సన్నాక సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సదరన్ సమ్మేళన్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని, జిల్లాలో సదర్ సమ్మేళన్ ఉత్సవాలను నిర్వహించుటకు గాను యాదవ కులస్తుల పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి సదర్ ఉత్సవాలను ఏ విధంగా నిర్వహించాలి, ఉత్సవాలు నిర్వహించే తేదీ, స్థలము గురించి చర్చించారు. అందరు సమావేశం ఏర్పరచుకొని కుల పెద్దలతో కమిటీ వేసుకోని తెలుపవలసిందిగా అదనపు కలెక్టర్ సంబంధిత కుల పెద్దలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంక్షేమ బోర్డు సభ్యులు చేవిటి వేంకన్న, డా, రామ్మూర్తి, సి.హెచ్. వెంకన్న యాదవ్, లింగమంతుల దేవస్థానం మాజి చైర్మన్ కోడి సైదులు యాదవ్, పల్లెబోయిన నరసయ్య యాదవ్, యాదవ ఉద్యోగుల ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ మట్టపల్లి రాము యాదవ్, వజ్జా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## మధురై పర్యటన నుంచి వచ్చిన డీసీసీబీ డైరెక్టర్‌కు సన్మానం



విశ్వంభర, కడ్తాల్: తమిళనాడులోని మధురై పట్టణంలో ఇటీవల నిర్వహించిన డీసీసీబీ డైరెక్టర్ల శిక్షణ శిబిరంలో డీసీసీబీ డైరెక్టర్ ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్త పర్యటన ముగించుకొని గురువారం కడ్తాల్ పట్టణానికి విచ్చేశారు. ఈ సందర్భంగా విజయవంతంగా పర్యటన ముగించిన వెంకటేష్ గుప్తను మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు కడారి రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వెంకటేష్ గుప్తా సహకార బ్యాంకుల ద్వారా మెరుగైన సేవలు నిరుపేద ప్రజలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, మంగళపల్లి నరసింహ, భిక్య నాయక్, వెంకటేశ్, శ్రీకాంత్, శ్రీను, జగన్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమాల ద్వారానే కులగణన సాధ్యమైంది

- జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్



విశ్వంభర, హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన కులగణన కు వ్యతిరేకంగా బీజేపీ పార్టీ కుట్రలు చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మండి పడ్డారు. తాను చేపట్టిన కుల గణన చైతన్య యాత్ర లో భాగంగా గురువారం కాజీపేట ఫాతిమా జంక్షన్ లోని ఫంక్షన్ హాల్ లో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ కులగణన వ్యతిరేకిస్తున్న పార్టీ లకు పుట్టగతులుండవని హెచ్చరించారు. బీజేపీ పార్టీ కి బీసీ సమాజం పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సంక్షేమ పథకాలకు, సమగ్ర కులగననకు ఎలాంటి సంబంధం లేదని ప్రజలు భయందోళనలు వీడాలని అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుకే రాష్ట్రంలో సమగ్ర కులగణన జరుగుతుందని దీనివల్ల ఎవరికి నష్టం వాటిల్లబోదని తెలిపారు.కులగణన సేకరణకు వచ్చే ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తున్న వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.కులగణన పై అగ్రకులనేతలు కుట్రలు చేస్తున్నారని బీసీ సమాజం కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపించారు.బీసీ కులాల లెక్కలు తేలే సమయం ఆసన్నమైందని,బీసీ కులాలు తప్పనిసరిగా కులగణన లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే కులగణపై కేంద్రాన్ని ఒప్పించాలన్నారు. కులగణపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి మీడియా ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ప్రచారం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ప్రజలను చైతన్యం చేసి కులగణన పై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదన్నారు.జాతీయ అధికార ప్రతినిధి తీగల ప్రదీప్ గౌడ్ మాట్లాడుతూ కుల గణన పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అన్ని కుల సంఘాలపైన ఉందన్నారు. కులగణన ను బీసీ ప్రజలు నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలను మోసం చేసినట్టే అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు రవి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ ... స్థానిక ఎన్నిక ల లోపు కులగణన పూర్తి చేయాలన్నారు. కులగణన ను అడ్డుకోవాలని చూస్తే దేనికైనా తెగిస్తామని హెచ్చరించారు. 30ఏళ్లు గా బీసీ ల కోసం పాటు పడుతున్నామని లెక్కలు తేల్చే విషయంలో అడ్డు పడితే ఊరుకోబమన్నారు.ప్రొఫెసర్ కూరపాటి మాట్లాడుతూ..ప్రభుత్వం కుల గణన పైన ఇంకా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. రాజ్యాధికారం సాధించే వరకు ఉద్యమాలు కొనసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదురాజ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్, బచ్చు ఆనందం, గౌడ రాష్ట్ర సంఘం అధ్యక్షులు బొనగాని యాదగిరి గౌడ్, బీసీ సంఘం నాయకులు ఏదునూరి రాజమౌళి, అసిస్టెంట్ ప్రొఫెసర్ చిర్ర రాజు, బీసీ విద్యార్థి నాయకులు అరెగంటి నాగరాజు, డాక్టర్ కూరపాటి రమేష్, అడ్వకేట్ సాయిని నరేందర్, తాడిశెట్టి క్రాంతి కుమార్, చిప్ప వెంకటేశ్వర్లు, జనగాం శ్రీనివాస్, కాసగాని అశోక్, మడిశెట్టి నాగరాజు పటేల్, తుపాకుల రవి, బీసీ సంఘం మహిళ నాయకులు మాధం పద్మజ దేవి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకే మొదటి ప్రాధాన్యత

శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



విశ్వంభర, పెద్ద శంకరంపేట: తెలంగాణ ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యతనిచ్చి ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్యను అందించే విధంగా చర్యలు గైకొంటుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా నారాయణఖేడ్ పట్టణ పరిధిలోని గిరిజన బాలిక హాస్టల్ పాఠశాలలో మన భారతదేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవ కార్యక్రమంలో శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదట గా విద్యార్థిని విద్యార్థులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మా ప్రభుత్వం మొదటగా విద్యా కే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని, అలాగే మన వెనకబడిన నారాయణఖేడ్ ప్రాంతానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ రావడంతో మన నియోజకవర్గంలోని పేద మధ్యతరగతి విద్యార్థులు చదువుకోడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. కొద్ది రోజుల క్రితం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి హాస్టల్లో డైట్ కాస్మోటిక్ చార్జీలను 40 శాతానికి పెంచడం జరిగిందని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల విద్య వ్యవస్థ మొత్తం భ్రష్టు పట్టించడం జరిగిందని అన్నారు. కావున మా ప్రభుత్వం అలా చేయకుండా విద్యకు మొదటి ప్రాధాన్యం ఇస్తూ విద్య వ్యవస్థను మెరుగుపరుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటలను కూడా ఆడాలి అని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గానికి ఇండోర్ ఔట్ డోర్ స్టేడియం కూడా మంజూరు అవడం జరుగుతుంది అని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు ఆయన సోదరుడు డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్ స్వరూప్ శేట్కర్, భోజిరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, రమేష్ చౌహాన్, నెహ్రూ నాయక్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం: కేఎల్ఆర్



విశ్వంభర, మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేఎల్ఆర్ తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సాయం అందించడం ఎంతో గొప్ప విషయం. ఈ సహాయం ద్వారా ప్రజల జీవితాలను సులభతరం చేయడం మన బాధ్యత. ప్రజల కోసం పనిచేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మహేశ్వరం నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం, ముఖ్యంగా వైద్య ఖర్చుల నిమిత్తం అవసరమైన సహాయాన్ని అందించడం ద్వారా, వారికి ఒక నమ్మకం కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సహాయం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి కుటుంబానికి మేము చేయూత అందిస్తామని, భవిష్యత్తులో మరింత సహాయం అందించడానికి సిద్ధంగా ఉంటామని కేఎల్ఆర్ స్పష్టం చేశారు. మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ఈ చెక్కులు అందజేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పొందిన లబ్ధిదారులు కేఎల్ఆర్ కి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. పలువురు లబ్ధిదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలో యువతకు ఉపాధి అవకాశాలు



విశ్వంభర, కడ్తాల్: కర్తాల్ మండలానికి చెందిన సక్రు నాయక్ బీ ఎన్ రెడ్డి నగర్ లో ఏర్పాటు చేసిన స్నేహ చికెన్, లైవ్ ఫిష్ షాప్ ను గురువారం పీసీసీ కార్యవర్గ సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి అవకాశాలను ఎంచుకోని అభివృద్ధిలోకి రావాలని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తుందని తెలిపారు.

## శ్రీ ఉమామహేశ్వర స్వామికి లక్ష పత్రి పూజ



విశ్వంభర, ఎల్బీనగర్ : సరూర్ నగర్ డివిజన్ లోని వెంకటేశ్వర కాలనీ, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో 40వ బ్రాహ్మొత్సవాల సందర్భంగా గురువారం ఉమామహేశ్వర స్వామికి లక్ష పత్రి పూజ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. దేవాలయ ఆవరణ శివ నామ స్మరణ తో మారుమ్రోగింది. అనంతరం భక్తులు స్వామి వారి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కోరుపోలు భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతి ప్రసాద్, మాజీ ఛైర్మన్ గండు ధనం రెడ్డి, కమిటీ సభ్యులు బొగేశ్వర్ రావు, సుబ్బరావు, శ్రీమన్నారాయణ, శ్రీనివాస్ రావు, ప్రతాప్ రెడ్డి, మహేందర్, ఆలయ సభ్యులు రవీందర్ రావు, వీరేందర్ రెడ్డి, రాజశేకర్, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



విశ్వాంభర, పెద్ద శంకరంపేట: బాలల దినోత్సవ వేడుకలను మండల పరిధిలో ఘనంగా నిర్వహించారు. పెద్ద శంకరంపేట తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. సంస్కార్ విద్యాలయంలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వాలీబాల్, కబడ్డీ, కోకో తదితర ఆటలు ఆడించడంతో పాటు గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో దేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జన్మదిన సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులు స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వంభర, సూర్యాపేట: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నెహ్రూ నగర్ లోని జయ స్కూల్ నందు భారత ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం



సందర్భంగా బాలలదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు జాతీయ నాయకుల వేషధారణలో అలరించారు. తెలంగాణ తల్లి, దుర్గాదేవి, స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్, శివాజి, అల్లూరి సీతారామరాజు వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో జయ స్కూల్ కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ మాట్లాడుతూ తమ పాఠశాల యందు ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా దేశభక్తిని చాటేవిధంగా చిన్నారుల వేషధారణతో సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల నృత్యాలు అలరించే విధంగా వున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జయ స్కూల్ డైరెక్టర్ లు జల్లా పద్మ, బింగి జ్యోతి లు, పాఠశాల సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

## నెహ్రూ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి: ఎమ్మెల్యే డాక్టర్. మురళీ నాయక్



విశ్వాంభర, మహబూబాబాద్: భారత స్వాతంత్ర్య ఉద్యమ పోరాట యోధుడు తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్. మురళీ నాయక్ కొనియాడారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో నిర్వహించిన నెహ్రూ జయంతి ఉత్సవాలలో మహబూబాబాద్ శాసనసభ్యులు భూక్య మురళీ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై నెహ్రు విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ దేశానికి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం నవంబర్ 14 న పిల్లల దినోత్సవం జరుపుకుంటున్నామని, నెహ్రూ జైలు జీవితం గడిపిన రోజులలో ఆయన రాసిన లేఖలతో తన కూతురు ఇందిరా గాంధీ దేశానికి ప్రధానిగా ఎదిగారని కొనియాడారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ జయంతి వేడుకలో కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ముగిసిన 10వ జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్



విశ్వంభర, ఫరూక్ నగర్: రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం లోని కమ్మదనం గురుకుల పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న పదవ జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు సమావేశానికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు.

## బీజేపీ క్రియాశీల సభ్యత్వ కార్యచరణ సమావేశం

### మండల పార్టీ అధ్యక్షుడు గజరాజు కాశీనాద్



విశ్వంభర, ఆత్మకూరు(ఎం) : యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల పార్టీ అధ్యక్షులు గజరాజు కాశీనాథ్ ఆధ్వర్యంలో క్రియాశీల సభ్యత్వ కార్యచరణ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉపాధ్యక్షులు పన్నాల శేఖర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రతి బూతులో కనీసం వందమంది సభ్యత్వం చేయాలని చేసిన వారికి క్రియాశీల సభ్యత్వం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చ రాష్ట్ర నాయకులు బొట్టు అబ్బయ్య,జిల్లా స్పోప్ పర్సన్ బొబ్బిలింద్రారెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి బండారు సత్యనారాయణ, కిసాన్ మోర్చా మండల పార్టీ అధ్యక్షులు అంబోజు అంజయ్య, ఎస్సీ మోర్చా అధ్యక్షులు మేడిసాగర్, మండల ఉపాధ్యక్షులు సాయి రెడ్డి చంద్రారెడ్డి,ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి మధు,గ్రామ శాఖ అధ్యక్షులు లోడి వెంకటయ్య, భూతు అధ్యక్షులు పొడుగు వెంకటేశం, పి విజయ్, ముప్పిడి ప్రవీణ్, బీజేవైఎం నాయకులు సూర్య, బండారు సాయి, బీజేపీ నాయకులు యాస శ్రీనివాస్ రెడ్డి, గడ్డం స్వామి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలకు డిక్షనరీల బహూకరణ



విశ్వంభర, మహబూబాబాద్: ఈనెల 9వ తేదీన జరిగిన జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారు బాలికల ఉన్నత పాఠశాల మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం విద్యార్థినిలకు భారత రాజ్యాంగం – న్యాయసేవలు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి రెండు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులుగా తెలుగు – ఇంగ్లీష్ నిఘంటువులను జిల్లాన్యాయ సేవాధికార సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జ్ సురేష్ విద్యార్థినిలకు ప్రధానం చేశారు. బావి భారత పౌరులైన ఈ విద్యార్థినిలు చక్కగా చదువుకొని ఉన్నత మైన స్థాయిలో స్థిరపడి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, వారి తల్లిదండ్రులకు, అదేవిధంగా దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని, దేశాభివృద్ధికి తోడ్పడాలని వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి నాగేశ్వరరావు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు వీరస్వామి, సీనియర్ ఉపాధ్యాయురాలు గిరిజ, కోర్టు సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రతీ విద్యార్థి భారతదేశం గర్వించే విధంగా ఎదిగాలి : కార్పొరేటర్ బన్నాల



విశ్వంభర, సికింద్రబాద్ : చిల్కానగర్ డివిజన్లోని శ్రీనగర్ కాలనీలో రిజిస్ హెరిటేజ్ స్కూల్ యాజమాన్యం ఏర్పాటు చేసిన బాలల దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ.. ఈనాటి బాలలే రేపటి భావిభారత పౌరులని పిల్లలకు ఉపాధ్యాయులు చిన్న వయసు నుండే సమాజం పట్ల అవగాహన కల్పించాలని, పిల్లలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ఆటపాటలు అన్నిట్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎదుల కొండల్ రెడ్డి, కోకుండా జగన్ స్కూల్ యాజమాన్యం అమల్, ఉపాధ్యాయులు, పిల్లలు పేరెంట్స్ మొదలగువారు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చిన్నారుల కోసం చిత్రాలు రావాలి

### పొన్నం రవిచంద్ర



విశ్వంభర, కరీంనగర్: చిన్నారుల మనో వికాసాన్ని పెంపొందించే చిత్రాలు రావాల్సిన అవసరం ఉందని కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షులు పొన్నం రవిచంద్ర అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫిలిం సొసైటీ 3 రోజులపాటు నిర్వహిస్తున్న బాలల చలనచిత్రోత్సవాన్ని ప్రారంభించిన అనంతరం రవిచంద్ర మాట్లాడుతూ సినిమాను పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్మించి వారికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. దానికి ఇరాన్ లాంటి దేశాల పిల్లల చిత్రాల్ని ప్రేరణగా తీసుకోవాలని అన్నారు. పిల్లలు తమ భావాలను, సమాచారాన్ని పంచుకోవడాన్ని, పరస్పర అవగాహనను పెంచుకోవడాన్ని ప్రోత్సహించేందుకుగాను ఈ చిత్రోత్సవాలు తోడ్పడుతాయని రవిచంద్ర అన్నారు. ఈ సందర్భంగా మొదటి రోజు ప్రదరిశిస్తున్న బాలశివాజి, చిత్రంతో పాటు దిల్లర్ భచ్చే, అభయం చిత్రాల వీడియో క్యాసెట్స్ ని రవిచంద్ర ఆవిష్కరించారు. అనంతరం బాలశివాజీ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లక్ష్మి గౌతమ్, ఉపాధ్యక్షులు సయ్యద్ ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం

### - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



విశ్వంభర, భూపాలపల్లి: ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం గణపురం మండలం, చెల్పూర్ లో 1.56 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు వైద్య సేవలకు వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లకుండా నాణ్యమైన, మెరుగైన కార్పోరేట్ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చిన్నట్లు తెలిపారు. ప్రమాదాలకు గురైన వ్యక్తులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు ట్రా మా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి మూడో అంతస్థు నిర్మాణానికి 7 కోట్ల రూపాయలు మంజూరు అయినట్లు తెలిపారు. చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రయివేట్ భవనంలో ఉందని, ఈ ప్రాంత ప్రజల అభీష్టం మేరకు శాశ్వత భవనం నిర్మించినట్లు తెలిపారు. ఆసుపత్రికి ప్రహరీ, వైద్యులు స్థానికంగా నివాసం ఉండేందుకు నివాస గృహం నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దాదాపు 60 సంవత్సరాలు నుండి సేవలు అందిస్తున్నదని శాశ్వత భవనం నిర్మించుకోవడం చాలా సంతోషమని తెలిపారు. ఆసుపత్రి రహదారి కంటే ఎత్తు తక్కువ వుండటం వల్ల వర్షాకాలంలో నీళ్ళు నిలుస్తున్నాయని మేరువు చేయనున్నట్లు తెలిపారు. మరుగుదొడ్లు, తదితర మౌలిక సౌకర్యాలు కల్పనకు 1.50 కోట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రధాన ఆసుపత్రిలో సిటీ స్కానింగ్, ఎంఆర్ఐ సేవలు అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. 203 అదనపు వైద్య పోస్టింగ్ పోస్టులు జిల్లాకు మంజూరు చేపించినట్లు తెలిపారు. నర్సింగ్ భవనం, ఆయుర్వేద వైద్య సేవలకు వైద్యుల పోస్టు కూడా మంజూరు చేసి ఆయుర్వేద వైద్య సేవలను కూడా అందుబాటులోకి తీసుకురానుట్లు తెలిపారు. చదువుకున్న వ్యక్తి ఎక్కడైనా జీవించగలడని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్య సేవలు అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి భవనాలు నిర్మాణము పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రధాన ఆసుపత్రిలో డ్రగ్ స్టోర్ నిర్మించామని అన్నారు. వైద్య సేవలపై బాగా ఫోకస్ చేయాలని సూచించారు. ఆశాలు క్షేత్రస్థాయిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఇమ్యూనైజేషన్ కార్యక్రమాలను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఆశాల సేవలు చాలా ముఖ్యమైనవి అన్నారు. ఏఎన్సీ రిజిస్ట్రేషన్స్ సకాలంలో చేస్తూ గర్భిణీ లకు వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, ఆసుపత్రి వైద్యురాలు స్వాతి, సింగిల్ విండో ఛైర్మన్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

### సమాజాభివృద్ధికి నాలుగో స్తంభంలా క్రియాశీల పాత్ర పోషిస్తాం

### ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రమణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



ప్రెస్ క్లబ్ భద్రాద్రి నూతన కార్యవర్గం ఎంపిక

విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం: సమాజాభివృద్ధికి నాలుగో స్తంభంలా క్రియాశీలక పాత్ర పోషిస్తామని ప్రెస్ క్లబ్ ఆఫ్ భద్రాచలం నూతన అధ్యక్షులు బీ వీ రమణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమరౌతు శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రాఘవ నిలయం (రెడ్డి సత్రం) లో ప్రెస్ క్లబ్ అఫ్ భద్రాచలం సర్వసభ్య సమావేశం జరిగింది. క్లబ్ ఆధ్వర్యం లో ఇప్పటి వరకు జరిగిన కార్యకలాపాలు గురించి చర్చించారు. క్లబ్ అభివృద్ధికి, విలేకరుల సంక్షేమం గురించి పలు తీర్మానాలు ఆమోదించారు. అనంతరం 11 మంది తో నూతన కార్యవర్గం ను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తామని, అవినీతిని ఎండగట్టి సమాజ హితం కోసం పాటుపడతామని అన్నారు. ప్రెస్ క్లబ్ దిన దినాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ప్రెస్ క్లబ్ లోని సభ్యులకు అండగా అన్నివేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు. అనంతరం మాజీ కార్యవర్గ సభ్యులను శాలువాతో సత్కరించారు.

నూతనంగా ఎన్నికైన కార్యవర్గంలో అధ్యక్షులుగా బి.వి.రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా సోముల గిరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గా సోమరౌతు శ్రీనివాస రావు, సహాయ కార్యదర్శి గా దుద్దుకూరి జ్ఞానయ్య, కోశాధికారిగా వై. దుర్గా ప్రసాద్ రెడ్డి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులు గా యర్రంశెట్టి కృష్ణ, శ్రీ శ్రీ, కిరణ్, రంజిత్, దిలీప్ కుమార్, కాటా సత్యం ఎన్నికయ్యారు. క్లబ్ నిర్వహణ, అభివృద్ధికి గాను కోదూరి సత్యనారాయణ, జె.వి రత్నం, తోకల నాగేశ్వర రావు లను క్లబ్ గౌరవ సలహా దారులు గా నియమించుకోవడమైనది. ఈ సమావేశంలో ఈ సమావేశంలో ముబగాపు ఆనంద్ కుమార్, పిల్లి రాజు సత్యానంద్, దుర్గారెడ్డి, చైతన్య వెంకట్ జగన్ ప్రదీప్ ప్రదీప్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పెండింగ్ బకాయిలు చెల్లించకుంటే రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తాం :ఆర్. కృష్ణయ్య



విశ్వంభర, ఎల్బీనగర్: రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ల కోసం కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లిస్తున్నారని, చదువుకునే విద్యార్థులకు స్కాలర్షిప్ లు చెల్లించడం లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ పార్లమెంటు సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని విమర్శించారు. గురువారం ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ను వెంటనే విడుదల చేయాలని ఆర్కేపురం నుండి కొత్తపేట వరకు రాష్ట్ర బి.సి యువజన సంఘం అధ్యకులు జిల్లాపల్లి అంజి అధ్యక్షత విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ల కోసం కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లిస్తున్నారే కానీ చదువుకునే విద్యార్థులకు స్కాలర్షిప్ లు చెల్లించడం లేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. పెండింగ్లో ఉన్న బకాయిలు చెల్లించుకుంటే ప్లకార్డులు పట్టుకొని కమిషన్ ప్రభుత్వం మాకు వద్దు అంటూ ప్రజల్లోకి వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాలుగు రోజులలో పెండింగ్ బకాయిలు చెల్లిస్తానన్న బట్టి విక్రమార్క మాటలు ఏమయ్యాయి అని ప్రశ్నించారు. గత ప్రభుత్వానికి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా ఏమీ లేదని ఆర్. కృష్ణయ్య అన్నారు. విద్యార్థులకు పెండింగ్ బకాయిలు చెల్లించకుంటే రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తామని బీసీ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు నీల వెంకటేష్,సతీష్,రవీందర్, అనంతయ్య, రాందేవ్, మహేష్, బలరాం, రవి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## బైకును డీకొన్న కారు.. ఒకరి మృతి

విశ్వంభర, పటాన్ చేరు: అతివేగంతో కారు ఢీకొట్టి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి పోచారం గ్రామ శివారులో చోటుచేసుకుంది. పటాన్ చేరు పోలీసుల కథనం ప్రకారం సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు మండలం పోచారం గ్రామ శివారులో గల ఓ ఆర్ ఆర్ అండర్ బ్రిడ్జ్ వద్ద కిష్టారెడ్డి పెట్ నుండి పటాన్ చెరుకు వస్తున్న బెలినో కారు (టీఎస్ 15 ఎఫ్ఎం 5885) నెంబర్ గల కారు అతివేగంతో వచ్చి హొండా యాక్టివా పైన ఉన్న నరేష్ గౌడ్ నీ ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు స్వగ్రామం కోడెక్కల్ గ్రామం చెందిన నరేష్ గౌడ్ బొల్లారంలోని ప్రైవేటు కంపెనీలో విధులు నిర్వహించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి పోస్ట్ మార్టం నిమిత్తం పటాన్ చేరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు

## సంగారెడ్డి జిల్లాలో దారుణం నడిరోడ్డుపై తల్లీకుమారుడి హత్య

గుమ్మడిదల: సంగారెడ్డి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. తల్లీకుమారుడిని నడిరోడ్డుపై నాగరాజు అనే వ్యక్తి కత్తితో పొడిచి హతమార్చాడు. గుమ్మడిదల మండలం బొంతపల్లిలో ఈ ఘటన జరిగింది. మృతులను సరోజాదేవి (50), అనిల్ (30)గా గుర్తించారు. ఆరు నెలల క్రితం తన రెండున్నరేళ్ల కుమారుడి మృతికి కారణమని భావిస్తూ కక్ష పెంచుకుని ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సమాచారం. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

# ముగ్గురు సైబర్ నేరగాళ్ల అరెస్ట్

### - సైబర్ క్రైమ్, జిల్లా పోలీస్ ఆద్వర్యంలో స్పెషల్ ఆపరేషన్

### - ఫేక్ ట్రేడింగ్ యాప్ ల మోసాలకు అప్రమత్తంగా ఉండండి



విశ్వంభర, మెట్ పల్లి: రెండు నెలల క్రితం జిల్లాలోని మెట్ పల్లి కి చెందిన ఒక వైద్యుడిని స్టాక్ మార్కెట్ బిజినెస్ అండ్ ఇన్వెస్ట్మెంట్, ట్రేడింగ్ పేరు తో సైబర్ నిందితులు వైద్యుడు ఖాతా నుంచి 69 లక్షల రూపాయలు కాజేశారు. తాను మోసపోయిని విషయం తెలుసుకున్న వైద్యుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడం జరిగింది. సదరు వైద్యుడు ఇచ్చిన పిర్యాదు మేరకు జగిత్యాల జిల్లామెట్ పల్లి పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయనైనది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన పోలీసులు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శికాగోయల్ ఐపీఎస్, జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మెట్పల్లి డి.ఎస్.పి రాములు ఆధ్వర్యంలో డీ4సీ డి.ఎస్.పి వెంకటరంగారెడ్డి నేతృత్వంలోని 7 గురు స్పెషల్ టీమ్ మెట్ పల్లి సీఐ నిరంజన్ రెడ్డి, కోరుట్ల సీఐ సురేష్ మేడిపల్లి ఎస్సై శ్యామ్ రాజు డీ4సీ ఆర్ఎస్ఐ దినేష్ కుమార్, కానిస్టేబుల్ (పి.సి) లు గంగిపెల్లి మహేష్, గాజులరాజేందర్, పురుసోత్తం లు స్పెషల్ ఆపరేషన్ లో పోలీస్ బృందాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి లోతైన విచారణ మొదలు పెట్టి ఆధునిక టెక్నాలజీ ని ఉపయోగించుకొని స్టాక్ మార్కెట్ బిజినెస్ అండ్ ఇన్వెస్ట్మెంట్, ట్రేడింగ్ పేరు సైబర్ మోసానికి పాల్పడిన నిందితులకు చెందిన బ్యాంక్ ఖాతాలను గుర్తించడం జరిగింది. అట్టి నిందితుల బ్యాంకు ఖాతాలను నిలుపుదల (ఫ్రీజ్) చేసి, అందులో నుండి వైద్యుడి కి చెందినా పది లక్షల రూపాయలను గుర్తించి, మెట్ పల్లి కోర్టు నుండి ఉత్తర్వులు తీసుకొని, సంబంధిత నిందితుని బ్యాంకు ఖాతా నుండి వైద్యుడికి రీఫండ్ చేయించడం జరిగింది. మరో 24 లక్షలను నిందితుని ఖాతా లలో గుర్తించి వాటిని ఫ్రీజ్ చేసి, కోర్ట్ ఉత్తర్వుల మేరకు భాదితునికి రీఫండ్ చేయడానికి ప్రాసెస్ జరుగుతున్నది. అలాగే ఈ నిందితులు పంజాబ్ రాష్ట్రంలోని అమృతసర్, జలంధర్ లో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి పక్క ప్రణాళికతో అదుపులోకి తీసుకోవడం జరిగింది. విచారణలో భాగంగా మొదటి నిందితుడు (ఏ-1) సుమేష్ కపూర్(36) జలందర్, పంజాబ్ రాష్ట్రం, ఇతడు వివిధ బ్యాంకు లలో బ్రోకర్ గా పనిచేస్తూ అవసరం ఉన్న వారికీ లోన్ ఇప్పిస్తూ వారి వద్ద నుండి కొంత కమిషన్ గా డబ్బులు తీసుకొని జీవిస్తాడు, రెండవ నిందితుడు (ఏ-2) రాజీవ్ సింగ్ (36), మూడవ నిందితుడు (ఏ-3) జతిందర్ కుమార్ (37) వీరిద్దరూ ఇద్దరు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం కి చెందినవారు. వీరిద్దరూ పంజాబ్ రాష్ట్రం లోని చండీగర్ నందు ఆసియన్ న్యూట్రిసన్( కోళ్ళ ఫారం) కంపనీ నందు సేల్స్ మేనేజర్ గా పని చేసే వారు. ఈ ముగ్గురు వారు చేసే జాబు వాళ్ళకు వచ్చే ఆదాయం వారి అవసరాలకి, జల్సాలకి సరిపోక పోవడం తో ఏదైనా పద్దతిలో సులువుగా, తక్కువ టైం లో ఎక్కువ సంపాదించుకుందామని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని డి.ఎస్.పి ఏ రాములు మీడియా సమావేశంలో తెలిపారు.

## బంగారు మైసమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి విరాళం



విశ్వంభర, కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ లో ఇప్పల కట్ట వద్ద కొలువుదీరిన బంగారు మైసమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రూ. 50,000/-వేల రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భగవంతుడి కృప భక్తులందరూ చల్లగా ఉండాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అందువల్ల నా వంతు సహాయ అర్థంగా నేను సహాయాన్ని అందిస్తున్నానని అన్నారు. ఆ భగవంతుడి కృపతో మున్ముందు అనేక దైవ కార్యక్రమాలకు చేసుకుంటామని ఎమ్మెల్యే సంతోషం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేణుగోపాల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీరమోని దేవేందర్ ముదిరాజ్, ఎమ్మె సత్తయ్య,ఎల్లారం శేఖర్ రెడ్డి,జనార్దన్ చారి, ముదిరాజులు నరసింహ ముదిరాజ్,గిరి ముదిరాజ్,సురేష్ ముదిరాజ్,రమేష్ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిల్కానగర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి కార్పొరేటర్ బన్నాల



విశ్వంభర, సికింద్రబాద్ : చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ.. ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్కి వారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్లోని బీరప్ప గడ్డ, చిలికానగర్ న్యూరామ్ నగర్, కుమ్మరి కుంట, బొడ్రాయి ప్రాంతాల్లో స్ట్రాంగ్ వాటర్ డ్రైన్, సీసీ రోడ్లు బాగా దెబ్బతిన్నాయని మల్లికార్జున్ నగర్ నుంచి అవుట్లెట్ పోయే పైపులైను వెంటనే పునఃరుద్ధరించాలని, హైకోర్టు కాలనీ హెచ్ఎంటీ నగర్ చెరువుకు మల్లికార్జున్ నగర్ కాలనీకి మధ్యలో ఉన్న ప్రహరీ చైన్ లింక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



విశ్వంభర, ఉప్పల్ : డా.ఏఎస్‌రావునగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన 55 మంది లబ్ధిదారులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి 26 లక్షల 08 వేల 500 రూపాయల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ నీ అందరూ సద్వినియోగ పరుచుకోవాలన్నారు. సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం అని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, చిలుక నగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్, గంధం నాగేశ్వర్ రావు, మహేష్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబ సభ్యులకు ఆర్థిక చేయూత



విశ్వంభర, ఆత్మకూరు (ఎం): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండలం కొరటికల్ గ్రామం మధిర రేగుల కుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మధుగాని నరసమ్మ మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెసు పార్టీ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ ఎంపీపీ తండా మంగమ్మ శ్రీశైలం గౌడ్ సహకారంతో 5,000 రూపాయలు మృతురాలి కుటుంబ సభ్యులకు కాంగ్రెసు పార్టీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెసు పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మామిడి నర్సిరెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కట్టెకోల హనుమంతు గౌడ్, కందటి దశరథ రెడ్డి, కందటి అనంతరెడ్డి, చిరబోయిన స్వామి, చామకూర నారాయణ, శ్రీరాముల ఋషి, జోగు దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



విశ్వంభర, ఆత్మకూరు(ఎం): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో ఇటీవల నిరుపేద కుటుంబానికి చెందిన గంగారపు మారెమ్మ, రాళ్ళబండి అండమ్మలు మృతి చెందగా స్థానిక మాజీ ఎంపీటీసీ యాస కవితా ఇంద్రా రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కోరే వెంకన్నలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి కేహెచ్చ్ఆర్ ఫౌండేషన్ అధినేత రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి సహకారంతో బాధిత కుటుంబ సభ్యులకు 5000 రూపాయల చొప్పున ఇరు కుటుంబాలకు 10,000 రూపాయల నగదును అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సోలిపురం అరుణ ఉపేందర్ రెడ్డి, బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, నాతి రాజు, నాతి స్వామి, బోడిగే వెంకన్న, బూడిది స్వామి, గట్టు అశోక్, కొండపల్లి అబ్బసాయిలు, కందడి శ్రీనివాస్ రెడ్డి, కొమ్మరాజుల నాగరాజు, లోడి ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

# ఇతరులను ఇబ్బంది పెట్టేలా పోస్టులు పెడితే అరెస్టు చేయరా?


### ఏపీ హైకోర్టు




**విశ్వంభర, అమరావతి:** సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో తన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేపట్టాలన్న నిందితుడు సత్య నీరజ్ కుమార్ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. ఇతరులను ఇబ్బంది పెట్టేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే అరెస్టు చేయరా? అని ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. నిందితుడి పిటిషన్‌పై సాధారణ పద్ధతిలోనే విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. తదుపరి విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన కుటుంబ సభ్యుల ప్రతిష్టకు భంగం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర, అనుచిత పోస్టులు పెట్టాడనే కారణంతో తిరుపతి తూర్పు పోలీసులు నీరజ్ కుమార్‌పై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

# శాసనసభ సాక్షిగా నా తల్లికి అవమానం

### వైసీపీ సభ్యులపై మంత్రి లోకేశ్ ఆగ్రహం



**విశ్వంభర, అమరావతి:** గతంలో శాసనసభ సాక్షిగా తన తల్లిని వైకాపా సభ్యులు అవమానించారని మంత్రి లోకేశ్ అన్నారు. బడ్జెట్ సమావేశాల మూడో రోజు ఆయన శాసనమండలిలో మాట్లాడారు. సీఎం చంద్రబాబును ఉద్దేశించి వైకాపా సభ్యులు చేసిన వ్యాఖ్యలపై లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా చంద్రబాబు సభకు వచ్చారు. సింహంలా సింగిల్‌గా నిలబడ్డారు. శాసనసభ సాక్షిగా నా తల్లిని అవమానించిన తర్వాతే.. ఆవేదనతో ఆయన ప్రతిజ్ఞ చేసి వెళ్లిపోయారు. టీడీపీ నేతలపై మళ్లీ ఇవాళ అసభ్యకర పోస్టులు చేస్తున్నారు. మాట్లాడాలనుకుంటే మేమూ మాట్లాడగలం. ఏనాడూ జగన్ కుటుంబం గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఆ రోజు నా తల్లిని అవమానించింది మీకు గుర్తుకు రాలేదా? అప్పుడు అన్ని మాట్లాడిన జగన్ ఇప్పుడు సభకు ఎందుకు రావడం లేదు. నా తల్లిని అవమానించిన వారికి ఎన్నికల్లో టికెట్లు ఎలా ఇచ్చారు అని ఆవేదన వ్యక్తం చేశారు.

# జగన్‌ను జీవితాంతం జైలులో ఉంచినా తప్పులేదు

### బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



**విశ్వంభర, అమరావతి:** రుషికొండ ప్యాలెస్‌లో విలాస వస్తువులు చూస్తే.. ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందేనని బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు అన్నారు. ప్రజాధనం దుర్వినియోగం తీరు చూస్తే ఏమనాలో అర్థం కావడం లేదన్నారు. గురువారం అసెంబ్లీలో రుషికొండ ప్యాలెస్‌పై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ''తలుపుల కోసం రూ.31 లక్షలు, బాత్‌రూమ్‌లో కమోడ్ కోసం రూ.11 లక్షలు వినియోగించారు. రుషికొండ ప్యాలెస్‌లో వాడినంత ఖరీదైన ఫర్నిచర్ నేనెక్కడా చూడలేదు'' అని విష్ణుకుమార్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. రుషికొండపై అధికార దుర్వినియోగానికి జగన్‌ను జీవితాంతం జైలులో ఉంచినా తప్పులేదని వ్యాఖ్యానించారు. పర్యాటక భవనాల ముసుగులో నిర్మాణాలు అతిపెద్ద ఆర్థిక కుంభకోణమన్నారు. టీడీపీ ఎమ్మెల్యే రఘురామ మాట్లాడుతూ రుషికొండ నిర్మాణాలను జగన్ కట్టుకున్న రాజకీయ సమాధిగా పరిగణించాలన్నారు. ఆ నిర్మాణాలను కూల్చివేయకుండా నియంత కట్టుకున్న విలాస భవనాలు ఇవి అని ప్రజలకు తెలిసేలా వారిని సందర్శనకు అనుమతించాలని ప్రభుత్వానికి సూచించారు.

# వర్రా రవీందర్‌రెడ్డిపై మరో ఎస్సీ, ఎస్టీ కేసు

**విశ్వంభర, నందలూరు:** పులివెందులకు చెందిన వైకాపా సామాజిక మాధ్యమ కార్యకర్త, 'సోషల్ మీడియా సైకో'గా పేరొందిన వర్రా రవీందర్‌రెడ్డిపై మరో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. అతడి పాటు వైకాపా సోషల్ మీడియా కన్వీనర్ సజ్జల భార్గవరెడ్డి, అర్జున్‌రెడ్డిపైనా ఎస్సీ, ఎస్టీ, ఐటీ, బీఎన్ఎస్ చట్టాల కింద కేసులు నమోదు చేశారు. పవన్‌పై అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీందర్‌రెడ్డిని ప్రశ్నిస్తే.. కులం పేరుతో దూషించినట్లు సిద్ధవటం మండలానికి చెందిన దళితుడు వెంకటాద్రి నందలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అంతకుముందు అదే జిల్లాలోని మరో పీఎస్‌లోనూ వర్రాపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది.



**బాపట్ల జిల్లా బాపట్ల మండలం సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నందు గల శ్రీ కేంద్రీయ విద్యాలయంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండా వందనం చేసి ప్రార్థన అనంతరం వివిధ సంస్కృతి కార్యక్రమాలు దేశభక్తిని చాటే వివిధ దేశభక్తుల వేషధారణ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.**

**- విశ్వంభర, బాపట్ల**

# ఐదేళ్లు నేరస్తులు అధికారంలో ఉన్నారు

- రాజకీయాలను నేరమయం చేశారు
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**విశ్వంభర, అమరావతి :** ఏపీలో ఐదేళ్ల పాటు పాలన కొనసాగించిన వైసీపీపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దురదృష్టవశాత్తు 2019లో నేరస్తులు అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో రఘురామకృష్ణరాజు డిప్యూటీ స్పీకర్‌గా ఏకగ్రీవ ఎన్నిక సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రాజకీయాలను నేరమయం చేసిందని విమర్శించారు. నేరస్థులు అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో మొన్నటి వరకు చూశామని పేర్కొన్నారు. క్రిమినల్స్ మైండ్‌సెట్‌తో ఉన్న వ్యక్తులు అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి, రాజ్యాంగ విధానాలకు, వ్యవస్థలకు గౌరవం ఇవ్వరని విమర్శించారు. సుప్రీం కోర్టు జడ్జిలను వదలలేదు, పార్టీ కార్యకర్తలను వదలలేదని వివరించారు. సొంతపార్టీ ఎంపీని కూడా దారుణంగా హింసించిన చరిత్ర గత పాలకులదని అన్నారు. వైసీపీ పాలకులు రఘురామరాజును మానసికంగా, శారీరకంగా హింసించారని ఆరోపించారు. సొంత ఎంపీపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమైన విషయమని అన్నారు. వైసీపీ అరాచకపాలనపై వ్యతిరేకంగా ఉన్న ఓట్లు చీలనివ్వకూడదని నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు.

# తండ్రి మృతదేహంతో విద్యార్థులకు పాఠం

### శరీర దానంపై ఈ 'వరల్డ్ రికార్డ్' నిత్య స్ఫూర్తి!

**బెళగావి:** ప్రముఖులను చాలా మంది ఆదర్శంగా తీసుకుంటారు. వాళ్లు చెప్పిన, చేసిన మంచి పనులను ఆచరించేందుకు ప్రయత్నిస్తుంటారు. అలాగే, పదొన్నలు గేళ్ల క్రితం కర్ణాటకలోని బెళగావికి చెందిన ఓ వైద్యుడు చేసిన పనికి ఇప్పటికీ వేల మందిలో స్ఫూర్తి నింపుతోంది. ఆయన ద్వారా ప్రేరణ పొందిన వేలాది మంది అవయవదానం, శరీరాన్ని దానం ఇవ్వడానికి ముందుకొస్తున్నారు. అసలు ఎవరీ డాక్టర్? ఆయన చేసిన పని ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**ప్రపంచ రికార్డు**

2010లో మహంతేశ్ రామన్నవర తన తండ్రి శరీరాన్ని డైసెక్ట్(శరీరాన్ని కోయడం సాధారణంగా మెడికల్ కాలేజీల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి మృతదేహాలను కోసి, శరీర భాగాల గురించి వివరిస్తారు) చేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. ఆ డెడ్‌బాడీతో విద్యార్థులకు పాఠం చెప్పారు. దీంతో తండ్రి శరీరాన్ని ఇలాంటి పనికి ఉపయోగించిన మొట్టమొదటి వైద్యుడిగా రామన్నవర ప్రపంచ రికార్డుకెక్కారు. ఈ క్రమంలో రామన్నవరను స్ఫూర్తిగా తీసుకుని స్వామీజీలతో సహా వేలాది మంది తమ శరీరాలను దానం ఇవ్వడానికి ముందుకొస్తున్నారు.

**విలియం హార్వే స్ఫూర్తితో!**

17వ శతాబ్దం చివర్లో ఇంగ్లాండ్‌కు చెందిన సర్ విలియం హార్వే మానవ రక్త ప్రసరణ వ్యవస్థ గురించి తెలుసుకోవాలని ప్రయోగాలు చేశారు. ఈ క్రమంలో చనిపోయిన తన సోదరి మృతదేహాన్ని ల్యాబ్‌లో డైసెక్ట్ చేసి పరీక్షించారు. అప్పుడు శరీరంలో రక్తప్రసరణ జరిగే పద్ధతిని కనుక్కొన్నారు. నేటి వైద్యులకు ఆయన మార్గదర్శకులయ్యారు. అయితే 300 ఏళ్ల తర్వాత డాక్టర్ మహంతేశ్ రామన్నవర మరణించిన తన తండ్రి మృతదేహాన్ని విద్యార్థులకు పాఠం చెప్పేందుకు ఉపయోగించి వైద్య ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు.

**అసలేం జరిగిందంటే?**

బైలహొంగళకు చెందిన ప్రముఖ వైద్యుడు బసవన్నెప్ప సంగప్ప రామన్నవర. ఆయన 2008 నవంబరు 13న తుదిశ్వాస విడిచారు. బసవన్నెప్ప తన మృతదేహాన్ని హుబ్లీలోని కిమ్స్ ఆస్పత్రికి దానం చేస్తానని బతికుండగానే తెలిపారు. అయితే ఆ తర్వాత తన కుమారుడు మహంతేశ్ పనిచేస్తున్న కేఎల్ఈ బీఎం కంకణవాడి ఆయుర్వేద మహా విద్యాలయానికి దానం చేస్తానని ఓ లేఖలో పేర్కొన్నారు. దీంతో తన తండ్రి మృతదేహాన్ని డాక్టర్ మహంతేశ్ రామన్నవర స్వయంగా యూనివర్సిటీకి అప్పగించారు.

"నా తండ్రి తాను చనిపోయాక తన డెడ్ బాడీని దానం చేయాలని నిర్ణయించుకున్నారు. తన మృతదేహాన్ని వైద్య విద్యార్థులు పరీక్షల కోసం ఉపయోగించాలని మరణ ధ్రువీకరణ పత్రంలో పేర్కొన్నారు. 2008 నుంచి మా నాన్న మృతదేహాన్ని రెండేళ్లపాటు బీఎం కంకణవాడి ఆయుర్వేద మహావిద్యాలయంలో ఉంచాం. 2010 నవంబర్ 13న మృతదేహాన్ని విద్యార్థుల ఎదుట డైసెక్ట్ చేశాం. ఈ నిర్ణయం వైద్య విద్యార్థులకు, శరీరాలను దానం ఇచ్చే వారికి ప్రేరణగా నిలిచింది" అని డాక్టర్ మహంతేశ్ రామన్నవర "ఈటీవీ భారత్"కు తెలిపారు.



**దానానికి ముందుకొచ్చిన వేలాది మంది!**

అయితే తన తండ్రి మృతదేహాన్ని వైద్య విద్యార్థులకు పాఠం చెప్పడం కోసం ఉపయోగించిన తర్వాత డాక్టర్ మహంతేశ్ ఊరుకోలేదు. ఇలా శరీరాన్ని దానం చేయడానికి ఉన్న ప్రాధాన్యంపై నగరమంతా తిరిగి అవగాహన కల్పించారు. ఆయన స్ఫూర్తితో వేలాది మంది మరణానంతరం తమ శరీరాన్ని దానం చేస్తామని ప్రకటించారు. ముఖ్యంగా ఇలా డొనేట్ చేయడానికి స్వామీజీలు ముందుకొచ్చారు. అలాగే తమ భక్తులకు కూడా దేహదానంపై అవగాహన కల్పిస్తున్నారు.

**స్ఫూర్తి పొందిన స్వామీజీలు**

2017లో కరంజి మఠానికి చెందిన గురుసిద్ధ స్వామీజీ, అక్కడ ఉన్న మరో 200మంది భక్తులు దేహదానానికి ముందుకొచ్చారు. అలాగే మునవల్లి సోమశేఖర మఠానికి చెందిన మురుఘేంద్ర స్వామీజీ 2010లో నేత్రదానం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన స్ఫూర్తితో 375 మందికి పైగా మరణానంతరం నేత్రదానం, దేహదానం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. వీరిలో ఇప్పటివరకు మృతి చెందిన 8మంది మృతదేహాలను రామన్నవర చారిటబుల్ ట్రస్టుకు అందజేశారు. నాగనూరులోని గురుబసవ పీఠానికి చెందిన బసవప్రకాశ్ స్వామీజీ నేత్రదానం, దేహదానం చేస్తామని ప్రమాణం చేశారు.

**మృతదేహాల కొరత**

దేశంలో మెడికల్, హోమియోపతి, ఆయుర్వేద, యునానీ, సిద్ధ, డెంటల్ కళాశాలలతో పాటు వైద్య విద్యనభ్యసించేవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. కాలేజీల్లో పరీక్షల కోసం మృతదేహాలు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. డాక్టర్ మహంతేశ్ తీసుకున్న నిర్ణయంతో మెడికల్ కాలేజీలకు డెడ్ బాడీలను ఇచ్చేందుకు చాలా మంది ముందుకొస్తున్నారు. శరీరం దానం చేయడాన్ని పురస్కరించుకుని ఏడాదిలో ఒక రోజును ప్రపంచ శరీర దాన దినంగా ప్రకటించాలని కేఎల్ఈ శ్రీ బీఎం కంకణవాడి ఆయుర్వేద మహావిద్యాలయ అధినేత డా.మహంతేశ్ రామన్నవర కోరారు. ఇదే విషయంపై గతంలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న గులాంనబీ ఆజాద్‌ను కలిసి వినతిపత్రం కూడా సమర్పించారు.

# త్వరలో భారత్-చైనా రక్షణ మంత్రుల భేటీ

- సరిహద్దు సమస్యలే అజెండాగా చర్చలు
- వచ్చే వారం సమావేశం జరిగే అవకాశం



**దిల్లీ:** భారత్‌చైనా రక్షణ మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, డోంగ్ జున్ త్వరలో భేటీ కానున్నట్లు తెలుస్తోంది. సరిహద్దు, ప్రాంతీయ స్థిరత్వమే అజెండాగా వారి మధ్య చర్చలు జరగనున్నట్లు సమాచారం. ఆసియాన్ రక్షణమంత్రుల సమావేశాలకు అనుబంధంగా వచ్చేవారం వీరి భేటీ జరిగే అవకాశం ఉందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి నాలుగేళ్లుగా కొనసాగిన ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ ఇరుదేశాలు కీలక గస్తీ ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీనిప్రకారం.. 2020 నాటి యథాస్థితి ఎల్ఏసీ వెంబడి ఇక కొనసాగుతుందని, ఇరుదేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చని రెండు దేశాలు ఒప్పందంలో పేర్కొన్నాయి. దానిలోభాగంగా కీలక ప్రాంతాల నుంచి ఇరుదేశాల సైనికులు తమ మౌలిక సదుపాయాలను, ఇతర సామగ్రిని వెనక్కి తీసుకున్నట్లు ఆర్మీ వర్గాలు ఇటీవల వెల్లడించాయి.

2020 జూన్ 15న తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్‌చైనా సైనికుల మధ్య జరిగిన తీవ్ర ఘర్షణ ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఈ ఘర్షణలో తెలంగాణకు చెందిన కల్నల్ సంతోష్‌బాబు సహా 20 మంది భారత సైనికులు వీరమరణం పొందారు. చైనా కూడా భారీగా సైనికులను కోల్పోయింది. కానీ ఆ సంఖ్యను వెల్లడించలేదు. చాలా నెలల తర్వాత ఐదుగురు చనిపోయినట్లు అధికారికంగా అంగీకరించింది. ఈ ఘర్షణల నేపథ్యంలో ఇరు దేశాలు ఎల్ఏసీ వెంబడి భారీస్థాయిలో బలగాలను మోహరించాయి. ఆ ఉద్రిక్తతలకు గస్తీ ఒప్పందంతో ఓ ముగింపు పలికారు. ఈ పరిణామాల మధ్య రాజ్‌నాథ్ సింగ్, డోంగ్ జున్ భేటీ కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.


# సినీనటి శ్రీరెడ్డిపై మరో కేసు నమోదు

### పవన్ కల్యాణ్, హోం మంత్రిపై అసభ్యకర పోస్టులు

**విశ్వంభర, అమరావతి:** సినీనటి శ్రీరెడ్డిపై కృష్ణా జిల్లా గుడివాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డీప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనితలపై అసభ్యకర రీతిలో పోస్టులు పెట్టారంటూ మచిలీపట్నం టీడీపీ మసోషల్ మీడియా కన్వీనర్ నిర్మల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గుడివాడ పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు శ్రీరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి.. అనకాపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, అనితలపై ఆమె ప్రవర్తించిన తీరు జుగుప్సాకరంగా ఉందంటూ.. సీఐకి ఫిర్యాదు పత్రం అందజేశారు. ఇప్పటికే శ్రీరెడ్డిపై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గ్రామీణంలో కేసు నమోదైన సంగతి తెలిసిందే.

**పోసానిపై కేసులు నమోదు**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుపై సినీనటుడు పోసాని కృష్ణమురళి అసభ్యకర పోస్టులు పెట్టినట్లు గురువారం టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సత్తెనపల్లి, వినుకొండ, నరసరావుపేట పోలీస్ స్టేషన్లలో ఆయనపై కేసులు నమోదయ్యాయి.



# వాట్సాప్‌ను నిషేధించాలన్న పిల్ కొట్టివేత

### గతంలోనే తోసిపుచ్చిన కేరళ హైకోర్టు
### ఇప్పుడు సుప్రీం కోర్టులోనూ చుక్కెదురు

**దిల్లీ:** ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని ఆరోపిస్తూ దానిపై నిషేధం విధించేలా కేంద్రానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సుప్రీం కోర్టు లో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిని పరిశీలించిన సుప్రీం ధర్మాసనం ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది. వాట్సప్‌పై నిషేధం విధించాలని కోరుతూ కేరళకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అక్కడి హైకోర్టును ఆశ్రయించాడు. ఐటీ నిబంధనలు 2021 పాటించడం లేదని ఆరోపించాడు. యూజర్ వైపు మార్పులు చేసే ఆస్కారం ఉందని, సందేశం మూలాలు కనుక్కోవడం కూడా సాధ్యంకాదని పేర్కొన్నాడు. వ్యక్తిగత గోప్యతకు సంబంధించి యూరప్‌లో ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తోన్న వాట్సప్, భారత్‌లో మాత్రం ఇక్కడి చట్టాలను పాటించేందుకు నిరాకరిస్తోందని చెప్పాడు. అయితే, ఇది తొందరపాటు చర్యగా పేర్కొన్న కేరళ హైకోర్టు.. ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఇదే విషయంపై సుప్రీం కోర్టును ఆశ్రయించిన పిటిషనర్.. పౌరుల ప్రాథమిక హక్కులను వాట్సప్ ఉల్లంఘిస్తోందని, జాతీయ ప్రయోజనాలకు ముప్పుగా మారిందని ఆరోపించాడు. సాంకేతికతను మార్చుకోకుండా, ప్రభుత్వానికి సహకరించకుంటే దేశంలో దీని కార్యకలాపాలను నిషేధించాలని సూచించాడు. ఇటువంటి అనేక వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లను కేంద్రం నిషేధించిన విషయాన్ని గుర్తుచేశారు. దీనిని పరిశీలించిన జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం.. ఆ పిల్‌ను కొట్టివేసింది.

# క్రీడాభివృద్ధికి ప్రైవేట్ విద్యాసంస్థల తోడ్పాటు అవసరం

*** స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి**
*** సీబీఐటీలో జాతీయ స్థాయి పోటీలు ప్రారంభం**



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని ఇంజనీరింగ్ కళాశాలలు క్రీడా ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తే రాష్ట్రంలో క్రీడాభివృద్ధి శరవేగంగా ముందుకు వెళుతుందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేన రెడ్డి అన్నారు.గురువారం చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) నిర్వహించిన నేషనల్ లెవల్ ఇంటర్ ఇంజనీరింగ్ కాలేజ్ స్పోర్ట్స్ ఫెస్టివల్ ను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడాభివృద్ధి కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదని ప్రైవేటు సంస్థలు,ప్రైవేట్ విద్యాసంస్థలు రాష్ట్రప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా క్రీడా కార్యక్రమాలకు దోహదం చేయాలన్నారు. అప్పుడే శరవేగంగా క్రీడాభివృద్ధి సాధ్యమవుతుందని అయినా అన్నారు ప్రతిష్టాత్మకమైన సీబీఐటీ లాంటి సంస్థలు నిర్వహిస్తున్న క్రీడా కార్యక్రమాలు ఇతర కళాశాలలకు ఆదర్శంగా నిలుస్తాయని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో నార్సింగి ఏసీపి రమణ గౌడ్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీవీ నరసింహులు లెక్చరర్లు, కళాశాల, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజలకు సేవ చేసే ఉద్యోగులపై

# దాడులకు పాల్పడటం దుర్మార్గం




**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజలకు వివిధ రూపాలలో సేవలు అందించే ఉద్యోగులపై తమ రాజకీయ లక్ష్యాలకోసం భౌతిక దాడులకు దిగటం దుర్మార్గమైన చర్య అని తెలంగాణ గెజిటెడ్, ఉద్యోగుల, ఉపాధ్యాయుల, నాలుగవ తరగతి ఉద్యోగుల, కార్మికుల, పెన్షనర్ ల జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస రావు అభిప్రాయ పడ్డారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఇతర రెవిన్యూ ఉద్యోగులపై దాడికి నిరసనగా జేఏసీ, ట్రెసా ఇచ్చిన పిలుపు మేరకు లంచ్ అవర్ డెమన్స్ట్రేషన్ లో భాగంగా గురువారం నాడు భూపరిపాలన కమీషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అయన పాల్గొని మాట్లాడారు. అత్యంత వెనుకబడిన జిల్లాలో ఒకటైన వికారాబాద్ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం మేరకు జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ప్రజాభిప్రాయ సేకరణకు వెళితే భౌతిక దాడులకు దిగటం ప్రజలకు, యువతకు అభివృద్ధి కి దూరం చేసే ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ట్రెస అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి ఎ. సత్యనారాయణ, డిప్యూటీ కలెక్టర్స్, అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్, టీ ఎన్జీఓ అసోసియేట్ ప్రెసిడెంట్, కస్తూరి వెంకటేశ్వర్లు, బి. శ్యామ్, గౌతం కుమార్, మధుసూదన్‌రెడ్డి, గోల్కొండ సతీష్, సత్యనారాయణ గౌడు పాల్గొన్నారు.

# అంధుల పాఠశాలలో బాలల దినోత్సవం

**విశ్వంభర, మలక్ పేట్:** దారుల్ షిఫా అందుల ప్రాథమిక పాఠశాలలో చాచా నెహ్రూ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సాఫ్ట్ వేర్ ఉద్యోగి సత్యా గౌడ్ హాండ్ మైక్ సెట్ డొనేట్ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాన ఉపాధ్యాయులైన మందడి వెంకట్ రెడ్డి అధ్యక్షత వహించగా ఉపాధ్యాయులు జావిద్, రవీందర్ రెడ్డి, అంజాద్ జానయ్య, హాస్టల్ వార్డెన్ చిరంజీవి, విద్యార్థులు, వారి యొక్క తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆరో రోజూ నష్టాలతోనే ముగిసిన స్టాక్ మార్కెట్లు

### 110 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, విదేశీ మదుపర్ల అమ్మకాల నేపథ్యంలో వరుసగా ఆరో సెషన్‌లోనూ సూచీలు నష్టాలను మూటగట్టుకున్నాయి. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ కంపెనీలైన హెచ్‌యూఎల్, ఐటీసీ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కోవడం సూచీలపై ప్రభావం చూపింది. రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు రాణించాయి.

సెన్సెక్స్ ఉదయం 77,636.94 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,690.95) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. తర్వాత కాసేపు లాభాల్లోకి వెళ్లినప్పటికీ.. ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ఆపై రోజంతా నష్టాల్లోనే సూచీ కదలాడింది. ఇంట్రాడేలో 77,424.81 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 110.64 పాయిట్ల నష్టంతో 77,580.31 వద్ద ముగిసింది. నిఫ్టీ 26.35 పాయింట్ల నష్టంతో 23,532.70 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరింత క్షీణించి 84.41కి చేరింది.సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ, నెస్లే ఇండియా, ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టపోగా.. రిలయన్స్, కోటక్ బ్యాంక్, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు లాభాల్లో మగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.23 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2546 డాలర్ల వద్ద కొనసాగుతోంది.రేపు సెలవు: గురు నానక్ జయంతి సందర్భంగా శుక్రవారం మార్కెట్లు తెరుచుకోవు. ఈ వారం స్టాక్ ఎక్స్ఛేంజీలు నాలుగు రోజులే పనిచేశాయి. మళ్లీ సోమవారమే కార్యకలాపాలు జరగనున్నాయి.

## బోయింగ్‌లో భారీగా ఉద్యోగ తొలగింపులు..

### 17 వేల మందిపై ప్రభావం

**వాషింగ్టన్ :** అమెరికాకు చెందిన ప్రముఖ విమాన తయారీ సంస్థ బోయింగ్ పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. ఏకంగా 17 వేల మంది సిబ్బందిపై వేటు వేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా తన సంస్థలో పనిచేస్తున్న సిబ్బందిలో దాదాపు 10 శాతం మందిని తొలగించేందుకు గానూ పింక్ స్లిప్పులు జారీ చేయడం ప్రారంభించిది. తీవ్రమైన ఆర్థిక ఒత్తిడులు, ఉత్పత్తి ఆలస్యం వేళ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అమెరికాలో పనిచేస్తున్న ఉద్యోగులు స్థానిక నిబంధనలకు అనుసరించి 60 రోజుల నోటీసు పీరియడ్ భాగంగా జనవరి వరకు ఉద్యోగ బాధ్యతల్లో కొనసాగుతారు. సియాటెల్ ప్రాంతంలో 33 వేల మంది కార్మికులు కొన్ని వారాల పాటు సమ్మె చేశారు. దీంతో 737 మాక్స్, 767, 777 జెట్‌ల ఉత్పత్తి నిలిచిపోయింది. సమ్మె కారణంగా మూడో త్రైమాసికంలో 5 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లిందని సంస్థ తెలిపింది. ఈ నష్టాలను పూడ్చుకొనేందుకు ఉద్యోగుల తొలగింపును మార్గంగా ఎంచుకుంది. రాబోయే రోజుల్లో మొత్తం ఉద్యోగుల్లో 10 శాతం మందిని తొలగిస్తామని కంపెనీ ఇది వరకే పేర్కొంది. ఇందులో భాగంగానే తాజా నిర్ణయం ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల రీత్యా ఇకపై పూర్తి ప్రాధాన్య అంశాలపై మాత్రమే దృష్టి సారించాని నిర్ణయించినట్లు కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కష్ట కాలంలో తమ ఉద్యోగులకు అండగా ఉంటామని హామీ ఇచ్చింది.బోయింగ్ విమాన సంస్థలకు 737 మ్యాక్స్ విమానాలు మచ్చ తెచ్చిపెట్టాయి. గతంలో ఇండోనేషియా, ఇథియోపియాల్లో రెండు బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలు కూలి 346 మంది ప్రయాణికులు మృత్యువాత పడ్డారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా 20 నెలల పాటు ఈ రకం విమానాలను పక్కనపెట్టారు. ఈ ఏడాది జనవరి 5న అలస్కా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం 16 వేల అడుగుల ఎత్తులో ఉండగా డోర్ ఊడింది. ఈ ఘటనతో కంపెనీపై నియంత్రణ సంస్థల నిఘా మరింత ఎక్కువైంది. నాణ్యత, భద్రత విషయంలో తనిఖీలు తీవ్రతరం అవడంతో ఉత్పత్తి సైతం నిలిచిపోయింది. దీంతో డెలివరీలు ఆగిపోయాయి. ఈ క్రమంలోనే నాటి సీఈఓ డేవ్ కాల్హౌన్ పదవి నుంచి వైదొలిగారు. గత నెలలో కార్మికులు వారాల పాటు సమ్మెకు దిగడం పరిస్థితి మరింత దిగజారింది. దీంతో కంపెనీ లేఆఫ్‌లు ప్రకటించింది. మరోవైపు కొత్తగా సీఈఓగా బాధ్యతలు చేపట్టిన కెల్లీ ఆర్ట్‌బెర్గ్ ఎక్కువగా అమ్ముడయ్యే 737 మ్యాక్స్ విమానాల ఉత్పత్తిపై దృష్టి పెట్టారు.

## అక్టోబర్‌లో తగ్గిన భారత వాణిజ్య లోటు

**ముంబయి :** గురువారం ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం భారత వాణిజ్య లోటు గత ఏడాది అక్టోబర్‌లో $33.43 బిలియన్ల(రూ.2.80 లక్షల కోట్ల) నుంచి 2024 అక్టోబర్‌లో $27.14 బిలియన్ల(రూ.2.28 లక్షల కోట్ల)కు తగ్గింది. అయితే, గత నెల $20.8 బిలియన్ల కంటే ఇది ఎక్కువే. అక్టోబర్‌లో దేశీయ సరుకుల ఎగుమతులు $39.2 బిలియన్లు(రూ.3.29 లక్షల కోట్లు)గా ఉండగా దిగుమతులు $66.34 బిలియన్లు(రూ.5.57 లక్షల కోట్లు)గా ఉన్నాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. అక్టోబర్‌లో సేవల రంగానికి సంబంధించిన ఎగుమతులు $34.02 బిలియన్లు(రూ.2.85 లక్షల కోట్లు)గా అంచనా వేయగా, దిగుమతులు 17 బిలియన్లు (రూ.1.42 లక్షల కోట్లు)గా ఉన్నాయి.

## రిలయన్స్- డిస్నీ మీడియా వ్యాపారాల విలీనం పూర్తి

**ముంబయి:** మీడియా రంగంలో అతిపెద్ద విలీనం జరిగింది. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్, అంతర్జాతీయ మీడియా దిగ్గజం వాల్ట్ డిస్నీకి చెందిన మీడియా వ్యాపారాల విలీనం ఎలాంటి అడ్డంకులు లేకుండా పూర్తయ్యింది. తద్వారా రూ.70,353 కోట్ల విలువతో దేశంలోనే అతిపెద్ద మీడియా సామ్రాజ్యంగా ఏర్పడింది. ఈ సంస్థకు ముకేశ్ నీతా అంబానీ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. ఉదయ్ శంకర్ వైస్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. విలీన సంస్థ వృద్ధికి గానూ రూ.11,500 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు రిలయన్స్ ప్రకటించింది.కొన్ని నెలల క్రితమే ప్రకటించిన ఈ విలీనానికి సీసీఐ, ఎన్‌సీఎల్‌టీ వంటి నియంత్రణ సంస్థల నుంచి అనుమతిచ్చాయి. విలీన కంపెనీలో రిలయన్స్ ఇండస్ట్రీస్, అనుబంధ సంస్థలకు 63.16% వాటా ఉంటుంది. మిగతా 36.84% వాటా వాల్ట్ డిస్నీకి ఉంటుంది. ఈ రెండు సంస్థలు విలీనం కావడంతో 100కు పైగా టీవీ ఛానళ్లు ఒకే గొడుగు కిందకు రానున్నాయి. ఇన్నాళ్లు 'స్టార్', 'కలర్స్' పేరిట అలరించిన ఛానెళ్లు ఇకపై ఒక్కటి కానున్నాయి. జియో సినిమా, డిస్నీ+ హాట్‌స్టార్ పేరిట ఉన్న ఓటీటీ ప్లాట్‌ఫారంలను సైతం విలీనం చేసి జియో స్టార్‌గా వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది.

# అవన్నీ రూమర్లే.. మేం ఎలాంటి రిక్వెస్ట్ చేయలేదు

**బీసీసీఐ వర్గాలు**



**విశ్వంభర, క్రీడావిభాగం :** ఆస్ట్రేలియా పర్యటనకు టీమ్‌ఇండియా వెళ్లిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రాక్టీస్ సెషన్‌ను ప్రారంభించింది. తొలుత వద్దని భావించిన ఇంట్రాస్క్వాడ్ జట్టుతో వార్మప్ మ్యాచ్‌ను ఆడేందుకు భారత్ సిద్ధమవుతోంది. శుక్రవారం నుంచి ఈ మ్యాచ్ జరగనుంది. అయితే, ప్రేక్షకులు ఎవరూ లేకుండా ఉండేలా చూడాలని బీసీసీఐ కోరినట్లు ఆస్ట్రేలియా మీడియాలో వార్తలు వచ్చాయి. తాజాగా అవన్నీ రూమర్లేనని.. తాము ఎలాంటి విజ్ఞప్తులు చేయలేదని బీసీసీఐ వర్గాలు స్పష్టంచేశాయి.

''భారత్ నుంచి లేదా ఇండియా ఏనుంచి ఎలాంటి రిక్వెస్ట్ వెళ్లలేదు. డోర్లన్నీ మూసేసి నెట్ సెషన్లను నిర్వహించాలని డిమాండ్ చేయలేదు. ప్రాక్టీస్ సెషన్ అందరూ చూడొచ్చు. భారత్, ఆస్ట్రేలియాకు చెందిన మీడియా చూస్తూనే ఉన్నారు. కానీ, వారికి కావాల్సినంత మాత్రమే కవర్ చేస్తున్నారు. ఇప్పటివరకు ఎలాంటి ఆంక్షలు లేవు. ఇండియా Aతో వార్మప్ మ్యాచ్ అధికారికంగా ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ కాదు. ఏ బ్యాటరైనా ఏ స్థానంలోనైనా బరిలోకి దిగొచ్చు. ఒక జట్టంతా బౌలర్లతో ఉంటే.. మరొకటి బ్యాటర్లతో కూడి ఉంటుంది. గతంలోనూ మేం ఇలాంటి వార్మప్ మ్యాచ్‌లు ఆడాం. ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లినప్పుడూ అక్కడి పిచ్‌లకు అలవాటుపడేందుకు ఇలా చేశాం. పెర్త్‌లో ఎలాంటి పిచ్ అయితే ఉంటుందో.. వాకా స్టేడియంలోనూ అలాంటి దానినే సిద్ధం చేయించి వార్మప్ మ్యాచ్ ఆడతాం'' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

ఆసీస్ మీడియా మాత్రం ఇలా..

వాకా స్టేడియంలో తొలి ప్రాక్టీస్ సెషన్‌లోనూ భారత బ్యాటర్లు ఎవరికీ కనిపించనీయకుండా చేసినట్లు వార్తలు వచ్చాయి. వార్మప్ మ్యాచ్‌ను చూసేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వరాదని బీసీసీఐ కోరినట్లు ఆస్ట్రేలియా మీడియా పేర్కొంది. ''వాకా స్టేడియాన్ని పునరుద్ధరిస్తున్నారు. అక్కడ పనిచేసే వర్కర్లు చాలామంది ఉన్నారు. అయితే, వారితోపాటు వాకా మైదానం సిబ్బంది ఫోన్లను కూడా అనుమతించలేదు. ఒక్క ఫొటో కూడా తీసేందుకు వీలు లేకుండా చేశారు. వార్మప్ మ్యాచ్ సమయంలోనూ ఫొటోలు, వీడియోలు, డ్రోన్స్ లేకుండా చూడాలని బీసీసీఐ షరతు విధించింది. తొలుత భారత్ vs భారత్ A వార్మప్ మ్యాచ్ రద్దు చేసి.. సెంటర్ పిచ్‌పై ప్రాక్టీస్ చేయాలని బీసీసీఐ భావించింది'' అని ఆసీస్ మీడియా తెలిపింది.

### తిలక్ వర్మ సూపర్ సెంచరీ..

# టీమిండియా ఘన విజయం




**విశ్వంభర, సెంచూరియన్ :** సౌతాఫ్రికాతో టీ20 సిరీస్‌లో భారత్ రెండో విజయం నమోదు చేసింది. బుధవారం సెంచూరియన్ వేదికగా జరిగిన మూడో టీ20లో టీమ్‌ఇండియా 11 పరుగుల తేడాతో నెగ్గింది. భారత్ నిర్దేశించిన 220 పరుగుల భారీ ఛేదనలో సౌతాఫ్రికా ఓవర్లన్నీ ఆడి 2087 పరుగులకే పరిమితమైంది. మార్కో జాన్సెన్ (54 పరుగులు), హెన్రిచ్ క్లాసెన్ (41 పరుగులు) ఆకట్టుకున్నారు. టీమ్‌ఇండియా బౌలర్లలో అర్షదీప్ 3, వరుణ్ 2, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్ తలో 1 వికెట్ దక్కించున్నారు. సెంచరీతో రఫ్ఫాడించిన తిలక్ వర్మకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

భారీ ఛేదనను సౌతాఫ్రికా దీటుగా ప్రారంభించింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా, రన్ రేట్ తగ్గకుండా చూసుకున్నారు. దీంతో 10 ఓవర్లకు నాలుగు వికెట్ల నష్టానికి 84 పరుగులతో నిలిచింది. తర్వాత డేవిడ్ మిల్లర్ (18 పరుగులు) తక్కువ స్కోర్‌కే పెవిలియన్ చేరినా, క్లాసెన్, జాన్సర్ రెచ్చిపోయారు. పోటీపడి మరీ సిక్స్‌లు బాదారు. ఈ క్రమంలో జాన్సన్ 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్ క్రాస్ చేశాడు. ఇక ప్రమాదకరంగా మారిన ఈ ఇద్దర్నీ ఆఖర్లో అర్షదీప్ సింగ్ పెలియన్ చేర్చి భారత్ విజయం ఖరారు చేశాడు.

అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 2196 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఓపెనర్ సంజూ శాంసన్ మరోసారి నిరాశ పర్చాడు. ఇదే సిరీస్‌లో రెండోసారి డకౌట్ అయ్యాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (50 పరుగులు) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (1), కూడా విఫలమయ్యాడు. ఇక తెలుగు కుర్రాడు తిలక్ వర్మ (107 పరుగులు, 56 బంతుల్లో; 8x4: 7x6) సూపర్ సెంచరీతో రఫ్ఫాడించాడు. సౌతాఫ్రికా బౌలర్లలో కేశవ్ మహారాజ్, సిమిలేన్ తలో 2, మార్కో జాన్సెన్ 1 వికెట్ దక్కించుకున్నారు. ఈ విజయంతో నాలుగు టీ20ల సిరీస్‌లో భారత్ 21తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇరుజట్ల మధ్య ఆఖరి వన్డే శుక్రవారం జరగనుంది.

# ట్రిపుల్ సెంచరీలతో విధ్వంసం..

### రంజీల్లో రికార్డు భాగస్వామ్యం వీళ్లదే..!

**పనాజీ :** ఆద్యంతం ఉత్కంఠ రేపుతున్న రంజీ ట్రోఫీలో గోవా బ్యాటర్లు చరిత్ర సృష్టించారు. విధ్వంసక ఇన్నింగ్స్‌తో రికార్డు స్కోర్ కొట్టేశారు. అరుణాచల్ ప్రదేశ్ బౌలర్లను ఎడాపెడా బాదేస్తూ ట్రిపుల్ సెంచరీలతో కదం తొక్కారు. స్నేహల్ కౌథంకర్(314 నాటౌట్), కశ్యప బాక్లే(300 నాటౌట్)లు పరుగుల వరద పారిస్తూ మూడొందలు కొట్టేశారు. ఈ ఇద్దరు మూడో వికెట్‌కు 606 పరుగులు జోడించారు. దాంతో, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 594 పరుగులతో ఉన్న రికార్డు బద్ధలైపోయింది.రంజీ ట్రోఫీలో గోవా జట్టు విజయానికి చేరువైంది. తొలుత అర్జున్ టెండూల్కర్(5/26) విజృంభణతో అరుణాచల్ ప్రదేశ్‌ను 89 పరుగులకే ఆలౌట్ చేసిన గోవాకు బ్యాటర్లు భారీ స్కోర్ అందించారు. ఓపెనర్లు విఫలమైనా మేమున్నామంటూ స్నేహల్ కౌథంకర్(314 నాటౌట్ 43 ఫోర్లు, 4 సిక్సర్లు), కశ్యప బాక్లే(300 నాటౌట్ 39 ఫోర్లు, 2 సిక్సర్లు)లు వీరకొట్టుడు కొట్టారు.ఆకలిగొన్న పులుల్లా బ్యాట్లకు పని చెప్పిన ఈ ఇద్దరూ అరుణాచల్ ప్రదేశ్ బౌలర్లకు చుక్కలు చూపించారు. వీళ్ల విధ్వంసానికి గోవా స్కోర్‌బోర్డు పరుగులు తీసింది. ఇద్దరూ ట్రిపుల్ సెంచరీలతో చెలరేగగా గోవా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 727 రన్స్ కొట్టింది. దాంతో,643 పరుగుల ఆధిక్యం సాధించి మ్యాచ్‌పై పట్టు సాధించారు.




రికార్డు భాగస్వామ్యాలు ఎవరివంటే.. కశ్యప బాక్లే, స్నేహల్ కౌథంకర్ (గోవా) 606 నాటౌట్, అరుణాచల్ ప్రదేశ్‌పై. 2. స్వప్నిల్ సుగాలే - అంకీత్ బవనె(మహారాష్ట్ర) 594 నాటౌట్ 2016/17లో ఢిల్లీపై. 3. విజయ్ హజారే, గుల్ మొహమ్మద్(బరోడా) - 577 పరుగులు, 1946/47లో హోల్కర్‌పై.

# అధికారులపై దాడిని ఉపేక్షించొద్దు

### లగచర్ల ఘటనకు నిరసనగా హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

**విశ్వంభర, హైదరాబాద్ :** వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై జరిగిన దాడి ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగుల ఐకాస ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనుక ఎవరున్నా, ఎంతవారైనా ఉపేక్షించొద్దని కోరారు. లగచర్ల ఘటనకు నిరసనగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేపట్టారు.ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగుల ఐకాస ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి హాజరయ్యారు.

దాడి వెనుక దాగి ఉన్న కుట్రను బహిర్గతం చేయాలి :లచ్చిరెడ్డి

ఈ సందర్భంగా వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులపై దాడికి పాల్పడి, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు కుట్రపన్నిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ప్రజల కోసం పని చేసే ప్రభుత్వ అధికారులను లక్ష్యంగా చేసుకొని దాడి చేయడంలో కుట్ర కోణం దాగి ఉంటుందని ఆరోపించారు.ఇప్పటికే పోలీసుల విచారణలో వెలుగులోకి వస్తున్న విషయాలు ఉద్యోగ లోకాన్ని భయభ్రాంతులకు గురి చేశాయన్నారు. రాజకీయాలకు అతీతంగా సేవలు అందించే అధికారులపై దాడులు, హత్యాయత్నం వంటి ఘటనలకు పూనుకోవడం వెనుకాల బలమైన కుట్ర దాగి ఉందనే అనుమానాలకు బలం చేకూరుతుందన్నారు.

తీవ్రంగా గాయపడిన ఏ అధికారిని ఎవరూ పరామర్శించలేదన్నారు. చివరకు కొందరు అధికారులపై జరిగిన దాడిని సైతం పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. లగచర్ల ఘటనలో దాడికి గురైన ఉద్యోగులపై కాకుండా, దాడికి పాల్పడిన వారిని పరామర్శించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.అనంతరం హైదరాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈ కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ నాయకులు కె.రామకృష్ణ , జనరల్ సెక్రటరీ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, ఎస్.రాములు , అధ్యక్షులు తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ , డా.జి.నిర్మల, అధ్యక్షులు తెలంగాణ ఉద్యోగుల అసోసియేషన్, దర్శన్‌గౌడ్ , అధ్యక్షులు తెలంగాణ సీపీయస్ యూనియన్ , డా. కత్తి జనార్దన్, దేవికా , శ్రీరాం, హరికిషన్ , ఉదర గోపాల్ , విజయారావు, సుగంధిని, హేమలత, రాబర్ట్ బ్రూస్, రోహిత్ నాయక్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.




## బ్యాటింగ్ కన్సల్టెంట్‌గా సచిన్‌ను తీసుకోండి


### బీసీసీఐకి మాజీ క్రికెటర్ సూచన



**ముంబయి :** భారత స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ పెద్దగా ఫామ్‌లో లేరు. బంగ్లాదేశ్‌పై ఓ మోస్తరు పరుగులు చేసినా.. న్యూజిలాండ్‌తో మాత్రం తేలిపోయారు. ఐదు టెస్టుల ఆసీస్ సిరీస్‌లో వీరిద్దరే కీలకపాత్ర పోషించాల్సి ఉంటుంది. జట్టులో అందరికంటే సీనియర్లు వీరే. ఆస్ట్రేలియాపై మంచి రికార్డులే ఉన్న కోహ్లికి ... ఇప్పుడున్న ఫామ్ ఇబ్బందికరంగా మారింది. అయితే, ఒక్క మంచి ఇన్నింగ్స్ ఆడితే మాత్రం చెలరేగిపోవడం ఖాయమని క్రికెట్ అభిమానులు చెబుతున్నారు. అలా జరగాలంటే క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్‌తో బ్యాటింగ్ పాఠాలు చెప్పించాలని.. అతడిని బోర్డర్ గావస్కర్ ట్రోఫీ కోసం కన్సల్టెంట్‌గా నియమించుకోవాలని భారత మాజీ క్రికెటర్, మాజీ కోచ్ డబ్ల్యూవీ రామన్ బీసీసీఐకి సూచించాడు. ఈమేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టాడు. ''భారత్ జట్టుకు అత్యంత ప్రయోజనం చేకూరాలంటే నాదొక సూచన. బ్యాటింగ్ క్రికెట్ దిగ్గజం సచిన్ (Sachin) సేవలను వినియోగించుకోవాలి. బోర్డర్ గావస్కర్ ట్రోఫీ కోసం బ్యాటింగ్ కన్సల్టెంట్‌గా నియమించుకోండి. తొలి టెస్టుకు రెండో మ్యాచ్‌కు చాలా సమయం ఉంది. ఈ రోజుల్లో కన్సల్టెంట్‌ల నియామకం చాలా సర్వసాధారణం. సరైందే అని భావిస్తే ఆలోచన చేయాలి'' అని బీసీసీఐని ట్యాగ్ చేస్తూ రామన్ పోస్టు చేశాడు. సచిన్ ఆసీస్‌పై 39 టెస్టులు ఆడగా.. 3,630 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియాలోనే సగం పరుగులు (1,809) 20 మ్యాచుల్లోనే సాధించాడు. గతంలో ఇంగ్లండ్ పర్యటనకు ముందు కోహ్లి (Virat Kohli) ఇలానే ఇబ్బందిపడ్డాడు. ఆ సమయంలోనూ సచిన్‌తో కొన్ని సెషన్ల పాటు చర్చించిన తర్వాత విరాట్ చాలా మెరుగ్గా రాణించాడు. లోటుపాట్లపై సచిన్ కీలక సూచనలు ఇచ్చాడని కోహ్లినే ఓ సందర్భంలో వెల్లడించాడు.

## రివర్స్ స్వీప్‌తో సిక్సర్..

## పాక్ పేసర్లకు దడ పుట్టించిన మ్యాక్స్‌వెల్




**సిడ్నీ:** ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఎప్పుడు ఎలా ఆడుతాడో తెలియదు. క్రీజులో కుదురుకున్నాడంటే మాత్రం భారీ షాట్లతో విరుచుకుపడుతాడు. స్పిన్నర్లను ముప్పతిప్పలు పెడుతూ రివర్స్ స్వీప్, స్వీప్ షాట్లతో బౌండరీల మోత మోగిస్తాడు. ఈమధ్య పెద్దగా రాణించని మ్యాక్స్‌వెల్ టీ20 మ్యాచ్‌లో తన స్టయిల్లో రెచ్చిపోయాడు.పాకిస్థాన్ పేస్ బౌలర్లను ఊచకోత కోస్తూ స్కోర్ బోర్డును ఉరికించాడు. ముఖ్యంగా పాక్ ప్రధాన పేసర్ షాహీన్ ఆఫ్రిదిని లక్ష్యంగా చేసుకొని మ్యాక్సీ ఓ రేంజ్‌లో చెలరేగాడు. బ్రిస్బేన్‌లోని గబ్బా స్టేడియంలో మ్యాక్సీ విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. ఉన్నంత సేపు పాక్ బౌలర్లను వణికించాడు. యువ పేసర్ నసీం షా వేసిన రెండో ఓవర్లో ఆసీస్ చిచ్చరపిడుగు 4, 0, 4, 4, 4 బాదాడు.ఆ తర్వాత హ్యారిస్ రవుఫ్‌కు చుక్కలు చూపిస్తూ ఒక ఫోర్, 2 సిక్సర్లు బాదాడు. ఇక.. షాహీన్ ఆఫ్రిదికి కూడా ఆసీస్ ఆల్‌రౌండర్ దడ పుట్టించాడు. అతడు వేసిన 4 వ ఓవర్లో రివర్స్ స్వీప్ ద్వారా బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు మ్యాక్సీ. ఆ షాట్ చూసిన ఆఫ్రిది ఇదేం విధ్వంసం రా బాబు అని తల పట్టుకున్నాడు. ప్రస్తుతం మ్యాక్సీ సుడిగాలి ఇన్నింగ్స్ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోంది. స్వదేశంలో పాకిస్థాన్‌కు పెద్దగా పోటీ ఇవ్వలేక వన్డే సిరీస్ కోల్పోయిన ఆస్ట్రేలియా టీ20 సిరీస్ పట్టేయాలనే పట్టుదలతో ఉంది.

రాష్ట్ర వ్యాప్తంగా

## 'ఇందిరా మహిళా శక్తి' భవనాలు

*** 19న వరంగల్‌లో శంకుస్థాపన**

*** సీఎం రేవంత్‌రెడ్డి**



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ మేరకు విజయోత్సవాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. విజయోత్సవాల్లో భాగంగా వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ సభల్లో సీఎం పాల్గొననున్నారు. మహిళా సాధికారత, రైతుల సంక్షేమాన్ని సభల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం సూచించారు. ఈ నెల 19న వరంగల్ వేదికగా 'ఇందిరా మహిళా శక్తి' భవనాలకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. డిసెంబర్ 7న ట్యాంక్ బండ్, 8న సచివాలయం, 9న నెక్లెస్ రోడ్ పరిసరాల్లో విజయోత్సవ వేడుకలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు.

# దాడులకు ప్రతి దాడులు తప్పవు

### టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** సర్కార్‌ను బద్నామ్ చేసేందుకు కేటీఆర్ కుట్రలు చేస్తున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు రాజభోగాల ఆకలి ఇంకా తీరలేదని మండిపడ్డారు.గురువారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ఏదైనా ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయదలచుకుంటే ఏనాడైనా గ్రామ సభలు నిర్వహించారా అని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పోలీసులను అడ్డుపెట్టుకుని రైతులపై దాడికి పాల్పడిందని ఆరోపించారు. పథకం ప్రకారమే లగచర్లలో కలెక్టర్, జిల్లా అధికారులపై దాడి చేసి కంపెనీలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. పరిశ్రమలు తీసుకువచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనీ సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తుంటే, బీఆర్ఎస్ నేతలు వాటిని అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకునేది లేదన్నారు.మా మీద కేసులు అయినా పరవాలేదు ..దాడికి ప్రతి దాడులు తప్పక ఉంటాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీ అండగా ఉంటామని, రాజకీయంగా కుట్రలను తిప్పి కొడతామని జగ్గారెడ్డి తెలిపారు. మీ వ్యూహాలకు ప్రతి వ్యూహాలు చేస్తాం. మొదటి పొరపాటుగా వదిలేస్తున్నాం. సర్దుబాటు మాటలతోనే ఇంక ముందు మాటలతో ఉండదన్నారు. మమ్మలి రెచ్చగొడితే మా తడాఖా ఏంటో చూపిస్తామని జగ్గారెడ్డి హెచ్చరించారు. బీఆర్ఎస్ పాలనలో మల్లన్న సాగర్ రైతులను కొట్టిన ఫొటోలు చూపిస్తున్నామని, లగచర్లలో తాము రైతులను కొట్టినట్టు ఆధారాలు చూపించి చర్చకు రావాలని జగ్గారెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు చూసి బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ధ్వజమెత్తారు. కలెక్టర్ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి.. అక్కడి నుంచి యాక్టివ్‌గా కలెక్టర్‌ను తరలించారని అన్నారు. లేకపోతే కలెక్టర్ ప్రాణం పోయేదన్నారు. బలవంతంగా భూములను లాక్కొనే ఆలోచన ప్రభుత్వానికి లేనే లేదని అన్నారు.ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని ఆయన తెలిపారు. ఉచిత బస్సు, రూ.500 గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ చేశారని తెలిపారు . 200 యూనిట్లు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు . రూ.2500 మహిళలకు పింఛన్లు, 4వేల పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు కూడా త్వరలోనే మంజూరు చేస్తామని పేర్కొన్నారు.



# పరమ పవిత్రం కార్తీక పౌర్ణమి

## శివకేశవులకు ప్రియమైన రోజు..



## శివునికి, విష్ణుమూర్తికి ప్రియమైన రోజు..

కార్తీక పౌర్ణమి అటు శివునికి, ఇటు విష్ణుమూర్తికి కూడా ప్రియమైన రోజు. ఈరోజున దీపం వెలిగిస్తే మనం తెలిసీ తెలీక చేసే పాపాలన్నీ హరించుకుపోతాయి. కార్తీక సోమవారాల్లో, కార్తీక పౌర్ణమి రోజున రుద్రాభిషేకం చేయిస్తారు. ఈ విశిష్ట దినాన సత్యన్నారాయణ వ్రతం చేసుకోవడం చాలా శ్రేష్ఠం. ప్రధానంగా కార్తీక పౌర్ణమి నాడు తెల్లవారు జామున సముద్రంలో లేదా నదిలో స్నానం చేయడం శుభప్రదం. నదిలో స్నానం చేసే అవకాశం లేనివారు ఉదయానే లేచి స్నాన జపాలు ముగించి ఆలయానికి వెళ్ళి దేవుని దర్శించుకుంటారు. ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. రోజంతా ఉపవాసం ఉండి, సాయంత్రం 365 వత్తులతో కూడిన దీపాన్ని వెలిగిస్తారు. రోజుకు ఒక ఒత్తి చొప్పున ఏడాది మొత్తాన్ని సూచిస్తాయి ఈ ఒత్తులు. కొందరు దీపాలను అరటిదొన్నెపై ఉంచి నదిలో లేదా కొలనులో వదులుతారు. ఇంకొందరు శివాలయంలో దీపాలు వెలిగిస్తారు. ఆ వీలు లేనివారు ఇంట్లోనే దేవునిముందు లేదా తులసికోట ఎదుట దీపం వెలిగిస్తారు. కార్తీక పౌర్ణమి నాడు శివాలయంలో దీపారాధన చేయడం అంటే ముక్కోటి దేవతలనూ పూజించడమే. సకల పుణ్యనదుల్లో స్నానం చేసిన ఫలం దక్కుతుంది. కార్తీక పౌర్ణమినాడు చేసే దీపారాధనతో ఇహలోకంలో సుఖసౌఖ్యాలు, పరలోకంలో ముక్తి లభిస్తాయి.

## కార్తీక మాసంలో ఉసిరికి ప్రత్యేక స్థానం

కార్తీక మాసంలో కార్తీక పౌర్ణమి వేళ, ఉసిరి కాయలతో చేసిన దీపాలను వెలిగించి, శివునికి మరియు విష్ణువులకు ఇష్టమైన ఉసిరి చెట్టుకు పూజలు చేస్తే అది మీకు అదృష్టాన్ని ఇస్తుంది. అలాగే కార్తీక పౌర్ణమి రోజు ఉసిరికాయతో స్నానం చేస్తే పుణ్యం కూడా వస్తుంది. కార్తీక పౌర్ణమి నాడు ఉసిరి కాయలతో మరొక పని చేసినా సిరి సంపదల వర్షం కురుస్తుంది.కార్తీక పౌర్ణమి నాడు ఉసిరికాయలను దానం చేస్తే మనకు ఊహించనంత పుణ్యం లభిస్తుంది. ఉసిరికాయలను దానం చేసిన వారిపైన లక్ష్మీదేవి కటాక్షం తప్పనిసరిగా ఉంటుంది. ఒక్క ఉసిరికాయలే కాదు కార్తీక మాసంలో చేసిన దానాలు కూడా లక్ష్మి కటాక్షానికి కారణమవుతాయి. కార్తీక పౌర్ణమి పర్వదినాన దీపదానం చేస్తే కూడా పుణ్యం లభిస్తుంది. అలాగే బియ్యం పిండి, గోధుమ పిండితో చేసిన దీపాలతో పాటు, వెండి ప్రమిదలను దానం చేస్తే లక్ష్మి దేవి కటాక్షం ఉంటుంది. ఆమె చల్లని చూపుతో మీరు సంపన్నులవుతారు.

**వ్యాసుల వారు కృత యుగంతో సమానమైన యుగం కానీ, వేదంతో సమానమైన శాస్త్రం కానీ, కార్తీక మాసంతో సమానమైన మాసం కానీ, గంగా తీర్థంతో సమానమైన తీర్థం కానీ లేదని చెబుతూ మాసాలన్నింటిలోకెల్లా కార్తీక మాసానికి అగ్ర తాంబూలం ఇచ్చారు. ఇంతటి పరమ పవిత్రమైన కార్తీక మాసంలో కార్తీకక పౌర్ణమికి ఇంతటి విశిష్టత ఎలా వచ్చిందో విశ్వంభర ప్రత్యేక కథనం..**

నిండు చంద్రుడు మెండుగా వెలిగే పౌర్ణమి అంటే అందరికీ ఆహ్లాదమే! నెలరాజు.. కార్తిక మాసంలో మరింత సుందరంగా ప్రకాశిస్తాడు. నింగిలో మెరిసే పున్నమి చంద్రుడికి దీటుగా ఇలపై కోటి దీపోత్సవం జరుగుతుంది. పరమేశ్వరుణ్ని జ్యోతి స్వరూపంగా ఆరాధించే రోజు. అందుకే కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమిని హిందువులకు పరమ పవిత్రమైన రోజు. ఇది మహా శివరాత్రితో సమానమైన పుణ్యదినం. ఈ పర్వదినాన్ని "త్రిపురి పూర్ణిమ", "దేవ దీపావళి" అని కూడా అంటారు. ఆశ్వయుజ అమావాస్య అంటే దీపావళి వెళ్ళిన మర్నాడు కార్తీకమాసం ప్రారంభమౌతుంది. ఇక ఆరోజు నుండి కార్తీకమాసం ముగిసేవరకూ ప్రతిరోజూ సాయంవేళ దీపాలు వెలిగించి సంరంభం చేస్తారు. ముఖ్యంగా కార్తీక సోమవారాలు, కార్తీక పౌర్ణమి పర్వదినాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. ఈ నెల అంతా కార్తీక మహా పూరాణాన్ని పారాయణం చేస్తారు. దేవాలయాల్లో కార్తీక పురాణ శ్రవణం ఏర్పాటు చేస్తారు.

**కార్తీక పౌర్ణమి వెనుక పురాణ కథ..**

కార్తిక పౌర్ణమికి త్రిపుర పౌర్ణమి అని మరొకపేరు. తారకాసురుడి ముగ్గురు కుమారులూ బ్రహ్మను మెప్పించి, ఎక్కడికైనా స్వేచ్ఛగా సంచరించగలిగే మూడు పురాలను వరంగా పొందారు. ఎవరివల్లా మరణం లేకుండా వరం కోరారు. అది సాధ్యం కాదన్నాడు బ్రహ్మ. అలాగైతే రథం కాని రథం మీద, విల్లు కాని విల్లుతో, నారి కాని నారి సారించి, బాణం కాని బాణం సంధించి, మూడు నగరాలూ ఒకే సరళరేఖలోకి వచ్చాక ఒకే బాణంతో ముగ్గురినీ ఏకకాలంలో కొడితేనే మరణం సంభవించేలా వరం కోరారు. ఇవ్వక తప్పలేదు బ్రహ్మకు. ఆ వర బలంతో పట్టణాలతో సహా సంచారం చేస్తూ లోకాలన్నిటా కల్లోలం సృష్టించారు త్రిపురాసురులు.వివిధ లోకవాసులు బ్రహ్మకు మొర పెట్టుకున్నారు. వరం ఇచ్చింది తానే కాబట్టి ఏమీ చేయలేనన్నాడు. విష్ణువు దగ్గరికి వెళ్లమని ఉపాయం చెప్పాడు. విష్ణువు కూడా తనకా శక్తిలేదని, వారిని వెంటపెట్టుకుని శివుడి దగ్గరికి వెళ్లాడు. దేవతలందరూ సహకరిస్తేనే తానీపని చేయగలనన్నాడు శివుడు. ఆ మాటతో భూమి రథం కాని రథంగా మారింది. మేరు పర్వతం విల్లుకాని



విల్లుగా, ఆదిశేషువు అల్లెతాడు కాని అల్లెతాడుగా, శ్రీమహావిష్ణువు బాణం కాని బాణంగా మారారు. వీరందరి సమాహార శక్తితో శివుడు త్రిపురాసురులను (మూడు పట్టణాల యజమానులైన రాక్షసులను) సంహరించాడని, అందువల్ల ఈ పేరు వచ్చిందనీ పురాణ కథనం. మహాభారత కథనాన్ని అనుసరించి కార్తికేయుడు తారకాసురుని సంహరించిన రోజే కార్తీక పౌర్ణమి. ప్రజలను నానారకాలుగా హింసిస్తున్న తారకాసురుడు ఇక లేడన్న ఆనందంతో దీపాలు వెలిగించి సంబరం చేసుకున్నారు. వెయ్యేళ్ళ రాక్షసుల పాలన అంతరించిన శుభసందర్భంగా మహాశివుడు తాండవం చేశాడని పురాణాలు చెప్తున్నాయి.

**కార్తీక దీపం దానం విశిష్టత..**

'కీటాః పతంగాః మశకాశ్చ వృక్షాః
జలేస్థలే యే నివసంతి జీవాః
దృష్ట్వా ప్రదీపం నీచజన్మ భాగినః
భవంతి త్వం శ్వపచాహి విప్రాః'

ఈ శ్లోకం చదువుతూ కార్తిక పౌర్ణమి నాడు దీపారాధన చేయాలని శాస్త్రం చెబుతున్నది. ఈ రోజు వెలిగించిన దీపపు కాంతిని చూసిన సమస్త జీవులకు శుభం జరగాలని కోరుకోవడమే ఈ శ్లోకం అర్థం. దక్షిణాయనంలో వచ్చే కార్తిక మాసం ఉపాసనకు చాలా యోగ్యమైంది. దీపారాధన చేస్తూ 'దామోదరం ఆవాహయామి' అని గానీ, 'త్రయంబకం ఆవాహయామి' అని గానీ చెబుతూ తమ ఇష్టదైవాలైన శివకేశవులను ఆవాహన చేస్తారు.'ఏకస్సర్వదానాని దీపదానం తథైకత' అని శాస్త్ర వచనం. అంటే అన్ని దానాలు ఒక ఎత్తు దీపదానం ఒక ఎత్తు అని. దీపదానం చేసేవారు స్వయంగా వత్తులను తయారుచేసుకోవాలని పెద్దలు సూచించారు. వరిపిండి, గోధుమపిండితో ప్రమిదను తయారు చేసి ఆవునెయ్యితో దీపాన్ని వెలిగించాలి. దీపాన్ని పూజించి, నమస్కరించి, శైవ, వైష్ణవాలయాల్లో దానం చేయాలి. ఇలా దీపదానం చేసిన వారికి సద్గతులు ప్రాప్తిస్తాయని విశ్వాసం.

కార్తిక పౌర్ణమి నాడు సాలగ్రామం, ఉసిరికాయలు దానం చేసినా కూడా పాపాలు నశిస్తాయని నమ్మకం. అంతేకాదు ఇదే రోజున ఏడాది మొత్తానికి కలిపి 365 వత్తులతో దీపం వెలిగిస్తారు. దీనిని ఆలయంలో గానీ, ఇంట్లోని పూజగదిలో, తులసి కోట ఎదుట వెలిగించవచ్చు. ఇలా చేయడం వల్ల ముక్కోటి దేవతల అనుగ్రహం కలుగుతుంది. పౌర్ణమి రాత్రి ఆలయ ధ్వజ స్తంభానికి వేలాడే ఆకాశ దీపాన్ని దర్శిస్తే సకల శుభాలూ కలుగుతాయి. కార్తిక మాసంలో ప్రతిరోజూ దీపారాధన చేయలేని వారు కనీసం పౌర్ణమి నాడైనా దీపం వెలిగించాలని పెద్దల మాట. ఈ దీపజ్యోతి ఎవరిపై ప్రసరిస్తుందో వారికి కూడా.. దీపం వెలిగించిన పుణ్యం లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అంతేకాదు, ఇతరులు వెలిగించిన దీపాన్ని ఆరిపోకుండా చూసినవారికి సైతం పుణ్యం దక్కుతుందట.

దీపకాంతిలో ఉండే ఎరుపు, పసుపు, నీలి కాంతులు ముగురమ్మలకూ సంకేతంగా నిలుస్తాయి. దీపారాధన వల్ల శివుడి అనుగ్రహం సిద్ధిస్తుంది. దీపాలను వెలిగించేవాళ్లకు సహాయకులుగా ఉన్నా, కొడిగట్టబోతున్న దీపానికి నూనె పోసినా కూడా ఆ పుణ్యఫలం దక్కుతుంది. ఈ రోజు కంచుపాత్రలో ఆవునెయ్యి పోసి దీపం వెలిగిస్తే పూర్వజన్మలో చేసిన పాపాలు నశిస్తాయని కార్తిక పురాణం చెబుతున్నది. కార్తిక పౌర్ణమి నాడు దీపాలు వెలిగించిన వారికి గ్రహ, సర్ప, కాలసర్ప, కళత్ర దోషాలు ఏమైనా ఉంటే అవి తొలగిపోతాయి. అంతేకాదు, దీపారాధనకు దూది వత్తులు వెలిగిస్తే వంశాభివృద్ధి కలుగుతుంది. అరటి, తామర వత్తులను ఉపయోగిస్తే పుత్రశాపం తొలగిపోవడంతోపాటు పాపాలు నశిస్తాయి. తెలుపు గన్నేరు వత్తులను ఉపయోగిస్తే సిరిసంపదలు సమకూరుతాయి. కార్తిక పౌర్ణమి నాడు దాదాపుగా అందరూ ఉదయం నుంచి ఉపవాసం ఉండి, ప్రదోష కాలంలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేస్తారు. దీపారాధన ఉసిరి చెట్టు కింద చేస్తే విశేష ఫలం లభిస్తుంది. నైమిశారణ్యంలో కార్తిక పౌర్ణమి నాడు సూత మహర్షి మునులందరితో కలిసి ఉసిరి చెట్టు కింద వనభోజనాలు చేసినట్లు కార్తిక పురాణంలో వర్ణించారు. ఉసిరిచెట్టు శ్రీహరికి అత్యంత ప్రీతిపాత్రమైంది. అందుకే వనభోజనాలకు ఉసిరి చెట్టు నీడ శ్రేష్ఠం. వనభోజనాల ప్రారంభానికి ముందు, ఉసిరి చెట్టు మొదట్లో విష్ణుమూర్తి పటాన్ని లేదా విగ్రహాన్ని ఉంచి, పూజించాలి. ఆ తర్వాత వండిన పదార్థాలను దైవానికి నివేదించి సహపంక్తి భోజనాలు చేయడం సంప్రదాయం.

## శివోహం

**దీపారాధన వెనుక ఆధ్యాత్మిక రహస్యం**

కార్తిక మాసంలో చేసే దీపారాధన వెనుక ఉన్న ఆధ్యాత్మిక రహస్యం ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. భగవంతుని పూజించేందుకు హైందవ శాస్త్రాలు షోడశోపచారాలు నిర్దేశించారు. అందులో దీపారాధన ఒకటి. దీపాన్ని దైవ స్వరూపంగా, లక్ష్మీదేవిగా భావించి పూజించడం మన సంప్రదాయం.ఆధ్యాత్మికపరంగా చూస్తే దీపాన్ని జ్ఞానాంశకు ప్రతీకగా చెబుతారు. ఇక్కడ ప్రమిదలోని వత్తి శరీరంగా, నూనెను కర్మఫలంగా జ్వాలను ప్రాణంగా అభివర్ణిస్తారు. మట్టి ప్రమిద అంటే భూమాతగా, ధాత్రిగా చెబుతారు. ఇక్కడ నూనె గా భావించే కర్మఫలం అనే ప్రాణం ఉన్నంత వరకు శరీరం అనే వత్తిలో ప్రాణం అనే జ్వాల వెలుగుతూ ఉంటుంది. ఎప్పుడైతే కర్మఫలం అనే నూనె అయిపోతుందో అన్నీ మట్టి లో కలిసిపోతాయి. ఇదే కర్మసిద్ధాంతం. ఇదే కార్తిక దీపం వెలిగించడంలో ఉన్న ధర్మసూక్ష్మం. ఇక 365 వత్తులతో ఎందుకు దీపారాధన చేయాలంటే కొంత మందికి సంవత్సరంలో కొన్ని రోజులు దీపారాధన చేసే అవకాశం ఉండదు. అలా చేయలేని వారు సంవత్సరంలో ఒక్కసారి కార్తిక పౌర్ణమి రోజు 365 వత్తులతో దీపారాధన చేసినట్లయితే సంవత్సరమంతా దీపారాధన చేసిన ఫలం కలుగుతుంది.

## కార్తీక పౌర్ణమికి జ్వాలాతోరణం..

కార్తీకపౌర్ణమి రోజు సాయంత్రం వెలిగించే జ్వాలాతోరణానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు భక్తులు. కార్తీక పౌర్ణమి రోజు సాయంత్రం వెలిగించే జ్వాలతోరణాన్ని దర్శించుకుంటే సకలపాపాలు నశిస్తాయని చెబతారు. జ్వాలాతోరణ భస్మం ధరిస్తే బూత ప్రేత పిశాచ బాధలన్నీ తొలగిపోతాయంటారు. జ్వాలాతోరణ దర్శనం వలన పాపాలు పోతాయి. మన జీవితంలో కొత్త వెలుగులు ప్రసరిస్తాయంటారు.కార్తీక పౌర్ణమి రోజు సాయంత్రం శివాలయాల ముందు రెండు కర్రలు నిలువుగా ఓ కర్రను వాటికి అడ్డంగా పెట్టి కొత్త గడ్డిని తీసుకొచ్చి చుడతారు. దీనికి యమద్వారం అని పేరు. ఈ నిర్మాణంపై నెయ్యి పోసి జ్వాల వెలిగిస్తారు. ఆ మంట కిందనుంచి పరమేశ్వరుడిని పల్లకిలో అటూ ఇటూ మూడుసార్లు ఊరేగిస్తారు.జ్వాలాతోరణం వల్ల నరక ప్రాప్తి వుండదని పెద్దలు చెబుతారు. యమలోకానికి వెళ్లిన ప్రతి వ్యక్తీ అగ్నితోరణం గుండా లోనికి వెళతారని ప్రతీతి. పాపాత్ములకు వేసే మొదటి శిక్ష అగ్నితోరణం. యమలోకంలోకి అడుగుపెట్టకుండా ఉండాలన్నా, ఈ శిక్షల నుంచి తప్పించుకోవాలన్నా పరమేశ్వరుడి అనుగ్రహం తప్పక వుండాలంటారు. అందుకే ఎంతో పవిత్రమయిన కార్తీక పౌర్ణమి రోజున ఎవరైతే యమ ద్వారం నుంచి మూడుసార్లు అటూ ఇటూ వెళ్లి వస్తారో వారికి ఈశ్వరుడి అనుగ్రహం లభిస్తుందంటారు.జ్వాలాతోరణం కింద ఈశ్వరుడి పల్లకి మోసినా, వెనుక నడుస్తూ పరమేశ్వరా నేను ఇప్పటి వరకూ చేసిన పాపాలన్నీ ఈ మంటల్లో కాలిపోవాలి..మళ్లీ ఎలాంటి తప్పులు చేయకుండా సన్మార్గంలో నడిపించమని కోరుకోవాలి. జ్వాలాతోరణం పూర్తైన వెంటనే పూర్తిగా కాలకుండా మిగిలిన గడ్డిని తీసుకొచ్చి ఇంటి చూరులోనో, గడ్డివాములోనో, ధాన్యాగారంలోనో పెట్టుకుంటారు. దీని వల్ల దుష్టశక్తులు మన ఇంటిలోకి, పొలాల్లోకి రాకుండా వుంటాయని నమ్ముతారు.



**కేదారేశ్వర వ్రతం**

చంద్రుడు కృత్తిక నక్షత్రంతో కలిసి వున్నరోజు కార్తీక పౌర్ణమి వస్తుంది. ఈ పర్వదినాన నోము నోచుకునే ఇంట కేదారేశ్వరునికి మర్రి చెట్టు ఊడలను తోరణాలుగా, మర్రిపండ్లను బూరెలుగా, మర్రి ఆకులును విస్తర్లుగా పెట్టి పూజలు చేయడం పురాతనకాలం నుంచి సంప్రదాయంగా వస్తోంది. కేదారేశ్వర వ్రతం భార్యాభర్తల మధ్య ప్రేమను పెంచుతుందని పురోహితులు చెబుతున్నారు. ఆది దంపతులకు ఇష్టమైన ఈ వ్రతాన్ని ఎలా పాటించాలంటే కేదారేశ్వర వ్రతంలో 21వ సంఖ్యకు చాలా ప్రాముఖ్యత వుంది.

**కార్తీక పూర్ణిమ నాడు ఏమి చేయకూడదు ?**

కార్తీక పూర్ణిమ రోజున వెండి పాత్రలు లేదా పాలు దానం చేయకూడదు.ఈ పవిత్రమైన రోజున గదిని చీకటిగా ఉంచకూడదు.కార్తీక పౌర్ణమిని రోజున మాంసాహారం తీసుకోవడం నిషిద్ధం.ఈ రోజు పేదలు, నిస్సహాయులు, పేదవారు ఖాళీ చేతులతో తిరిగి వెళ్లకుండా చూసుకోండి. శక్తి మేరకు అన్నదానం, ధనం దానం చేయండి.

**శివుడి కృపకు గొప్ప మార్గం కార్తీకపౌర్ణమి!!**

ప్రతి నెలలోనూ పౌర్ణమి అమావాస్య రెండూ వస్తాయి. ఏ నెలలో వచ్చినా అమావాస్యను కాస్త చెడు దృష్టితో చూస్తారు. కానీ దీపావళి నాటి అమావాస్య మాత్రం సంబరమే సంబరం. ఇక గురు పౌర్ణమి, మాఘ పౌర్ణమి, శ్రావణ పౌర్ణమి ఇలా ప్రతి మాసంలో పౌర్ణమికి ప్రాధాన్యత ఉన్నా కార్తీకమాసంలో వచ్చే పౌర్ణమి గురించి మాటల్లో చెప్పడం కష్టమే. ఆ నిండు చంద్రుడితో పోటీ పడుతూ శివాలయాలు, దేవాలయాలలో, ఇంటింటి ముంగిట్లో వెలిగే దీపాలు క్రొత్తదనాన్ని తీసుకొస్తాయి.అయితే చాలామంది శివాలయం కు వెళ్లి దీపాలు వెలిగించి శివుడి దర్శనం చేసుకోవడంతో ఎంతో తృప్తి పడిపోతారు. కానీ ఆ దీపారాధన కూడా ఇంకా గొప్పగా ఉండటానికి, ఇంకా ఎన్నో రెట్లు మంచి ఫలితాన్ని ఇచ్చేలా చేసుకోవచ్చు.శివుడు జ్ఞానానికి ప్రతీక, ఆత్మ స్వరూపాన్ని తెలిపేవాడు. ఆయన సమక్షంలో దీపం వెలిగించడం అంటే మనిషి తనలో ఉన్న జ్ఞానాన్ని ఆ దేవుడి ముందు అర్పించడం. అలా అర్పించినపుడు ఆ జ్ఞానదీపానికి శక్తిని ఇస్తాడు ఆ పరమేశ్వరుడు. సాధారణ వత్తులకన్నా రకరకాలుగా అంటే 11 వత్తులు, 41 వత్తులు, 108 వత్తులు, 365 వత్తులు ఇలా రకరకాలుగా వత్తులు సమకూర్చుకుని ఆ



శివుడి సన్నిధిలో దీపాలు వెలిగిస్తారు చాలామంది. దీపారాధనకు ఆవు నెయ్యి ఎంతో శ్రేష్టం. ఇక్కడ ఒక విషయం గమనిస్తే ఆవు నెయ్యి మండటం వల్ల వెలువడే పొగ వాతావరణ కాలుష్యాన్ని శుద్ధి చేస్తుంది. వత్తులు కూడా పత్తిని సన్నని పోరలుగా తీసి, వాటిని చుడుతూ దాదాపు పొగులుపోగులుగా అనేక సంఖ్యలో వత్తులు తయారుచేసుకుని దీపాలు పెట్టేవాళ్లు ఉన్నారు.ఆవు నెయ్యి లేకపోతే నువ్వుల నూనె శ్రేష్టం. నువ్వులు ఎంతో పవిత్రమైనవి. ఇక ఇంకొక విషయం ఏమిటంటే చాలామంది ప్రమిదలకు బదులుగా రసం తీసేసిన నిమ్మచెక్కల్లోనూ, బియ్యం పిండితో ప్రమిధలు తయారుచేసి వాటిలోనూ, ఉసిరికాయలలోనూ వత్తులు వేసి దీపాలు వెలిగిస్తారు. పౌర్ణమి రోజు పరమేశ్వరుడు ముక్కోటి దేవతలతో కలసి శివాలయంలోనే ఉంటాడని ఆరోజు వెలిగించే దీపాల వెనుక పుణ్యఫలానికి అదే ప్రత్యేకత అని పండితుల మాట. సాగరమధనంలో ఉద్భవించిన ఉసిరికాయలో దీపం, ఉసిరిచెట్టు భోజనం చేయడం వల్ల లక్ష్మీదేవి కటాక్షం, శివుడి అనుగ్రహం లభిస్తాయి. మనిషి శరీరంలో ఉండే వాత, పిత్త, కఫ గుణాలను సమతుల్యంలో ఉంచేది ఉసిరి. అలాంటి ఉసిరి దీపం వల్ల వాతావరణం కూడా ఎంతో శుద్ధి అవుతుంది.శివ అష్టోత్తరం, శివుని ప్రణవ పంచాక్షరీ, దీపారాధన, ఇంకా ఆరోజు శక్తికొద్ది బీదవాళ్లకు, బ్రాహ్మణులకు అన్న, వస్త్రాలు, స్వయంపాకం, ఉసిరికాయలు దానం ఇవ్వడం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుంది. అంతేకాదు కార్తీక పౌర్ణిమ రోజు సత్యనారాయణ స్వామి వ్రతం చేయించడం వల్ల అటు పరమేశ్వరుడిని, ఇటు ఆ శ్రీమన్నారాయణుడిని, మరోవైపు శక్తి స్వరూపిణీ అని లలితాదేవి కృపను ఇలా మూడింటిని మాత్రమే కాకుండా ముక్కోటి దేవతలు సంతోషపెట్టిన భాగ్యం దక్కుతుంది.నదీ దీపాల విశిష్టత కూడా ఎంతో గొప్పది. ముఖ్యంగా కార్తీక పౌర్ణమి రోజు అరటి దొన్నెలో కానీ విస్తరాకుల దొప్పలో కానీ దీపాలు వెలిగించి వాటిని నీటిలో అంటే దగ్గరలో ఉన్న నదులు, చెరువులు నీటి పాయలు వంటి వాటిలో వదలడం వల్ల చెప్పలేనంత పుణ్యం లభిస్తుంది. ఇంకా అనువుగా ఉన్న వారు పౌర్ణమి నాడు ఉదయం నదీ స్నానం, సముద్ర స్నానం చేసిన తరువాత ఆ శివుడి పూజ దర్శనం చేసుకుంటే జన్మజన్మల పాపాలు నశిస్తాయి. కార్తీక మాసంలో రోజూ దీపారాధన చేసే అవకాశం దొరకనివాళ్ళు పౌర్ణమినాడు చేసే దీపారాధన, మంత్రం జపం, దానం, పూజ మొదలైన వాటి మాసం మొత్తం పూజ చేసినంత ఫలం కలుగుతుంది.

-పోతుగంటి వెంకటరమణ,
బ్యూరో చీఫ్

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com